www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 226 | మంగళవారం 06-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



- ఖాప్ పంచాయతీల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- తల్లిదండ్రులు, సమాజం తలదూర్చేందుకు వీల్లేదు
- యువజంటలపై చర్యలు చట్టవిరుద్ధం
- పరువు హత్యల నివారణకు సూచనలు ఇవ్వండి : కేంద్రానికి ఆదేశం

మేజర్ల పెళ్లిలో మీ జోక్యమేమిటి..?

పరువు హత్యల వంటి నేరాలతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొంటున్న ఖాప్ పంచాయతీలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. **వివాహం, ప్రేమ వంటి వివాదాల పరిష్కారానికి కోర్టులు, చట్టాలు ఉన్నాయని, ఖాప్ పంచాయతీలుగానీ, తల్లిదండ్రులుగానీ, సమాజంగానీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమిటని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. ఒక అమ్మాయి, అబ్బాయి ఇష్టపడి పెళ్లి చేసుకుంటే, వారి విషయంలో తలదూర్చే హక్కు మూడో వ్యక్తికి లేదంటూ సంచలన తీర్పు ఇచ్చింది.**

న్యూఢిల్లీ : ఇటీవల పరువు హత్యలు పేట్రేగిపోతుండడం, దానికితోడు ఖాప్ పంచాయతీలు ఇష్టమొచ్చినట్టు శిక్షలు విధిస్తూ... ప్రజలను వేధిస్తున్న నేపథ్యంలో శక్తివాహిని అనే ఓ ఎన్జీవో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం సోమవారం విచారించింది. పరువు హత్యలను నిరోధించేందుకు, యువజంటలకు రక్షణ కల్పించడంపై సలహాలు, సూచనలు అందించాలని కేంద్రానికి సూచించింది. దీనిపై స్పందించిన అదనపు సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్.. ఇందుకోసం కొంత సమయమివ్వాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరారు. తమ జీవిత భాగస్వామిని ఎంచుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఇష్టపడి పెళ్లిళ్లు చేసుకున్న జంటలను ప్రశాంతంగా బతకనివ్వాలని ధర్మాసనం పేర్కొంది. ఈ మధ్యనే అంకిత్ సక్సేనా అనే యువకుడు తన ప్రేయసి తల్లిదండ్రుల చేతుల్లో హతమైన

- మిగతా 2 లో

రూ.3 వేల కోట్లు

అర్జెంట్..!

- నిధులు ఆలస్యమైతే ప్రాజెక్టు ఆలస్యం
- రివ్యూలో సీఎంకు అధికారుల వినతి
- పోలవరం ప్రాజెక్టు ప్రగతిపై వివరణ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : పోలవరం ప్రాజెక్టులో కీలకమైన స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలెట్ చానల్, రేడియల్ గేట్ల ఏర్పాటు, డయాఫ్రమ్ వాల్ తదితర పనులకు సంబంధించిన పనులు అనుకున్న గడువులోగా పూర్తి కావాలంటే తక్షణమే రూ.3 వేల కోట్ల నిధులు అవసరమని అధికారులు చెప్పారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టుల పనులు ఎంతవరకు వచ్చాయో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టు 53 శాతం పూర్తైందని, కుడి ప్రధాన కాలువ 91శాతం, ఎడమ ప్రధాన కాలువ 60శాతం నిర్మాణం

- మిగతా 2 లో

చిత్తశుద్ధేది..?

- ప్రత్యేక హోదా, విభజన హామీలపై మొక్కుబడి నిరసన
- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయంపైనా దొంగాట
- గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీల ధర్నా
- చర్చకు టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ నోటీసులు
- లెఫ్ట్ పార్టీల ఆందోళనతో పాలకపక్షం కంటితుడుపు చర్యలు



విశాలాంధ్రబ్యూరో - న్యూఢిల్లీ : రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీకి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినందుకు, ప్రత్యేక హోదా కోసం వామపక్ష పార్టీలు కేంద్రంపై సమర భేరీ మోగించిన నేపథ్యంలో... ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సోమవారం ఉభయ సభల్లో హైడ్రామా నడిపారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందంటూ పార్లమెంటు బయటా.. లోపలా ఆందోళనలు జరిపారు. విభజన చట్టం ప్రకారం తమ రాష్ట్రానికి దక్కాల్సిన హామీలు, ప్రయోజనాలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ టీడీపీ ఎంపీలు పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేతబట్టి 'మాకు న్యాయం చేయండి.. ప్రధాని దీనిపై స్పందించాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో తోట నరసింహం, టీజీ వెంకటేశ్, శివప్రసాద్, రామ్మోహన్ నాయుడు, నిమ్మల కిష్టప్ప, గల్లా జయదేవ్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి, ఎంపీ సీఎం రమేష్ ఈ ఆందోళనలో పాల్గొనలేదు. విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌లో అరకొర నిధులతో అభివృద్ధి సాధ్యపడదని.. అందుచేత కేంద్రం విరివిగా నిధులిచ్చి ఆదుకోవాలని ధర్నాలో పాల్గొన్న ఎంపీలు కోరారు. విభజన హామీలు నెరవేర్చకపోతారా అని చూస్తుంటే.. నాలుగేళ్లుగా నిరాశే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు,

- మిగతా 2 లో

రిక్తహస్తం..!

- చేతులెత్తేసిన రాజ్‌నాథ్
- ఉసూరుమన్న టీడీపీ ఎంపీలు

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో టీడీపీ ఎంపీలు సోమవారం న్యూఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌లో భేటీ అయ్యారు. కేంద్రమంత్రులు సుజనా చౌదరి, అశోక్‌గజపతిరాజుతో పాటు పలువురు పార్టీ ఎంపీలు సమావేశంలో పాల్గొన్నారు. విభజన హామీల అమలు, కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై రాజ్‌నాథ్‌తో చర్చించినట్లు సమాచారం. దక్షిణాది రాష్ట్రాల్లో కెల్లా ఆంధ్రప్రదేశ్ చాలా వెనుకబడి ఉందని, కేంద్రం ఆదుకోవాలని వారు కోరారు. అరగంట సేపు రాజ్‌నాథ్‌తో ఎంపీలు మంతనాలు సాగించారు. బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం, విభజన హామీలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో చర్చించాలని రాజ్‌నాథ్ సూచించారు. పార్లమెంటును స్తంభింప చేయటం వల్ల ఉపయోగం ఉండదని, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని

- మిగతా 2 లో

స్టవ్‌లలో బంగారం



- షాకైన డీఆర్ఐ అధికారులు
- నెల్లూరు రైల్వే స్టేషన్‌లో పట్టివేత

నెల్లూరు : బంగారాన్ని అక్రమంగా గువహతి ఎక్స్‌ప్రెస్‌లో తీసుకువస్తున్న ఓ నిందితుడిని డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు వల వేసి చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుని దగ్గర నుంచి పెద్ద మొత్తంలో స్వచ్ఛమైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం నెల్లూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్నది. గువహతి ఎక్స్‌ప్రెస్ నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఆగింది. అప్పటికే అప్రమత్తమై ఉన్న డీఆర్ఐ అధికారులు ఆ నిందితుడి కోసం గాలిస్తున్నారు. తమకు వచ్చిన సమాచారం ప్రకారం ఎట్టకేలకు ఆ వ్యక్తిని అధికారులు గుర్తించారు. అతడిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అతడి వద్ద రెండు

- మిగతా 2 లో



లాల్‌నీల్ జెండాలు కలిసి పోరాడాలి

- ఎన్నికల్లో పోటీ చేద్దాం.. సీట్లు గెలుపొందుదాం
- మోడీకి సాగిలాపడిన చంద్రబాబు, జగన్
- ప్రత్యేక హోదాపై పోరాడే దమ్ము వారికి లేదు
- చిత్తశుద్ధి ఉంటే టీడీపీ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

3లో

తాగునీటికీ అప్పు...!

- రూ.5,300 కోట్ల బ్యాంక్ రుణం
- వడ్డీ రేటు 7.9 శాతం
- కుటుంబానికి 70 లీటర్ల నీరు
- 8 జిల్లాలకు రూ.6,300 కోట్ల ప్రాజెక్టు
- గ్యారంటీగా రాష్ట్ర ప్రభుత్వం




విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అష్టకష్టాలు పడుతోంది. దాదాపుగా అన్ని శాఖలూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. కనీసం రూ.1000 కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేస్థితిలో ప్రభుత్వశాఖలు లేకపోవటం గమనార్హం. వ్యవసాయం, జలవనరులు, పరిశ్రమలు, గృహనిర్మాణం తదితర విభాగాల్లో అభివృద్ధి పనులకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవటం లేదా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో ప్రాజెక్టులను చేపట్టేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. నదుల అనుసంధానంతో అన్ని ప్రాంతాలకు తాగు, సాగునీటి కొరత లేకుండా చేస్తామని పదే పదే చెబుతున్న ప్రభుత్వం... ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు అప్పులు చేయాలని నిర్ణయం తీసుకోవటం గమనార్హం. కొన్ని జిల్లాల్లో బ్యాంకుల నుంచి రుణం ద్వారా, మరికొన్ని జిల్లాల్లో పీపీపీ విధానంలో ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వెనుకబడిన ఉత్తరాంధ్ర మూడు జిల్లాలతోపాటు కోస్తాలోని ఐదు జిల్లాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గృహ వినియోగానికి రోజుకు 70 లీటర్ల తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కోస్తాలోని తూర్పు గోదావరి,

- మిగతా 2 లో

చంద్రుడిపై ఇస్రో రోవర్

- మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రెడీ
- ఏప్రిల్‌లో ప్రయోగానికి సన్నాహాలు
- ఇస్రో చైర్మన్ శివన్ వెల్లడి



9లో

ఇదీ లోకం!



విభజన హామీలు అడుగుదామని వెళ్లి 'భజన' హామీలు అడిగి వచ్చా!

ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మోడీ పాలన

హిందుత్వ ఫాసిస్టు శక్తులపై సంఘటితంగా ఉద్యమిద్దాం : సురవరం



11లో

పాక్‌కు తగిన సమాధానం చెబుతాం

కాల్పుల విరమణ ఉల్లంఘనను ఖండించిన రాజ్‌నాథ్ సింగ్

9లో

దమ్ముంటే నిరూపించండి

మోడీకి సిద్ధరామయ్య సవాల్

నివురు గప్పిన నిప్పు!

- టీడీపీ, బీజేపీలో ఆరని మంటలు
- ఆగని మాటల యుద్ధం
- కొత్త రాజకీయ సమీకరణ దిశగా...



విశాలాంధ్ర-అమరావతి : కేంద్రబడ్జెట్‌తో మిత్రపక్షాలు తెలుగుదేశం, బీజేపీల మధ్య రగిలిన చిచ్చు ఆరేలా కనిపించడం లేదు. రెండు పార్టీల నేతల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. రెండు పార్టీల మధ్య మిత్రబంధం తెగేలా కన్పిస్తోంది. అదే జరిగితే రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారిపోతాయి. నాలుగేళ్లుగా రాష్ట్ర విభజన సమస్యలను పరిష్కరించకపోవటమే కాకుండా అడిగిన వాటికి సహకరించకుండా కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి పాధాన్యత ఇవ్వకపోవటంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో అమీతుమీ తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. ఆ మేరకే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో చంద్రబాబు ఎంపీలకు పోరాటం చేయాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చంద్రబాబుకు తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దంటూ ఫోన్ చేశారు. దీంతో కేంద్రంలోని పెద్దలను కలిసి చర్చించండి, కాకుంటే పోరాడదామని చంద్రబాబు అన్నారు. ఇదంతా ఓ వైపు జరుగుతుండగా బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలుగుదేశంపై ఎదురుదాడి ప్రారంభించారు. అదికూడా నేరుగా చంద్రబాబునే టార్గెట్ చేశారు. పైగా పార్టీ పెద్దల అనుమతితోనే తాను మాట్లాడుతున్నట్లు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా కె.హరిబాబును కొనసాగిస్తూ తెలుగుదేశాన్ని విమర్శించవద్దని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆదేశాలు ఇచ్చారు. అది జరిగిన రెండవరోజే సోము వీర్రాజు చంద్రబాబుపై తీవ్రపదజాలంతో విమర్శలకు దిగారు. సోము విమర్శలను మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, బుద్దా వెంకన్న, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తిప్పికొట్టారు. తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేశారు. పదవి రాలేదనే అక్కసుతో సోము టీడీపీపై విమర్శలకు దిగారని డొక్కా వ్యాఖ్యానించగా, వీర్రాజు వైసీపీ ఎజెండాతో మాట్లాడుతున్నారని, కౌన్సిలర్‌గా గెలవలేని ఆయనను తమ పార్టీ ఎమ్మెల్సీని చేసిందని, చంద్రబాబును విమర్శించే అర్హత ఆయనకు లేదన్నారు. మాటలయుద్ధం ఇలా సాగుతుండగా రాజమండ్రిలో సోమవారం దేశం పార్టీ కార్యకర్తలు

- మిగతా 2 లో

నిరుద్యోగంపై ఐఎల్‌ఓ హెచ్చరిక

జెనీవా : ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు అనుగుణంగానే నిరుద్యోగం మరింత పెరుగుతున్నదని అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్‌ఓ)హెచ్చరిస్తూ ఈ సమస్య పరిష్కారానికి శ్రద్ధ వహించాలని ఆయా దేశాల ప్రభుత్వాలను కోరింది. ఐఎల్‌ఓ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ ఆయా ప్రభుత్వాలు, సంస్థలు పూర్తి శ్రద్ధ వహించవలసిన అత్యంత భారీ సమస్య అని పేర్కొన్నారు. 2018లో ధోరణులు, సామాజిక అవగాహన, నిరుద్యోగం శీర్షికన ఐఎల్‌ఓ నివేదికను విడుదల చేసింది. 2016లో నిరుద్యోగం పెరుగుదలను నమోదు చేసిన తరువాత స్థిరంగావుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 192 మిలియన్ల మంది నిరుద్యోగులు ఉన్నారని, 5.6 శాతంవద్ద నిలకడగావుందని 2017 నివేదిక తెలిపింది. పారిశ్రామిక దేశాలలోనే పరిస్థితులు మెరుగయ్యాయని 2018లో కనీసం 0.2 శాతం నిరుద్యోగం తరుగుదలను నమోదు చేయాలని ఆయా ప్రభుత్వాలను ఐఎల్‌ఓ కోరింది. 2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభంనాటికంటె నిరుద్యోగుల శాతం తగ్గింది. అయితే పెరిగే జనాభాకు అనుగుణంగా నిరుద్యోగుల సంఖ్య పెరుగుతున్నది.

కోస్టారికాలో ఎన్నికలు

శాంజోస్ : కోస్టారికాలో సోమవారం ఎన్నికలు జరిగాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అధ్యక్ష, రెండు ఉపాధ్యక్ష పదవులకు అలాగే 57 లెజిస్లేటివ్ అసెంబ్లీ పోస్టులకు ఎన్నికలు జరిగాయి. దేశంలోని మొత్తం 33,22,329 మంది ఓటర్లు వీరిని ఎన్నుకుంటారు. గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. సాయంకాలం 6 గంటలకు ఓటింగ్ పూర్తి అయ్యింది. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించారు. 12 నెలల క్రితం కోస్టారికా పౌరసత్వం లభించినవారు కూడా ఈ ఎన్నికలలో పాల్గొనేందుకు అనుమతించారు.



విశాలాంధ్ర ప్రపంచం



సైప్రస్ అధ్యక్షుడుగా నికోస్ గెలుపు

నికోసియా : సైప్రస్ అధ్యక్షుడుగా నికోస్ అనస్టాసియాడెస్ మళ్లీ ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక కావడం రెండవసారి. ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన గెలుపును అధికారికంగా ప్రకటించారు. ఆదివారం ఓట్ల లెక్కింపు జరిగింది. నికోస్‌కు56 శాతం ఓట్లు రాగా ప్రత్యర్థి వామపక్షాలు మద్దతు తెలియజేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి స్టారోస్ 44 శాతం ఓట్లు తెచ్చుకున్నారు. 71 ఏళ్ల నికోస్ దేశంలో జాతుల మధ్య ఏర్పడిన తీవ్ర విభేదాలను పరిష్కరించవలసివుంది. సైప్రస్‌లో జాతులమధ్య ఘర్షణలేకాక, తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొనివుంది. ఈనేపథ్యంలో నికోస్ రెండవసారి ఎన్నికై పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు. గెలుపొందిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారం, ఐక్యత మాత్రమే సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందని అన్నారు. ఎగ్జిట్‌పోల్స్‌లోను నికోస్‌కి మెజారిటీ వస్తుందని వెల్లడైంది. మితవాద డెమొక్రాటిక్ ర్యాలీ పార్టీ నికోస్‌కి మద్దతు తెలియజేసింది. నికోస్ గెలుపొందిన సందర్భంగా ఆయన అభిమానులు వేడుకలు నిర్వహించుకున్నారు. రానున్న 5 సంవత్సరాలలోనైనా దేశంలో ఆర్థిక సంక్షోభంనుంచి ప్రజలు బయటపడగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ అరాచకంపై పోరు

ఐరోపా కార్మికులకు పిలుపు

బ్రస్సెల్స్ : పెట్టుబడిదారి వ్యవస్థ అరాచకంపై కార్మికవర్గం పోరాటం జరపాలని యూరోపియన్ కమ్యూనిస్టు ఇనీషియేటివ్ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. స్టాలిన్‌గ్రాడ్ పోరాటంలో రెడ్ ఆర్మి సాధించిన విజయానికి 75 ఏళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భంగా యూరోపియన్ కమ్యూనిస్టు ఇనీషియేటివ్ జారీ చేసిన ప్రకటనలో ఆనాడు జరిగిన సంఘటనలను పూర్తి చేశారు. నాజీ మూకలను మట్టుపెట్టి రెడ్ ఆర్మీ స్టాలిన్ గ్రాడ్ పోరాటంలో అఖండ విజయం సాధించింది. యుఎస్‌ఎస్‌ఆర్‌కు అనుకూలంగా అనేక విప్లవాత్మక మార్పులు రావడానికి ఈ విజయం దోహదం చేసింది. అంతేకాదు ప్రజలు ఫాసిస్టు వ్యతిరేక విజయం సాధించేందుకు ఈ పోరాటం పునాదిగా నిలిచింది. నేడు యూరోపియన్ యూనియన్, ఇతర బూర్జువా సైద్ధాంతిక శక్తులు చరిత్రను తిరిగి రాసేందుకు, ఆనాడు సోవియట్ యూనియన్ నిర్వహించిన చరిత్రాత్మక పాత్రను, రెడ్ ఆర్మీ పోరాటాన్ని, ఫాసిజాన్ని ఓడించేందుకు లెక్కకుమించి కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తలు చేసిన త్యాగాలను తక్కువచేసిన చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికీ స్టాలిన్ గ్రాడ్ పోరాటం, సాధించిన విజయం, సామ్రాజ్యవాద శక్తులకు మింగుడుపడటంలేదు. సోషలిస్టు తరహా ఉత్పత్తివల్ల కలిగిన ప్రయోజనాలను అంగీకరించేందుకు ఆ శక్తులు సిద్ధంగాలేవు. కమ్యూనిస్టు పార్టీ నాయకులకు విప్లవాత్మకమైన కార్మికవర్గం అగ్రభాగాన నిలిచి ఈ శక్తులపై పోరాటం జరపాలి. పెట్టుబడిదారీ వ్యవస్థపై సోషలిజం అగ్రగామిగా నిలిచిందని చెప్పేందుకు స్టాలిన్‌గ్రాడ్ పోరాటం ఉత్తమమైంది. ఈనేపథ్యంలో ఐరోపా దేశాలలోని కార్మికులు, యువకులు, సైద్ధాంతిక రాజకీయ పోరాటాన్ని నిర్వహించాలని సోవియట్‌కి, కమ్యూనిజానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని తిప్పికొట్టాలని ఆ ప్రకటన కోరింది.



సిరియాలో టర్కీ జోక్యం తగదు

పలు కమ్యూనిస్టు పార్టీల ఖండన

డమాస్కస్ : సిరియాలో టర్కీ జోక్యాన్ని పలు కమ్యూనిస్టు పార్టీలు ఖండిస్తూ ప్రకటన జారీ చేశాయి. అలీవ్ బ్రాంచి పేరుతో టర్కీ దళాలు సైనిక చర్యకు పూనుకోవడం సరైందికాదని ఆ ప్రకటన పేర్కొంది. టర్కీ సైనిక చర్య మూలంగా ఆదేశ ప్రజలు మరింత ఇబ్బందులకు గురవుతారని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టికెపి), జర్మన్ కమ్యూనిస్టు పార్టీ (డికెపి), సిరియా కమ్యూనిస్టు పార్టీ (కెకెఇ) ఆ ప్రకటన జారీ చ ఏసింది. ఆరేళ్ల క్రితం సిరియాలో అంతర్యుద్ధాన్ని ప్రారంభించి దేశాన్ని నాశనం చేశారని ఆ ప్రకటన పేర్కొంది. టర్కీ చర్యలు చిలీ కమ్యూనిస్టు పార్టీ కూడా ఖండించింది. సిరియాలో శాంతిని నెలకొల్పేందుకు వివిధ శాంతి చొరవలు ప్రారంభమయ్యాయని అక్కడ సమస్యను పరిష్కరించకుండా మళ్లీ ఘర్షణను రేపడం సరైందికాదని ఆ పార్టీలు పేర్కొన్నాయి. అమెరికా జోక్యం చేసుకొని తిరుగుబాటు దారులకు, ఉగ్రవాదులకు, కుర్దులకు అన్నిరకాల తోడ్పాటు అందించింది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ప్రభుత్వానికి రష్యా, ఇరాన్‌లు అండగా నిలిచాయి.

లండన్‌లో ఆరోగ్య పథకానికి అనుకూల ప్రదర్శన

లండన్ : జాతీయ ఆరోగ్య పథకాన్ని (ఎన్.హెచ్.ఎస్) పరిరక్షించాలని కోరుతూ ప్రజా అసెంబ్లీ, ఆరోగ్య ప్రచార కార్యకర్తలు కలిసి లండన్‌లో సోమవారం భారీ ప్రదర్శన జరిపారు. అనేక పదుల వేలమంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.వేల్సు, స్కాట్‌లాండ్‌లలో ఆర్యో సేవలకు ఎలాంటి సమస్యలెదురుకావడంలేదు. అయితే టోరీ ప్రభుత్వ పాలనలోనే ఈ పథకానికి సక్రమంగా నిధులు అందించడంలేదు. బ్రిటన్‌లో ఈ పథకం విశిష్టమైనది. ఎన్‌హెచ్‌ఎస్ సేవలను రద్దు చేసేందుకు ఆరోగ్య, సామాజిక భద్రతా విభాగం మంత్రి జెరిమిహంట్ వ్యక్తిగతంగా ప్రయత్నిస్తున్నారని ప్రదర్శకులు ఆరోపించారు. ఆరోగ్య భద్రతా వ్యవహారాలను జరిమిహంట్ చూస్తున్నారు. ఈ పథకానికి నిధులను కోత పెట్టడంవల్ల అనేకమంది మరణానికి కారణమయ్యారు. ఆరోగ్య సేవలను అందించడంలో టోరీ ప్రభుత్వం విఫలమయ్యిందని అత్యవసర నిధులను అందించేందుకు తిరస్కరించిందని వారు ఆరోపించారు. ప్రమాదాలకు గురైన వారిని కూడా ఆసుపత్రుల్లో చేర్చుకుని అత్యవసర చికిత్సలను అందించకుండా అంబులెన్సులలోనే రోగులను నిలిపివేసి ఇబ్బందులపాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతమాత్రం సానుభూతిని ప్రదర్శించడంలేదు. ఆసుపత్రుల్లో అవసరమైన పడకలు లభించడంలేదు. ఈనేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.



జర్మనీలో సంకీర్ణానికి అవకాశాలు...

బెర్లిన్: జర్మనీలో ఫెడరల్ అసెంబ్లీ ఎన్నికలు జరిగి మూడు నెలలకు పైగా గడిచింది. అయినప్పటికీ కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు. ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకోసం పలుమార్లు జరిపిన చర్చలు పూర్తిగా ఒక కొలిక్కిరాలేదు. తాజాగా జరిగిన చర్చలలో అన్ని పార్టీలు ఎస్పోర్ట్సును క్రీడలుగా గుర్తించడానికి అంగీకరించాయి. మరికొన్ని అంశాలపైకూడా సంకీర్ణ భాగస్వా ములు కావడానికి చర్చలు జరుపుతున్న పాలక సీడీయు, మార్టిన్ షుల్జ్‌కు చెందిన ఎస్‌పీడీ పార్టీలు ఒక అంగీకారానికి రావలసిఉంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన చర్చలు కూడా సానుకూలంగా ఉండవచ్చునని భావిస్తున్నారు. ఎస్‌పీడీ సభ్యులు అంగీకరిస్తే, నూతన ప్రభుత్వం స్థానిక క్లబ్బులకు తోడ్పాటు అందించే అవకాశాలు ఉంటాయి. అలాగే ఎస్పోర్ట్స్ క్రీడలలో ఒలింపిక్స్ నిర్వహిం చే అవకాశం కూడా కలుగుతుంది. ఎస్పోర్ట్‌కు క్రీడల గుర్తింపునిస్తూ విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని సిఎస్‌యు పార్టీ నాయకుడు దొరోతీ బార్ తెలిపారు. ఎస్పోర్ట్సును క్రీడలుగా గుర్తించేందుకు సిఎస్‌యు, గ్రీన్స్, ఎఫ్‌పీడీ పార్టీలు గతంలో ఒక ఒప్పందంపై సంతకాలు కూడా చేశాయి. అయితే అది ప్రాంతీయ స్థాయిలోనే జరిగింది. తాజాగా కుదిరిన అంగీకారం ఫెడరల్ స్థాయిలో జరిగింది. ఒక కీలక అంశంపై ప్రధాన పార్టీలు అంగీకారానికి వచ్చినందున నూతన ప్రభుత్వం త్వరగా ఏర్పడగలదన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

చిత్తశుద్ధేది..?

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ ఎంపీల ఆందోళనకు అకాలీదళ్ ఎంపీలు మద్దతు తెలిపారు.

పోటాపోటీ నోటీసులు

విభజన హామీలు నెరవేర్చేలా చర్యలు చేపట్టాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు టీడీపీ ఎంపీలు తోట నరసింహం, కేశినేని నాని, నిమ్మల కిష్టప్ప నోటీసు ఇచ్చారు. విభజన హామీల అమలుపై 193వ నిబంధన కింద చర్చ చేపట్టాలని డిమాండు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాపై వైసీపీ ఎంపీలు సోమవారం లోక్‌సభలో నోటీసు ఇచ్చారు. నాటి ప్రధాని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ రూల్ 184వ నిబంధన కింద చర్చకు అనుమతించాలని నోటీసులో కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై చర్చకు అనుమతి ఇవ్వాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, పోలవరం, రామాయపట్నం ఓడరేవు పూర్తి చేయాలన్నారు. కైరానా ఎంపీ హుకుంసింగ్ గత శనివారం మృతి చెందటంతో సుమిత్రా మహాజన్ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. దీంతో ఏపీకి ప్రత్యేక హోదా, చట్టంలోని హామీలపై చర్చకు అవకాశం లభించలేదు. ఈ స్థితిలో టీడీపీ ఎంపీలు గాంధీ విగ్రహం ఎదుట మొక్కుబడి ఆందోళన చేశారు.

రాజ్యసభలోనూ...

విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ సభ్యులు, టీడీపీ ఎంపీలు రాజ్యసభలో ఆందోళన చేపట్టారు. కేవీపీ రామచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. సభ కార్యకలాపాలకు అడ్డుతగలొద్దని, సభ నిర్వహణకు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు కాంగ్రెస్ సభ్యులను కోరినా ఫలితం లేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడంలో కేంద్రం విఫలమైందని సభ్యులు ఆరోపించారు. గందరగోళం నెలకొనడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు వెంకయ్యనాయుడు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండు చేస్తూ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రైవేటు బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. త్వరలోనే రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

అందరూ అందరే...!

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటు బయటా లోపలా తెలిసేలా నిరసన చేపట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఢిల్లీలోని ఎంపీలతో ఆయన అమరావతి నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'రాష్ట్రానికి రావాల్సినవన్నీ సాధించుకునే విషయంలో రాజీలేదు. ఇస్తామన్నవి ఇవ్వడం లేదు, బడ్జెట్‌లోనూ పొందుపరచడం లేదు. నిధుల కేటాయింపు పూర్తిగా ఉండట్లేదు. ఇవన్నీ పార్లమెంటు, కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి' అని ఎంపీలకు సూచించారు. అన్ని హామీలు నెరవేర్చేవరకు పోరాటాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. మనకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని తెలిసేలా చేయాలని సూచించారు. నిరసన పేరిట పార్లమెంటు ఆవరణలో హడావిడి సృష్టించిన టీడీపీ ఎంపీలు మధ్యాహ్నం పెట్టేబేడా సర్దేశారు. రాజ్యసభలో అమిత్‌షా ప్రసంగం ప్రారంభం కాగానే టీడీపీ ఎంపీలు పిల్లులైపోయారు. తమ పార్టీ అధినేత చెప్పిన ప్రకారం కనీసం మౌన నిరసన కూడా వ్యక్తం చేయలేదు. వైసీపీ పరిస్థితీ అంతే. ఇక ఉదయం పోడియంలోకి దూసుకువెళ్లిన కాంగ్రెస్ ఎంపీలు అమిత్‌షా ప్రసంగాన్ని పొగడ్తల్లో ముంచెత్తారు.

మీ జోక్యమేమిటి..?

(మొదటిపేజీ తరువాయి)

ఘటన గురించి సామాజిక కార్యకర్త మధు కీశ్వర్ ధర్మాసనానికి వివరించారు. ఈ విధంగా యువతపై జరుగుతున్న నేరాలను 'పరువు హత్య' అనడం కన్నా విద్వేషపూరిత నేరాలుగా పేర్కొనడం సబబుగా ఉంటుందని. పరువు హత్య అన్న పదం ఇలాంటి నేరాలకు చాలా చిన్నదన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ మిశ్రా.. యువజంటలను వేధించే హక్కు ఎవ్వరికీ లేదని నొక్కిచెప్పారు. కుటుంబ అనుమతి లేకుండా పెళ్లిళ్లు చేసుకునే వారిపై దాడులు సరికాదన్నారు. పెళ్లిళ్లు చెల్లుతాయా? లేదా?.. పిల్లలు అక్రమ సంతానం అవునా? కాదా?.... ఆస్తి తగదాలు, ప్రేమ వ్యవహారాలను పరిష్కరించేందుకు కోర్టులు, చట్టాలున్నాయని, ఖాప్ పంచాయతీలు లేదా ఇతర వ్యక్తులు గానీ సంఘాలుగానీ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏ మాత్రం లేదని న్యాయమూర్తి తెలిపారు. ఖాప్ పంచాయతీల తరపు సీనియర్ న్యాయవాది కోర్టులో వాదనలు వినిపిస్తూ.. పంచాయతీలు పరువు హత్యలను సమర్థిస్తున్నాయని, ప్రేరేపిస్తున్నాయనడం సరికాదన్నారు. పంచాయతీలు పూర్వం నుంచి కొనసాగుతున్నప్పటికీ కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నాయని కోర్టుకు తెలిపారు. హిందూ వివాహ చట్టం ప్రకారం ఒకే గోత్రానికి చెందిన వ్యక్తులు పెళ్లి చేసుకోవడంపై అభ్యంతరం ఉన్నదని, అలా పెళ్లిచేసుకన్న వారి సంతానం జన్యుపరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. 'మేం కులాలను పట్టించుకోం.. కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తాం.. హర్యానాలో పురుషుల కంటే మహిళలు తక్కువ కావడంతో పక్క రాష్ట్రాల నుంచి వధువులను తెచ్చుకుంటుంటాం' అని న్యాయవాది కోర్టుకు వివరించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ ఖాప్ పంచాయతీల అభిప్రాయంతో తమకు పనిలేదని తేల్చిచెప్పారు. 'మనమిక్కడ ఆచారాలు, వంశం తదితరాల గురించి వ్యాసం రాయడం లేదు. ఇక్కడ వయోజనులకు తమకు నచ్చిన వారిని పెళ్లి చేసుకునే స్వేచ్ఛ, వేధింపుల భయం లేకుండా ప్రశాంతంగా జీవించే హక్కు గురించి మాట్లాడుతున్నాం.ఇప్పుడు ఇదే ముఖ్యం' అని జస్టిస్ మిశ్రా అన్నారు. మానవుల జీవితాల కన్నా ఆచారాలు గొప్పవి కాదన్న విషయాన్ని ఖాప్‌లు సైతం అంగీకరించారు. వయోజనులైన యువతీ, యువకులపై ఖాప్ పంచాయతీలు లేదా ఏదేని సంఘాలు చర్యలు తీసుకోవడం పూర్తిగా న్యాయవిరుద్ధమని న్యాయస్థానం పేర్కొంది. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునే జంటల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఉన్నతస్థాయి పోలీస్ కమిటీని నియమించాలని యోచిస్తున్నట్టు వెల్లడించింది. ఖాప్ పంచాయతీలు, తల్లిదండ్రులు, బంధువుల నుంచి నవజంటలకు రక్షణ కల్పించే బాధ్యతను ఆయా కమిటీలకు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది.

స్మార్ట్ సైకిళ్లపై ఎమ్మెల్యేల సవారీ



విశాలాంధ్ర-అమరావతి : మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సోమవారం స్మార్ట్ సైకిళ్లపై సచివాలయంలో చక్కర్లు వేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ- బైక్ తొక్కడం తనకు తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చిందన్నారు. ఎమ్మెల్యే మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ స్మార్ట్ సైకిళ్లను తీసుకొని రావడం మంచి పరిణామమన్నారు. భారతదేశంలో ఇలాంటి స్మార్ట్‌సైకిళ్లు ఎక్కడా లేవన్నారు. ఆరోగ్యానికి, ఉత్సాహానికి, ఉల్లాసానికి ఈ స్మార్ట్ సైకిల్ ఎంతో బాగుంటుందన్నారు. స్మార్ట్ సైకిళ్లను నవ్యాంధ్ర రాజధాని అమరావతికి తీసుకురావటం మంచి పరిణామమన్నారు.

తాగునీటికీ అప్పు...!

(మొదటిపేజీ తరువాయి)

పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో నూరు శాతం ఇళ్లకు 70 లీటర్ల తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికను రూపొందించింది. రూ.6,300 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లనే కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మిగిలిన రూ.5,300 కోట్లను ప్రభుత్వరంగ సంస్థల నుంచి రుణంగా తీసుకోవాలని సూచించింది. ఆంధ్రప్రదేశ్ తాగునీటి సరఫరా సంస్థ (ఏపీడీడబ్ల్యుఎస్‌సీ) ఈ రుణాన్ని తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాగునీటి సరఫరా విభాగంలో మౌలిక సదుపాయాలు కల్పించటంతోపాటు ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ రంగంలోకి వాణిజ్య బ్యాంకుల నుంచి ఈ రుణాన్ని పొందేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే వడ్డీ రేటు మాత్రం 7.9 శాతానికి మించకూడదని షరతు విధించింది. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చినందుకు ఏపీడీడబ్ల్యుఆర్‌సీ రెండు శాతం కమీషన్‌ను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

పీపీపీ విధానంలో రాయలసీమలో రూ.9,400 కోట్ల ప్రాజెక్టు

రాయలసీమ నాలుగు జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లాలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఎంచుకుంది. అనంతపురం, చిత్తూరు కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో రూ.9,400 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును చేపట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టు వల్ల ఏ మేరకు ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందో అంచనా వేయాలని ప్రభుత్వ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి సూచించింది. ఐదు జిల్లాల్లో పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేసేందుకు ఎంతమేర ఖర్చవుతుందో కూడా అంచనాలు రూపొందించాలని పేర్కొంది. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా టెక్నికల్ కమిటీని కూడా నియమించాలని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

రిక్తహస్తం..! (మొదటిపేజీ తరువాయి)

ఎంపీలకు సూచించినట్లు తెలిసింది. బడ్జెట్ విషయమై ఇప్పటికే తాను చంద్రబాబుతో మాట్లాడినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. చంద్రబాబు కూడా ఢిల్లీ వచ్చి ప్రధానమంత్రిని కలిస్తే మంచిదని సూచించినట్లు సమాచారం. రాజ్‌నాథ్‌ను కలిసిన తర్వాత టీడీపీ నేతలు మీడియాతో మాట్లాడేందుకు ఆసక్తి చూపలేదు. రాజ్‌నాథ్ చేతులెత్తేసినట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇక పోరాటాలే శరణ్యమని ఎంపీలు భావిస్తున్నారు. మోడీని చివరిసారిగా కలిసి అమీతుమీ తేల్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

స్టవ్‌లలో బంగారం

(మొదటిపేజీ తరువాయి)

ఎలక్ట్రిక్ స్టవ్‌లు లభ్యమయ్యాయి. ఆ స్టవ్‌లు బరువుగా అనిపించాయి. దీంతో సుత్తి, స్క్రూడైవర్ లాంటి పరికరాలు తీసుకుని వాటి భాగాలను వేరు చేశారు. వాటిలో దాగి ఉన్న స్వచ్ఛమైన బంగారాన్ని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను డీఆర్ఐ అధికారులు సోమవారం విడుదల చేశారు. గువహతి ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడు బంగారం స్మగ్లింగ్ చేస్తున్నాడని హైదరాబాద్ డీఆర్ఐకు సమాచారం వచ్చింది. వాళ్లు వెంటనే విజయవాడ జోనల్ అధికారులను అప్రమత్తం చేశారు. విజయవాడ అధికారులు వెంటనే నెల్లూరు స్టేషన్‌కు చేరుకుని రైలును ఆపి ఆ ప్రయాణికుడిని తనిఖీలు చేశారు. పర్పుల్ కలర్ బ్యాగ్‌లో రెండు ఎలక్ట్రిక్ స్టవ్‌లను గుర్తించారు. అల్యూమినియంతో తయారు చేసిన ఆ స్టవ్‌లను విప్పి చూడగా అందులో బంగారం అమర్చబడి ఉంది. అల్యూమినియం స్టవ్‌లలో అతడు బంగారాన్ని అమర్చిన విధానం చూసి ఆశ్చర్యపోయిన అధికారులు ఆ బంగారాన్ని తూకం వేసి చూశారు. రెండు స్టవ్‌లలో అమర్చిన మొత్తం బంగారం కలిపి 4658 గ్రాములు ఉంది. దాని విలువ రూ. 1, 43,00 063 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కస్టమ్స్ యాక్ట్ 1962 కింద ఆ బంగారాన్ని సీజ్ చేశామని అధికారులు పేర్కొన్నారు.

ఒడిషాలోని ఖుర్దా రైల్వే స్టేషన్‌లో కూడా ఓ ప్రయాణికుడి నుంచి 15 బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ అధికారులు మరో ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. ఆ బంగారు బిస్కట్లపై మయన్మార్ మార్కింగ్స్ ఉన్నట్లు గమనించామని, నెల్లూరులో పట్టుబడిన బంగారం కూడా మయన్మార్ నుంచే వచ్చినట్లు అనుమానిస్తున్నామని, ఈ రెండు కేసులపై పూర్తి విచారణ చేస్తున్నామని డీఆర్ఐ అధికారులు తెలిపారు.

నివురుగప్పిన నిప్పు! (మొదటిపేజీ తరువాయి)

సోము వీర్రాజు ఇంటి ఎదుట నిరసనలకు దిగారు. ప్రతిగా బీజేపీ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. హిందూపురం బీజేపీ నేతలు టీడీపీపై విమర్శలు చేశారు. ఇలా ఇరుపార్టీల నాయకులు మాటల యుద్ధంలో ఎక్కడా తగ్గకుండా విమర్శించుకుంటున్నారు. ఢిల్లీలో పార్లమెంట్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలు ఏపీకి జరిగిన అన్యాయంపై నిరసనలు వ్యక్తం చేశారు. వెనక్కు తగ్గవద్దని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని, పోరాటానికి వెనుకాడవద్దని చంద్రబాబు తన పార్టీ ఎంపీలను ఆదేశించారు. ఆ తర్వాత కేంద్రమంత్రుల అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి లోక్‌సభలో పార్టీ నాయకుడు తోట నరసింహం, ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, నిమ్మల కిష్టప్పలు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి రాష్ట్ర ప్రయోజనాల గురించి డిమాండు చేశారు. రాజ్‌నాథ్ నుంచి స్పష్టత లభించలేదని తెలుస్తోంది. మనసులో అరలున్నా ఎన్నికల ముందు నుండి చెట్టాపట్టాల్ వేసుకొంటూ మిత్రులుగానే నాలుగేళ్లుగా వ్యవహరిస్తూ వచ్చిన బీజేపీ, టీడీపీ నేతల మధ్య బడ్జెట్ మరింత చిచ్చు రేపింది. అది బహిరంగపోరుగా మారింది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే టీడీపీ, బీజేపీ బంధం ఎక్కువ కాలం సాగదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు కూడా మోడీ రాజధాని శంకుస్థాపనకు వచ్చి నీరు, మట్టి ఇచ్చినప్పుడే గ్రహించినట్లయితే ఏపీ వ్యవహారం ఇంతదూరం వచ్చేది కాదని, చంద్రబాబు మేల్కొనే లోపు రాష్ట్ర ప్రయోజనాలకు పెద్దనష్టం వాటిల్లిందని ఆ పార్టీ సీనియర్లలో వ్యక్తమవుతోంది. చంద్రబాబు ఇప్పటికైనా మేల్కోవటం తమ పార్టీకి మేలు చేసేదేనని అంటున్నారు. ఇక నుండి టీడీపీ రోజుకో కార్యక్రమంతో కేంద్రంపై నిరసనలకు దిగేందుకు కార్యాచరణ రూపొందించుకుంది. టీడీపీ, బీజేపీ విడిపోతే రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణలకు తెరలేచే అవకాశం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇక్కడ ప్రతిపక్షంగాను, ఇక్కడ అధికారంలో ఉన్న టీడీపీ కేంద్రంలో ప్రతిపక్షంగాను వ్యవహరించనున్నాయి. టీడీపీతో విడిపోయిన బీజేపీ... వైసీపీని అక్కున చేర్చుకుంటుందా అన్న అంశంపైనా రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చసాగుతోంది. ఇక జనసేనాధిపతి పవన్ కళ్యాణ్ టీడీపీ, బీజేపీల్లో ఎవరితో పొత్తు పెట్టుకుంటారన్న ఆసక్తి పెరుగుతోంది. బీజేపీతో విడిపోతే వామపక్షాలతో టీడీపీ జతకట్టే అవకాశం ఉందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందులో ఏ ఒక్కటి జరిగినా రాష్ట్ర రాజకీయ స్వరూపం కొత్తరూపు దాలుస్తుంది.

అర్జెంట్..!

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హెడ్ వర్క్స్ 39శాతం పూర్తికాగా, డయాఫ్రమ్ వాల్ నిర్మాణం 66శాతం పూర్తయిందని తెలిపారు. 71శాతం వరకు స్పిల్‌వే, స్పిల్ చానల్ తవ్వకం పనులు, 14శాతం మేర కాంక్రీట్ నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ 58శాతం పూర్తయ్యిందని చెప్పారు. 82 వేల క్యూబిక్ మీటర్ల వరకు ఎర్త్‌వర్క్ తవ్వకం పనులు, 5,314 క్యూబిక్ మీటర్ల వరకు స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు, 18.8 మీటర్ల మేర డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఈ వారం రోజుల్లో చేపట్టినట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం మొత్తం రూ. 12,915.38 కోట్లు ఖర్చు చేయగా, ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత ఖర్చు చేసిన మొత్తం రూ. 7,779.52 అని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ మొత్తంలో గతేడాది డిసెంబరు 31 వరకు కేంద్రం రాష్ట్రానికి రూ. 4,329.06 కోట్లు ఇచ్చిందని చెప్పారు. వరద మళ్లింపునకు సంబంధించి స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలెట్ చానల్, రేడియల్ గేట్ల ఏర్పాటు, డయాఫ్రమ్ వాల్ తదితర పనులకు రూ. 4,375.73 కోట్లు వ్యయం కానుందని అధికారులు అంచనా వేశారు. 2019 కల్లా పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఇప్పటికే రూ. 1,531.53 కోట్లు ఖర్చు చేయగా, మరో రూ. 2,844.20 కోట్లు అవసరం ఉందని, వీటిని తక్షణమే సమకూర్చాలని కోరారు. లేనిపక్షంలో ప్రాజెక్టు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. సీఎం అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ముఖ్యమంత్రికి అభినందనలు

పోలవరం ప్రాజెక్టు సాధనే ధ్యేయంగా మూడున్నరేళ్ల నుంచి అహోరాత్రులు అంకితభావంతో పనిచేస్తూ ఇప్పటివరకు 50సార్లు వర్చువల్ ఇన్‌స్పెక్షన్ చేశారని కొనియాడుతూ ముఖ్యమంత్రిని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ అధికారులు అభినందించారు. ప్రాజెక్టు సమీక్షలో జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ వెంకటేశ్వరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



హైకోర్టును రాయలసీమలో, విశాఖపట్నం , అమరావతిలో హైకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర న్యాయ శాఖా మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చిత్తూరు మాజీ ఎంపి జ్ఞానేందర్‌రెడ్డి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి వినతిపత్రం అందచేస్తున్న చిత్రం

ఏపీ డీఎస్సీ-ఎస్జీటీల ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్(ఏపీ స్టడీ సర్కిల్)లో ఏపీ డీఎస్సీ-సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు టీటీసీ పూర్తిచేసి టెట్‌లో అర్హత సాధించిన 47 ఏళ్లలోపుగల ఎస్సీ, ఎస్టీ బీసీ అభ్యర్థులు అర్హులు. ఎస్సీ అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షలలోపు, బీసీ-సీ అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.1లక్షలోపు ఉండాలి. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల అభ్యర్థులు మార్చి 4వ తేదీలోగా పూర్తి వివరాలతో 'స్పెషల్ ఆఫీసర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ (ఏపీ స్టడీ సర్కిల్), డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్, లెనిన్‌సెంటరు, విజయవాడ-ఆంధ్రప్రదేశ్‌కు దరఖాస్తు చేయాలని కృష్ణాజిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు తెలిపారు. అభ్యర్థులు స్టడీ సర్కిల్ కార్యాలయం(ఫోన్ నంబరు-0866 2574388) నుంచి పూర్తి వివరాలు పొందవచ్చు.



బడ్జెట్ ఆశాజనకంగా లేదు : మంత్రి శ్రీనివాసులు

విశాలాంధ్ర-అమరావతి : కేంద్ర తాజా బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఆశించిన కేటాయింపులు జరుగలేదని సమాచారశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్ర రెవెన్యూ లోటు, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ అంశాల ప్రస్తావన లేక పోవడంతో రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచం లోని తెలుగువారందరూ అసహనానికి గుర య్యారన్నారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన అసంతృప్తిని వ్యక్తం చేసి, కేంద్రపై వత్తిడి తెస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నప్పటికీ తమ ఆలోచనలు, నిరసనలు తెలియజేసి, ఫలితాలు సాధించే వరకు పోరాడతామన్నారు. విభజన హామీలు నెరవేర్చే విషయంలో అన్ని పార్టీలు బాధ్యత తీసుకోవాలని, ఎక్కడైతే విభజన జరిగిందో అక్కడే న్యాయం జరగాలన్నారు. పార్లమెంటుని వేదిక చేసుకొని తమ పార్టీ ఎంపీలు వాదన వినిపిస్తున్నారని చెప్పారు. కేంద్రం సహకరిస్తే రాష్ట్రాన్ని ఇంకా అభివృద్ధి చెస్తామని మంత్రి కాల్వ వెల్లడించారు.

లాల్‌నీల్ జెండాలు కలిసి పోరాడాలి

- ఎన్నికల్లో పోటీ చేద్దాం.. సీట్లు గెలుపొందుదాం
- మోడీకి సాగిలాపడిన చంద్రబాబు, జగన్
- ప్రత్యేక హోదాపై పోరాడే దమ్ము వారికి లేదు
- చిత్తశుద్ధి ఉంటే టీడీపీ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర-ఒంగోలు : లాల్‌నీల్ జెండాలు కలిసి పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ 15వ జిల్లా మహాసభలు స్థానిక రామ్‌నగర్‌లోని 19వ లైన్ సమీపంలోని ఏసీటీ ప్రాంగణంలో ప్రతినిధుల సభ సోమవారం ప్రారంభమైంది. ఈ సభకు అధ్యక్ష వర్గంగా అందె నాసరయ్య, వి.రమణమ్మ, వి.రవి వ్యవహరించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చంద్రనాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ముదివర్తి రాఘవరావు, ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి ప్రకాశరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.అరుణ, నగర కార్యదర్శి ఎస్.డి.సర్దార్, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జెండాను సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) ఆవిష్కరించారు. అనంతరం మృతవీరుల స్థూపానికి నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ లాల్, నీల్ జెండాలు ఒకతాటిపైకి వచ్చి పోరాడాలన్నారు. ఇప్పటికే పార్టీగా తాము అన్ని దళిత సంఘాల కార్యక్రమాలకు హాజరవుతున్నామని, ఏ జాతి ప్రజల కోసమైతే కమ్యూనిస్టు పార్టీలు పని చేస్తున్నాయో ఆ జాతికి మరింత చేరువయ్యే దిశగా ఉద్యమాల నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్ అజెండాను ముందుకు తీసుకువచ్చిందన్నారు. మతోన్మాద చర్యలతో అభ్యుదయవాదులను, చరిత్రకారులను, జర్నలిస్టులను చంపుతోందన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి చర్యలతో పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచి కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని దోచిపెడుతు న్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రత్యేక హోదాపై చిత్తశుద్ధి ఉంటే పార్టీకి చెందిన కేంద్ర మంత్రుల చేత వెంటనే రాజీనామా చేయించాలని డిమాండు చేశారు. ఈనెల 8న నిర్వహించే వామపక్షాల బంద్‌లో టీడీపీ శ్రేణులు పాల్గొనాలని ఛాలెంజ్ చేశారు. మోడీ కాళ్ల కింద చంద్ర బాబు, జగన్ సాగిలాపడి దండాలు పెడుతున్నారే తప్ప ప్రత్యేక హోదా, ప్రజల సమస్యలపై పోరాడే దమ్ము వారికి లేదన్నారు.

ప్రజల విశ్వాసాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోల్పోయాయన్నారు. వీటికి ప్రత్యామ్నాయ శక్తిగా కమ్యూనిస్టులు నిలవాలన్నారు. ఆ దిశగా కమ్యూనిస్టు పార్టీలు ఏకమై రాజ్యాధికారం దిశగా పోరాటాలు చేయాలని రామకృష్ణ అన్నారు. స్థానికంగా ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం క్రియాశీలకంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటులో ఉన్న జిల్లాల్లో రెండవ స్థానంలో నిలిచిన ప్రకాశం, విభజన అనంతరం మొదటి ఏడు స్థానాలలో కూడా కనిపించలేదన్నారు. అభివృద్ధి సాధించలేని స్థితిలో స్థానిక ప్రజాప్రతినిధులు ఉండటమే జిల్లా వెనుకబాటుతనానికి మూలం అన్నారు. ముప్పాళ్ల మాట్లాడుతూ కాలానుగుణంగా పోరాటాలలో మార్పులు రావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలకు పూర్తిగా విశ్వాసం పోయిందని, తృతీయ శక్తిగా వామపక్ష కూటమి ఎదగాలన్నారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు సేవ చేయాలనే చిత్తశుద్ధి లేదన్నారు. కేవలం వారి వ్యాపారాలు నాలుగింతలు పెంచుకునేందుకే రాజకీయ నాయకులు చట్ట సభలలో వాణిని వినిపిస్తున్నారన్నారు. చట్టసభలలో వామపక్షాల ప్రాతినిధ్యం పెరగాలన్నారు. తొలుత పార్టీ సీనియర్ నాయకుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) మాట్లాడుతూ దేశంలో పార్టీకి 90 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ఎందరో పోరాట యోధులు పార్టీ అభివృద్ధికి, పేదల పక్షాన నిలిచి పోరాటం చేశారన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయటమే అమరవీరులకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.

చంద్రబాబు రైతు వ్యతిరేకి

ప్రజా సంకల్పయాత్రలో జగన్

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : తూర్పు, పశ్చిమ గోదావరుల కంటే రబీలో అత్యధికంగా వరిపంట పండే నెల్లూరులో చంద్రబాబు లంచాలు తీసుకొని ఆభూములను కోకోకోలా ఫ్యాక్టరీకి ఇచ్చారని, ముఖ్యమంత్రి రైతు వ్యతిరేకి అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి విమర్శించారు. సంగం, నెల్లూరు బ్యారేజీల కోసం రూ.1100 కోట్లు ఖర్చు చేసి ఆ రోజుల్లోనే 80శాతం ఆధునీకరణ పనులు పూర్తిచేశారని,మిగిలిన 20 శాతం పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడ ఉన్నాయన్నారు. ముదివర్తిలో పెన్నాపై కాజ్ వే కోసం ప్రసన్నా కోరితే.. రూ.250 కోట్ల ఖర్చుతో ప్రపోజల్స్ పెట్టమని వైఎస్ఆర్ ఆదేశించారని, ఆయన మరణం తర్వాత దానిని పట్టించుకున్నవారే లేరన్నారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర సోమవారం నెల్లూరు రూరల్ నియోజవర్గం నుంచి బుచ్చిరెడ్డిపాళెం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నెల్లూరురూరల్, జొన్నవాడ, పెనుబల్లి, సాల్మన్‌పురం, బుచ్చిరెడ్డిపాళెంలో యాత్ర నిర్వహించారు. సాయంత్రం బుచ్చిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కోవూరు సహకార చక్కెర ఫ్యాక్టరీ 1978 నుంచి నడుస్తోందని, చంద్రబాబు సీఎం అయ్యాక 2002లో కొవ్వూరు చక్కెర ఫ్యాక్టరీ, 2002లో నెల్లూరు స్పిన్నింగ్ మిల్లులను మూయించి, కేవలం రూ.12 కోట్లకే రాజ్యసభ ఎంపీ సీఎం రమేష్‌కు అమ్మేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సహకార సంస్థలను మూసివేస్తున్నారని, కొవ్వూరు చక్కెర ఫ్యాక్టరీ కోసం రైతులు కోర్టులో పోరాడారన్నారు. కీ.శే. వైఎస్ రాజశేఖరరెడ్డి వచ్చాక చక్కెర ఫ్యాక్టరీ తెరుచుకుందని రైతులు ఆనందం వ్యక్తం చేసినా,మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఫ్యాక్టరీ మూతపడిందని ఆయన గుర్తు చేశారు. కొవ్వూరులోని 14 మండలాల్లో 5వేల రైతులకు తోడుగా ఉండే ఆ చక్కెర ఫ్యాక్టరీ మూతపడి నాలుగేళ్లైందన్నారు. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.23 కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. దానిపై పోరాటం చేసిన రైతులు, కార్మికులకు చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తానని చంద్రబాబు అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు. కొడవలూరు సమీపంలో ఇఫ్కో సంస్థతో ఫెర్టిలైజర్ ఫ్యాక్టరీ పెట్టాలని మాజీ ప్రధాని పీవీ హయాంలో చర్చలు జరిగాయని, వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఇఫ్కో కిసాన్ సెజ్ కింద ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లటానికి ప్రయత్నాలు జరిగాయని, నాన్న మరణం తర్వాత పట్టించుకున్నవారు లేరని వైఎస్ జగన్ వాపోయారు. పోలవరం ప్రాజెక్టు ఏపీప్రజల ఆశాజ్యోతి అది ఈ స్థితిలో ఉండటానికి చంద్రబాబే కారణమన్నారు. ఆర్యవైశ్యకు చెందిన పేద యువతి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరగా పేదలైన ఓసీ కులాల కు కూడా కార్పొరేషన్ ప్రకటిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయండి

డి.రంగన్న పిలుపు

విశాలాంధ్ర- ఏలూరు : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేసినందుకు నిరసనగా ఈనెల 8న జరప తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రంగన్న పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని విద్యాసంస్థలు తమ సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. సోమవారం ఏలూరు భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు, కోరాడ సుధీర్ బాబు అధ్యక్షతన వివిధ విద్యార్థి యువజన సంఘాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగన్న మాట్లాడుతూ బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం మొండిచేయి చూపడానికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని, రాష్ట్రంలో విద్యార్థి, యువత భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ధ్వజమెత్తారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదాతోనే రాష్ట్రంలో ఉద్యోగాలు సృష్టించవచ్చని, అయితే కేంద్రం ఈ అంశంపై ప్రస్తావనే తేలేదని, దీనిపై ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, పుప్పాల పవన్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఇ భూషణం, వి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శాఖలవారీగా నిధులు రాబట్టాలి

బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని భర్తీ చేసుకోవాలి
టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు చంద్రబాబు సూచన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని, మన సమర్థతను ప్రదర్శించి శాఖాపర కేటాయింపులలో రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ద్వారా ఏ శాఖకు ఎన్ని నిధులొచ్చే అవకాశం ఉందో అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. గరిష్టంగా కేంద్రం నుంచి ఎంత తెచ్చుకోవచ్చు అనేదానిపై శాఖాపరంగా కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. నరేగాకు ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో రూ.55వేల కోట్లు పెట్టినప్పటికీ, సప్లిమెంట్‌గా మరో రూ.10వేల కోట్లు కలిపి రూ.65వేల కోట్ల బడ్జెట్ అందుబాటులో ఉంటుందని అధికారులు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ ఏడాది నరేగా నిధులు రూ.7వేల కోట్లు మనరాష్ట్రం వినియోగించుకోవాలని సూచించారు. నరేగా పనిదినాల సంఖ్య 23 కోట్లకు చేరుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, మెటీరియల్



కాంపొనెంట్ నిధుల వినియోగం 40% మించకుండా చూడాలని, లేబర్ కాంపోనెంట్ పెంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. వాటర్ షెడ్స్ రెండవ దశ పనులు మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. ఈ బడ్జెట్‌లో క్షీర విప్లవం, నీలి విప్లవానికి రూ.10వేల కోట్లు పైబడి కేటాయించిన అంశాన్ని ప్రస్తావించి...ఈ నిధులను రాష్ట్రంలోని ఆక్వా రైతాంగం, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే ఖరీఫ్‌లో ఏ పంటలు సాగుచేయాలో ఇప్పటినుంచే దృష్టి పెట్టాలని, మేలు రకాలు సాగుచేయాలని, ఉత్పాదకత పెరగాలని, సాగు వ్యయం తగ్గాలని, తద్వారా రైతుల నిజ ఆదాయాలు పెంచాలని కోరారు. మద్దతుధరలపై కేంద్రం చేపట్టే విధానం వల్ల వరి ధరల్లో పెరుగుదల పెద్దగా ఉండక పోవచ్చని, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ రాబోయే సీజన్‌లో ఏ పంటలు సాగుచేస్తే ధరలు బాగుంటాయో రైతుల్లో ఇప్పటినుంచే అవగాహన పెంచాలన్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. హుద్ హుద్ తుఫాన్ బాధిత కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తిచేయక పోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతినెలా ప్రతి పంచాయతీకి హెల్త్ బులెటిన్ విడుదల చేయాలన్నారు. పోషకాహార లోపంపై గ్రామాలవారీగా ప్రజలను చైతన్య పరచాలని కోరారు. టెలికాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




బహిష్కృతులు రాజీనామాలు చేయడమేమిటి..?

సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు

విశాలాంధ్ర-తిరుపతి : సీపీఐ ప్రాథమిక సభ్యత్వం, ఏఐటీయూసీ నుండి బహిష్కరించిన తర్వాత రాజీనామా చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు అన్నారు.తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో గ్రూపులు కడుతూ, ముఠాతత్వాన్ని ప్రోత్సహిస్తూ, ఆర్థిక అరాచకత్వానికి పాల్పడుతుండటంతో గత ఏడాది అక్టోబరులో హరికృష్ణ, వెంకటరత్నం, సురేంద్రనాథ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు.అయితే వారు పెట్టిన లేఖ గురించి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని జాతీయ కార్యదర్శి కె.నారాయణ జిల్లా కౌన్సిల్ సమావేశంలో చెబుతుండగా ఒక్కసారిగా వేదిక వద్దకు వెళ్లి వాదించారన్నారు. ఈ లేఖ పెట్టడం తప్పని వెంకటరత్నం, హరికృష్ణలు నారాయణ సమక్షంలో వివరణ రాసి ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వలేదో వారే తేల్చుకోవాలన్నారు.పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో హరికృష్ణ, వెంకటరత్నం, సురేంద్రనాథ్‌లను బహిష్కరించినట్లు తెలిపారు. అక్టోబరు నుంచి నోరు మెదపని వారు బహిష్కరణ వేటు వేయడంతో నేడు మీడియా ముందుకు మరికొందరని బలవంతంగా తీసుకొచ్చి సీపీఐ రాష్ట్ర, జాతీయ నాయకులను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. హరికృష్ణ అవినీతి గురించి ఏర్పేడు. శ్రీకాళహస్తిలోని అతని సొంత ఊరు మడిబాకలోకి వెళ్లి అడిగితే ప్రజలు చెబుతారన్నారు. తన సొంత గ్రామం చెర్లోపల్లిలో అవినీతి గురించి చర్చించేందుకు సిద్ధమని, అతని స్వగ్రామమైన మడిబాకలో చర్చించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి సొసైటీ కల్యాణ మండపం నిర్మాణంతో సంబంధం లేని వెంకటరత్నం, హరికృష్ణలు లెక్కలు అడిగితే సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వాటి లెక్కలు కమిటీలో ప్రతి ఏడాది చర్చిస్తున్నామని రామానాయుడు చెప్పారు. కల్యాణ మండపం పేద, బడుగు, బలహీన వర్గాల పేదలకు సాధారణ రుసుం కూడా తీసుకోకుండా కార్యాలకు ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జె.రామచంద్రయ్య, మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, ఎన్‌డీ రవి, శ్రీరాములు, జె.వి.చలపతి, చంద్రశేఖర్ నాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశి, శివారెడ్డి, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి రామకృష్ణ, శాఖ కార్యదర్శులు తనికాచలం, డి.రామచంద్రయ్య, సిహెచ్.శివ, ఆటో యూనియన్ శివ తదితరులు పాల్గొన్నారు.

8న రాష్ట్రబంద్‌కు కార్మిక సంఘాల మద్దతు



రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపులో చంద్రబాబు విఫలం
ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపులో అన్యాయాన్ని నిరసిస్తూ ఈనెల 8న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు అన్ని కార్మిక, ఉద్యోగ, వర్తక, వాణిజ్య సంఘాలు మద్దతు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాల నాయకు లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ మోసపూరితమైనదని విమర్శించారు. కార్మికులకు రూ.18 వేలు కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ హామీలను, ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ అంశాలను కేంద్రం విస్మరించిందని ఆయన దుయ్య బట్టారు. కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల ఏర్పాటుపై మౌనం వహించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మా ణానికి నిధుల కేటాయిం పులో మొండిచేయి చూపిందని ఎద్దేవా చేశారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఊసేలేదన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు కొమ్ము కాస్తున్నారని ఎద్దేవా చేశారు. వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన ఈ రాష్ట్ర బంద్‌కు ఏఐటీ యూసీ, సీఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఎన్‌టీయూసీ, టీయూసీసీ, ఐఎఫ్‌టీయూ తదితర అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. వైసీపీ, కాంగ్రెస్, జనసేన పార్టీలు బంద్‌లో భాగస్వామ్యం కావాలని సూచించారు. విద్యా వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రులకు ద్రోహం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలపై చంద్రబాబు కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బంద్‌కు మద్దతు పలకాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ విభజన సమ యంలో ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో పొందు పరచలేదని పేర్కొన్నారు. కార్మిక, ఉద్యోగ సంఘాలు బంద్‌లో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు అజయ్‌కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఏపీ బంద్‌కు డీహెచ్‌పీఎస్ మద్దతు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 8న వామపక్షాలు పిలుపునిచ్చిన ఏపీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు దళిత బహుజన పరిరక్షణ సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంటు, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన జిల్లాలకు ఒక్క రూపాయీ కేటాయించలేదని పేర్కొన్నారు. బంద్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీహెచ్‌పీఎస్ నాయకులంతా పాల్గొనాలని కోరారు.

8న లారీల బంద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంద్‌కు మద్దతుగా ఈ నెల 8వ తేదీన లారీలను నిలుపుదల చేస్తున్నామని ఏపీ లార్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌కు అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, రాష్ట్రంలోని లారీలన్నీ బంద్‌లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించి రూ.8 ఎక్సైజ్ డ్యూటీని ప్రజలకు వర్తింపజేయాలని పేర్కొన్నారు. సెక్షన్ 44 ఏఐ సవరణను నిలిపేయాలని, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా ఆదుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు.



ప్రత్యేక హోదా కోసం ఉద్యమిద్దాం

8న రాష్ట్ర బంద్‌కు భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ మద్దతు
రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పేర్కొన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర నేతలతో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విల్సన్ అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలనే డిమాండ్లతో ఈ నెల 8న వామపక్ష పార్టీలు చేపట్టిన బంద్‌కు భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో టీడీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేదని, రుణమాఫీని సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. దళితులపై నిత్యం దాడులు పెరిగాయని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, భూములను పేదల నుంచి స్వాధీనం చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు పెద్దఎత్తున బంద్‌లో పాల్గొనాలని కోరారు. బంద్‌లో మండల కేంద్రాలు, గ్రామీణ, జాతీయ రహదారులను ఎద్దుల బళ్లు, ట్రాక్టర్లతో రైతాంగం, వ్యవసాయ కార్మికులు దిగ్బంధించి మద్దతు తెలపాలని కోరారు.

భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విభజన హామీల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగినా సీఎం చంద్రబాబు నోరుమెదపట్లేదని మండిపడ్డారు.భూ హక్కుల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవడంలో చంద్రబాబు విఫలమయ్యారని అన్నారు. ఈ నెల 8న నిర్వహించే బంద్‌కు విద్యార్థి, యువజన, కార్మిక, రైతు, మహిళా సంఘాలన్నీ మద్దతు ఇచ్చాయని వివరించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.యలమందరావు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలసి రైతులను, ప్రజలను మోసగిస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో భూహక్కుల పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు బుట్టి రాయప్ప, ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు ఆదరణ

విశాలాంధ్ర-అమరావతి : టీడీపీ ప్రభు త్వంలో బీసీలకు ఎక్కువ ఆదరణ లభిస్తోందని సోమవారం సచివాలయ ప్రాంగణంలో జరిగిన బీసీ సబ్ కమిటీ సమావేశం అభిప్రాయపడింది. సమావేశానికి కమిటీ ఛైర్మన్ తిప్పేస్వామి అధ్యక్షత వహించారు. రానున్న బడ్జెట్ బీసీ సంక్షేమానికి అత్యధికంగా నిధులు కేటాయించి వసతి గృహాల్లో సౌకర్యాలు , గురుకుల పాఠశాలలో ఖాళీలను భర్తీచేయాలని కోరారు. ఎన్టీఆర్ విదేశీ విద్యా పథకానికి మంచి స్పందన లభిస్తోందని, ఈ పథకం పట్ల పలువురు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. చంద్రన్న బీమా వంటి సంక్షేమ పథకాలు కూడా బీసీలకు ఉపయోగపడ్డాయని , సివిల్ తదితర పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ ఇస్తుందని అర్హులైన విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వం పెళ్ళి కానుకగా రూ. 35వేలు ప్రకటించిందని, దీనిని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఆదరణ-2 విప్లవాత్మకమైనదని, గతంలో ఆదరణ-1 విజయవంతం చేసినట్లుగా నూతన పథకాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. గీత కార్మికులకు టీవీఎస్ మోపెడ్లు, గొర్రెల కాపరులకు 5 ఎకరాల భూమిని ఇవ్వాలని కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో పీలా గోవింద్, జితేంద్రగౌడ్‌లు పాల్గొన్నారు.

సంపాదకీయం

హిందూ మహాసముద్రం, అరేబియా సముద్ర కూడలిలో ఉన్న మాల్దీవులు నిత్యం ఏదో ఒక సంక్షోభానికి గురికావడం ఆనవాయితీగా మారింది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ నిర్ణయంతో ప్రస్తుతం దేశంలో అశాంతి నెలకొంది. న్యాయ, రాజకీయ వ్యవస్థలకు, అధికారుల్లో ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయమే ఈ ఆందోళనలు, అశాంతికి కారణం. యమీన్ 2013 నుంచి అధికారపగ్గాలు చేపట్టారు. 2012లో జరిగిన ఎన్నికల్లో ఆయన అప్పటికే జైల్లో ఉన్న మహమద్ నషీద్ గయూమ్‌పై గెలుపొందారు. టెర్రరిజం ఆరోపణలపై నషీద్‌కు 13ఏళ్ల జైలు శిక్ష విధించారు. నషీద్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. సుప్రీంకోర్టు ఈ నెల ఒకటో తేదీన తీర్పునిస్తూ ఆయనకు, అదే విధంగా మరో ఎనిమిది మంది రాజకీయ నాయకులకు విధించిన జైలు శిక్షను రద్దు చేసింది. అంతేకాదు, నిరుడు స్పీకర్ అనర్హత వేటు వేసిన 12మంది పార్లమెంటు సభ్యులకు విముక్తి కలిగించింది. అధ్యక్షుడు యమీన్ వెంటనే మల్దీవుల పార్లమెంట్ లేదా మజ్లిస్‌ను సమావేశ పర్చాలని కూడా ఆదేశించింది. ఫిబ్రవరి రెండో తేదీన ప్రభుత్వం ' సుప్రీంకోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉంటాం, వాటిని అమలుచేస్తాం' అని ప్రకటించి కూడా న్యాయస్థానం తీర్పును అధ్యక్షుడు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాడు. తొమ్మిదిమంది నాయకుల కారాగారవాసాన్ని రద్దుచేయడాన్ని ప్రభుత్వం తిరస్కరించడం అతిపెద్ద తప్పిదంగా అక్కడి నిపుణులు పేర్కొంటున్నారు. వీరిలో నషీద్‌తోపాటు యమీన్ ప్రభుత్వంలో పనిచేసిన మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ రక్షణ శాఖ మంత్రి, పార్లమెంటు సభ్యులు, ప్రధాన ప్రతిపక్ష పార్టీల నాయకులు కూడా ఉన్నారు. అధ్యక్షుడు యమీన్ పార్లమెంటును సమావేశపర్చడానికి కూడా తిరస్కరించారు. దీంతో ఇద్దరు పోలీసు ముఖ్యులు, ఒక జైలు అధికారితో సహా పలువురు అధికారులు రాజీనామా చేసి తమ నిరసన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని అభిప్రాయపడిన మరికొందరు అధికారులను ప్రభుత్వం తొలగించింది. దీంతో దేశమంతా ఆందోళనలు మొదలయ్యాయి. అదే సమయంలో రాజకీయపుటెత్తులు, పై ఎత్తుల్లో అక్కడి న్యాయ వ్యవస్థ కూడా భాగం కావడం, ఇష్టానుసారం వ్యవహరిస్తుండటం తదితర కారణాల వల్ల సుప్రీంకోర్టుపై కూడా కొందరు అవిశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నారు. సుప్రీంకోర్టు 'అక్రమ ఆదేశాలు' ఇవ్వలేదు, ఇది రాజ్యాంగ అంశం మాత్రమే అని అటార్నీ జనరల్ ప్రకటించారు. అంటే మాల్దీవులు రాజ్యాంగ సంక్షోభంలో చిక్కుకుపోయిందని అర్థమవుతోంది. వాస్తవానికి మూడు నాలుగేళ్లుగా రాజకీయ ప్రాధాన్యమున్న కేసుల్లో న్యాయస్థానం ప్రభుత్వ అనుకూల తీర్పులే ఇస్తూ వచ్చింది. ఈ కేసులో కూడా అదే తరహా తీర్పు వెలువడుతుందని ప్రభుత్వం భావించింది. కానీ సుప్రీంకోర్టు ఈసారి విపక్షనేతలను విడుదల చేయాలనీ, అనర్హత వేటు చెల్లదని తీర్పునివ్వడంతో ప్రభుత్వం ఖంగుతిన్నది.

మాల్దీవులు తొలుత పోర్చుగీసు, ఆ తర్వాత డచ్ వారి వలస పాలనలో ఉంది. 1887లో సుల్తాన్‌తో జరిగిన ఒప్పందంతో బ్రిటీష్ ఆధిపత్యం మొదలైంది. 1953వరకూ బ్రిటీష్ పాలన కొనసాగింది. ముహమ్మద్ అమీన్ దిది నేతృత్వంలో తొలిసారిగా రిపబ్లిక్ దేశంగా అవతరించింది. ఆయన మత్స్య పరిశ్రమను జాతీయం చేయడం, స్త్రీల హక్కులను ప్రోత్సహించడం, విద్యా వ్యవస్థను సంస్కరించడం వంటి చర్యలు చేపట్టడంతో ముస్లిం ఛాందసవాదులు ఆయన ప్రభుత్వాన్ని కూలదోశారు.

మాల్దీవుల్లో రాజ్యాంగ సంక్షోభం

ఆ తర్వాత బ్రిటీష్ వారి కనుసన్నల్లో 1967 వరకూ సుల్తాన్ పాలనే కొనసాగింది. 1968 నవంబరు 11న రిపబ్లిక్‌గా అవతరించింది. మరో దశాబ్దం పాటు దేశంలో ఆందోళనలు, అశాంతి నెలకొంది. చివరకు 1978లో మౌమూన్ అబ్దుల్ గయూమ్ పాలన ప్రారంభమైంది. వరసగా ఆరు ఎన్నికల్లో ప్రతిపక్షమే లేకుండా ప్రజలు ఆయనకు పట్టంగట్టారు. రాజకీయ స్థిరత్వం ఏర్పడంతో అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. 1980, 1983, 1988లలో ఆయనకు వ్యతిరేకంగా కుట్రలు జరిగాయి. 1988లో భారత్ సైన్యం ఆయనకు అండగా నిలిచింది. 2004లో హిందూ మహాసముద్రంలో వచ్చిన భూకంపం మాల్దీవులను తీవ్రంగా దెబ్బతీసింది. దీనివల్ల 400 మిలియన్ల అమెరికన్ డాలర్ల మేరకు నష్టం వాటిల్లింది. ఇది దాని జీడీపీలో 62శాతం. అప్పటికే గయూమ్ పాలనపై కొంత అసంతృప్తి, ఒత్తిడి ప్రారంభమైంది. మహమ్మద్ నషీద్ స్థాపించిన మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ రాజకీయ సంస్కరణలకు ఉద్యమించింది. 2004లో మొదలై దాదాపు రెండేళ్లపాటు వెల్లువెత్తిన ఉద్యమాలను అణచడం సాధ్యం కాలేదు. చివరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు అంగీకరించాడు. 2008లో తొలిసారిగా ప్రత్యక్ష పద్ధతిలో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. గయూమ్‌పై అప్పటికి జైల్లోనే ఉన్న మహమ్మద్ నషీద్ విజయం సాధించారు. అంతా సవ్యంగా ఉంటే మాల్దీవుల్లో ప్రజా స్వామ్యం వేళ్లూనుకునేది. కానీ అదే సంవత్సరం పుట్టుకొచ్చిన ఆర్థిక మాంద్యం ఆ దేశాన్ని అతలాకుతలం చేసింది. కొత్తగా అధికారంలోకొచ్చిన నషీద్ ఆర్థిక, రాజకీయ సంస్కరణలు ప్రారంభించి చక్కదిద్దుతున్న సమయంలోనే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, ఉపాధి అవకాశాలు తగ్గడం, నిరుద్యోగం పెరడం తదితర కారణాలతో జనంలో అసంతృప్తి పెరిగింది. నషీద్ సైతం నియంతృత్వ విధానాలనే ఆశ్రయించారు. మాజీ అధ్యక్షుడు గయూమ్‌పై వచ్చిన అవినీతి కేసుల్లో చర్యలకు అడ్డుపడుతున్నారన్న కారణంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్లా మహమ్మద్‌ను 2012లో అరెస్టు చేయించారు. 2012 ఫిబ్రవరిలో సైనిక తిరుగుబాటు జరగడంతో నషీద్ రాజీనామా చేశారు. 2013లో జరిగిన ఎన్నికల్లో నషీద్‌ను ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఓడించారు. అయితే ఆ ఎన్నికల్లో పెద్దయెత్తున అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. మాజీ అధ్యక్షుడు గయూమ్‌కు ప్రస్తుత అధ్యక్షుడు యమీన్ సమీప బంధువే. వారిద్దరి సంబంధాలూ చెడి ఆయన నషీద్‌తో చేతులు కలపారు. ఈ క్రమంలో 2015లో యమీన్‌పై దాడి జరిగింది. దీంతో వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ అదీబ్, ఆయన అనుచరులు 17మందిని అరెస్టు చేశారు. అప్పట్లో గయూమ్ అనుకూల ఎంపీలు విపక్షంలోకి ఫిరాయించడంతో ప్రభుత్వం మైనారిటీలో పడింది. ఇలా ఫిరాయించినవారిని స్పీకర్ అనర్హులుగా ప్రకటించడం చెల్లదన్న సుప్రీంకోర్టు తాజా తీర్పును అమలుచేయడానికి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో మళ్లీ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. అధికార, విపక్షాల నిరంతర ఘర్షణలతో అట్టుడుకుతున్న మాల్దీవుల్లో ఈ ఏడాది ఆఖరులో ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఆ ఎన్నికలను వెనువెంటనే నిర్వహించడమే ఈ సంక్షోభానికి పరిష్కారమని ఆ దేశ రాజ్యాంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికలైనా ప్రశాంతంగా జరుగుతాయా అన్నది ప్రశ్నార్థకమే!

చురక

తెలంగాణ రాజకీయ
తెరమీదకు జేపసి
తెరాసాను ఓడించెనా
తెగువతోని కత్తిదూసి

పార్టీలు పెరిగి విడిగా
పోటీ చేస్తే కష్టం
ప్రభుత్వం వ్యతిరేకత
పంచుకుంటే నష్టం

– వేల్పుల నారాయణ

విశ్లేషణ

ఇంకా నేల విడిచి సాముచేస్తున్న చంద్రబాబు



వి. శంకరయ్య

కేంద్రంతోపాటు బీజేపీతో తెగతెంపులు చేసుకునేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నట్లు కన్పించడం లేదు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం కాక ముందే బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడినట్లు టీవీలలో లీకులు ఇచ్చారు. తీవ్ర నిర్ణయాలేవీ గైకొనడం లేదనే భావన రాష్ట్ర ప్రజల్లో కల్గించేందుకు అనువైన వాతావరణం కల్పించుకున్నారు. ఇంత ఆదుర్దాకు బలమైన నేపథ్యం ఉంది. టీడీపీ సమన్వయ సమావేశం తదుపరి మంత్రివర్గ సమావేశం నిర్వహించి ఆదివారం జరిగే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆఖరి పోరాటం చేయనున్నట్లు మీడియాకు సమాచారం అందజేశారు. పార్టీ పార్లమెంటరీ సమావేశంలో ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకుంటారని ఎలక్ట్రానిక్ మీడియాలో వార్తలు వచ్చాయి. బీజేపీతో తెగతెంపులు జరిగిపోతుందన్న ప్రచారం జరిగింది. బెదిరిపోయిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఫోన్‌లో సంప్రదించినట్లు ప్రచారంలో పెట్టారు. అలా మాట్లాడి ఉంటే బీజేపీ నేతలకు సంకేతాలు వచ్చేవి. తుదకు అదంతా అబద్ధమని తేలిపోయింది.

రాష్ట్ర వాస్తవ ఆర్థిక చిత్రం ఎరిగినవారు ముఖ్యమంత్రి కేంద్రంతో తెగతెంపులు చేసుకుంటారని ఏమాత్రం భావించలేదు. ఈ ప్రచారంతో ప్రధాని మోడీ భయపడతారని కూడా భావించలేదు. ఒకవేళ అదే జరిగి ఉంటే హుటాహుటిగా ముఖ్యమంత్రికి ప్రధాని అపాయింట్‌మెంట్ ఇచ్చి చర్చలకు పిలిచి ఉండేవారు. తుదకు పార్లమెంటులో ఆందోళన చేస్తారని ప్రకటించినా అదికూడా పరిమితమని తేలిపోయింది. ఆదివారం సాయంకాలం అయ్యేసరికి అంతా చల్లబడిపోయింది. తుదకు హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్‌చేసి అనునయించినట్లు తిరిగి ప్రచారంలో పెట్టారు. కేంద్ర ప్రభుత్వంతో తెగతెంపులు చేసుకొంటే ఎన్నికల్లోపు ప్రభుత్వాన్ని నిర్వహించడం పైగా 2019 ఎన్నికలలో విజయం సాధించి తిరిగి అధికారం చేపడతామనే నమ్మకం పార్టీ నేతలకే కాదు ముఖ్యమంత్రికి కూడా లేదనిపిస్తోంది.

కేంద్రప్రభుత్వం ముఖ్యమంత్రిని బుజ్జగించాలని వాస్తవంగా భావించి ఉంటే ఆదివారంనాడే రాష్ట్ర బీజేపీ నేతలు తెలుగుదేశం పార్టీపై చెలరేగిపోయి ఉండేవారుకాదు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు హరిబాబు దేశ స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి ఇంతవరకు కేంద్రంలోని ఏ ప్రభుత్వమూ చేయని సాయాన్ని ఈ మూడున్నరేళ్ల కాలంలో ఏపీకి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిందని బల్లగుద్ది చెబుతూ సూటిగా ముఖ్యమంత్రి వాదనను పూర్వపక్షం చేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు అయితే, లక్ష్మీపార్వతి తప్ప ఏ రాజకీయనేత ప్రస్తావించని విధంగా ఎన్‌టిఆర్‌కు జరిగిన ద్రోహాన్ని వివరిస్తూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో 10కోట్లు అవినీతి జరిగిందని పైగా ముఖ్యమంత్రి వ్యక్తిగత ఆస్తులు గురించి తీవ్ర ఆరోపణలు చేశారు.

ముఖ్యమంత్రి తాటాకు చప్పుళ్ళకు కేంద్రం భయపడిపోయి హోంమంత్రి చేత ఫోనులో మాట్లాడించి టీడీపీ తిరుగుబాటును నిలుపుదల చేయదలచి ఉంటే ఆ సంకేతాలు రాష్ట్ర బీజేపీ పార్టీ నేతలకు చేరి ఉండేవి. కేంద్రప్రభుత్వం కూడా ముఖ్యమంత్రిని ఒకవైపు అనునయిస్తూ మరోవైపు రాష్ట్ర పార్టీ నేతల చేత టీడీపీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నది. సోము వీర్రాజు అయితే సెంటిమెంట్‌ను రగిల్చారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో అమలు జరిపే పథకాల సందర్భంగా ప్రధాని మోడీ ఫోటో పెట్టడం లేదని ఆరోపించారు. ఇదంతా చూస్తుంటే బీజేపీ, టీడీపీ పార్టీల వ్యవహారంగా మార్జాల దాంపత్యాన్నిపోలి కథ నడుస్తోంది. ప్రస్తుత సమస్య ఇది కాదు. రాష్ట్ర ప్రజలకు కేంద్రం నుండి రావలసిన నిధులు, రాయితీలు. ఇరుపార్టీలు వాద వివాదాల మధ్య ప్రజల సమస్యలు మరుగు పడుతున్నాయి. గత మూడున్నరేళ్ళుగా పెను నిద్రపోయిన ముఖ్యమంత్రి తాజా బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తే ఒక్క సంవత్సరంలో రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు ఎలా నడపగలరనేది నేడు కీలక ప్రశ్నగా తెరమీదకు వచ్చింది. ఈ మూడేళ్ళ కాలంలో పోలవరం ప్రాజెక్ట్‌లో 7 వేల కోట్లకు మించి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయింది. ఒకవేళ కేంద్రం నిధులు ఇచ్చి, కాపర్ డ్యామ్ నిర్మించినా దాదాపు 33 వేల కోట్ల రూపాయలు వ్యయం చేసి భూసేకరణ జరిపి నిర్వాసితులకు పునరావాసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించగలదా? ఈ కీలక ప్రశ్నలే ఇదివరలో నిపుణుల కమిటీ తెరమీదకు తెచ్చి కావర్ డ్యామ్ నిర్మాణాన్ని 31 మీటర్ల వరకే అనుమతించింది. మంత్రి మాణిక్యాలరావు చెప్పినట్లు రాజధాని డిజైన్ల నిర్ధారణ కానప్పుడు డిపిఆర్లు ఎలా తయారు చేయగలరు? అంటూ రాష్ట్ర పరువు తీశారు.

తాజా బడ్జెట్లో ఏపీకి ఘోర అన్యాయం జరిగింది వాస్తవం. కొద్దిపాటు పద్దులు కూడా బడ్జెట్‌లో లేవు. గత మూడు బడ్జెట్ల సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనముని పాత్ర వహించారు. అదే నేడు శాపమైంది. ఒకవేళ చర్చలు జరిగి కేంద్రం ఎంతో కొంత కరుణించినా గత మూడేళ్ళలో రాష్ట్రం కోల్పోయిన సాయాన్ని పూడ్చగలదా? వాస్తవం అదికాదు. ఎన్నికలు సంవత్సరంలో వస్తున్నాయి. ప్రజల ముందు. దోషిగా నిలబడవలసి వస్తుందని కపటనాటకానికి తెరతీశారు తప్ప అంతకు మినహా మరేమీకాదనిపిస్తోంది.

ఇప్పటికైనా కేంద్రం ప్రభుత్వం నుండి నిధులు రాబట్టాలనే ధ్యాస ముఖ్యమంత్రికి ఉంటే వామపక్షాలు ఇచ్చిన బంద్‌పిలుపులో తెలుగుదేశం శ్రేణులు పాల్గొనాలి. తనపై కేసులు బనాయిస్తారనే భయపడి కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేక పోతున్నానని ప్రజల్లో వ్యాపిస్తున్న ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకు తెలుగుదేశం నేతలు గట్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి. వాస్తవం చెప్పాలంటే ఈ బలహీనతపైననే కేంద్రం ఇన్నాళ్ళు దాడి చేస్తోంది. ఒకవేపు కేంద్రం మరోవేపు రాష్ట్రం టీడీపీ, బీజేపీ పార్టీలు మూడేళ్ళుగా సయ్యాటలాడి ఎన్నికలు ముంచుకొస్తున్న దశలో గగ్గోలు ప్రారంభించడం ఏపీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఈ దొంగాటను నిలువరించేందుకు రాష్ట్రంలోని వామపక్షాలు ప్రజాతంత్ర శక్తులు దీర్ఘకాలిక సమైక్య పోరాటానికి సిద్ధంకావలసి ఉంది. ప్రశ్నించడానికే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఇంత వరకు చెబుతూ వచ్చిన "అజ్ఞాతవాసి" వాస్తవంగానే అజ్ఞాతంలోనికి వెళ్ళారు. మరోవేపు ప్రధాన ప్రతిపక్షం "రోప్ డ్యాన్స్" చేస్తోంది. ఎలాంటి రాజకీయ స్వార్థంలేని వామపక్ష ప్రజాతంత్ర శక్తులు అభ్యుదయ గ్రూపులు వ్యక్తులు దివాలా తీయనున్న ఈ రాష్ట్రాన్ని ఉద్ధరించేందుకు సమైక్య పోరాటం ప్రారంభించవలసిన ఆవశ్యకత నేడు తెరమీదకు వచ్చింది.

వ్యాస రచయిత : విశ్రాంతిపాత్రికేయుడు,
సెల్ : 9848394013

కొత్తగా పాడుతున్న పాతపాట

తోకల రాజేశం

'ఒక జాతిని కానీ దేశాన్ని కానీ చీల్చాలంటే అందుకు మతాన్ని మించిన ఆయుధం లేదంటాడు' జార్జ్ బెర్నార్డ్ షా. ప్రస్తుతం దేశాన్నేలుతున్న వాళ్లకీవిషయం బాగా తెలుసు. హిందువులు, హైందవేతరులు అన్న స్పష్టమైన విభజనరేఖ గీసి దేశాన్ని చీల్చే ప్రయత్నాలను గతం కంటే విభిన్నమైన పద్ధతుల్లో-రూపాల్లో చేస్తున్నారు. రాజకీయరంగం ద్వారా వీళు పాల్పడుతున్న కలుషిత కార్యక్రమాలకు వంతపాడుతూ భావజాల రంగంలోని కొందరు మతమేధావులు ప్రజలను తప్పుదోవ పట్టించే బాధ్యతను తమ పవిత్ర కర్తవ్యంగా భుజాలమీదికెత్తుకున్నారు. వీళ్లు సాహిత్యానికి మతోపదేశాలు చేస్తారు. చరిత్రను కాషాయీకరిస్తారు. దేశాన్ని బ్రాహ్మణకరిస్తారు. అదే శరణ్యమని-కాదంటారా? అంతు చూస్తామని బెదిరిస్తారు. తెలుగునేల అలాంటి పవిత్ర బాధ్యతను నెరవేరుస్తున్నవారు ముదిగొండ శివప్రసాద్. "హిందువులంతా హిందువులేనా? (వ్యాసం, జనవరి 30, 2018 నాటి ఆంధ్రభూమి దినపత్రిక) అని ప్రశ్నించటం అందులో ఒక భాగమే.

ప్రస్తుత వ్యాసం చదివిన వాళ్లకు ఆ విమర్శలో నిజం లేకపోలేదనిపిస్తుంది. అవే పాత కోతలు, చరిత్ర వక్రీకరణలు, అసత్య ప్రచారాలు, చరిత్రకు నిలబడని నిలకడలేని సొంత భాష్యాలు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లు శివప్రసాద్ చేతికి చరిత్ర చిక్కింది. దాన్ని తనివితీరా రక్తాలు కారేలా రక్కకపోతే ఆయన పెన్నుకు విశ్రాంతి కలుగదు.

హిందువులు ఉగ్రవాదులని సినీనటుడు కమల్‌హాసన్ అన్నారని, ఆయన దేశద్రోహి అని కాకినాడ శ్రీపీఠం అధిపతి శ్రీ పరిపూర్ణానంత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ముదిగొండ వ్యాసం ప్రారంభించారు. హిందువులను ఉగ్రవాదులు అని కమల్‌హాసన్ అనలేదు. 'దేశంలో హిందూ ఉగ్రవాదం పెరిగి పోతుందని' అన్నాడు. దేశంలో ఇటీవల హిందూమతం పేరు మీద జరుగుతున్న ఉగ్రవాద చర్యల నేపథ్యంలో ఆయన అలా అనవలసి వచ్చింది. అలాంటి ఒక అర్థంలో ఎమర్జెన్సీలాంటి పరిస్థితులు నేడు దేశంలో లేవని ముదిగొండ అనగలరా? కమలహాసన్ లేవనెత్తిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక ఆయన అనని మాటలను అంటగట్టటం కుటిల నీతి. ప్రశ్నించిన వాడినల్లా దేశద్రోహుల జాబితాలో జమకట్టే అపరిపూర్ణులను సమర్థించటం వల్ల ముదిగొండ అపార అజ్ఞానాన్ని బయటపెట్టుకోవటానికి మించి సాధించేదేమీ వుండదు.

ఇక హిందూ శబ్దానికి శివప్రసాదు తనదైన స్టయిల్‌లో కొత్త నిర్వచనమిచ్చాడు. 'హిం' అంటే హింస, దు అంటే దూషించటం, హింసా మార్గాన్ని వదిలిపెట్టినవాడే హిందువు అని ఈ పదానికి అర్థమట. హిందూ పదానికి ఇంత చక్కటి నిర్వచనం ఇచ్చినందుకు భవిష్యత్తులో నోబెల్ పురస్కారాన్ని హిందూదేశ చక్రవర్తి నరేంద్ర మోడీ ఇప్పిస్తాడన్న నమ్మకం నాకుంది. అదలా వుంచితే ఈ నిర్వచనానికి ఏ వేదం ఆధారమో? ఏ పవిత్ర గ్రంథం చెప్పిందో సెలవిస్తారా? నిర్వచనాలన్నవి మన ఇష్టాయిష్టాలకనుగుణంగా ఇచ్చుకునే వేనా? మతాలన్ని హింస నుంచి పుట్టినవే. హింస లేకుండా మతం బతికి బట్టకట్టిన చరిత్ర లేనేలేదు. ఒక మతం తన ప్రాబల్యం కోసం ఇంకో మతం మీద హింసను ప్రయోగించటం చరిత్రలో మనం చదువుకున్నదే. హిందూ మతంలో ముఖ్యంగా శైవ వైష్ణవుల మధ్య జరిగిన రక్తపాతాలు హింసకు సంబంధించినవి కావా? చచ్చిన పీనుగు మీద తెల్లగుడ్డ కప్పినంత సులభంగా చరిత్రను చంపి దాని మీద కాషాయం గుడ్డ కప్పటం సాధ్యం కాదు. కాషాయవాదులకు ఇది ఎన్నటికీ తీరని కోరికే.

ముదిగొండ - "కమల్‌హాసన్‌ను సూపర్‌స్టార్‌ను చేసింది హిందువులు. కానీ, ఇవ్వాళ అతను హిందువులు ఉగ్రవాదులు అంటున్నాడు. శ్రీపీఠం అధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వామి చెప్పినట్టు హిందువులను ఇంతగా ద్వేషించేవాడు చైనాలో, పాకిస్తాన్‌లో, బంగ్లాదేశ్‌లో సుఖజీవనం సాగించవచ్చు కదా! వాటికన్‌లో తెల్లవాళ్లే పోపులేమవుతారు. కానీ నల్లని ద్రావిడ షెపర్డు ఐలయ్యను ఎన్ని జన్మలెత్తినా పోపును చేయరు. ఇండియాలో ఉన్నంతవరకే వీరికి బతుకుదెరువు" అని దబాయిస్తున్నారు. ఒకవైపు శూలంతో గుచ్చుతూనే... చూశారా మాకెంత సహనం వుందో. మీ ప్రాణాలను తీయలేదు. మాది అహింసా సిద్ధాంతం అని చెప్పినట్టుగా వుంది వీరి వ్యవహారం. వేరే దేశాలకు వెళ్లండని చెప్పే హక్కు-అధికారం వీళ్లకెవరిచ్చారు. బ్రాహ్మణీయ భావజాలం మీది ద్వేషాన్ని తెలివిగా - కుట్రతో హిందువుల మీది ద్వేషంగా ప్రచారం చేయటం, హిందువులను ఇతర మతాల వాళ్లకు వ్యతిరేకంగా రెచ్చగొట్టటం ఒక పథకం ప్రకారం బ్రాహ్మణీయ కుట్రదారులు చేస్తున్న పని. ఈ రకరకాల వ్యాఖ్యలు వ్యాఖ్యానాలన్ని మతం పేరు మీద సాగించే విభజన రాజకీయా లకు సిగ్గులేకుండా వంతపాడటంలో భాగమే. ఐలయ్య పోప్ కాలేడు సరే హిందూ మతంలోని ఒక మాదిగను తిరుమల తిరుపతి ప్రధాన పూజారిగా మీరు చేయగలరా? తమరివి బంగారు గజ్జెలే కాని ఎదుటివాని కాలివి ఇనుప గజ్జెలా? ఎదుటి వాణ్ని నిందించే ముందు మన దగ్గర ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలి. పెన్నుంది కదా అని పిచ్చి పిచ్చి రాతలు రాసి పరువు పోగొట్టుకునే బదులు శ్రీరామకోటి రాసుకుంటే మంచింది. కమలహాసన్ రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయలనుకుంటున్నాడని - అయితే తన అభిమానులతో కలిసి వరదలలో చిక్కుకున్న చెన్నై ప్రజలకు సేవ చేయవచ్చు. అడయార్ నదీ పరివాహక ప్రాంతాలలో పూడికలు తీయవచ్చు. ఐదు రూపాయలకే భోజనం పెట్టవచ్చు అని సూచనలిస్తున్న ముదిగొండ ఎంతమంది భాజాపా వాళ్లకు ఈ సూచనలు ఇచ్చాడో తెలుసు కోవాలనుంది. అలా పనిచేయకపోతే (పనులు చేయకపోతే) ప్రజా సేవ చేసే అర్హత లేనట్టేనా. ఇప్పుడున్న నాయకులందరూ ఆ పనులే చేస్తే కమలహాసన్ రాజకీయాల్లోకి రావలసిన అవసరం ఎందుకు ఏర్పడుతుంది? పదవుల్లో వుండి పనిచేయని నాయకులను ప్రశ్నించకుండా రాజకీయాల్లోకి ఇంకా అడుగు కూడా పెట్టని కమల్‌ను బెదిరించటం ఎవరి ప్రయోజనాల కోసం? మోడీయుల కోసం అని కొత్తగా చెప్పనక్కరలేదు. ముదిగొండ ఇలా పాడటం కొత్తకాదు. పాతపాటనే కొత్తగా పాడటం ముదిగొండ వారికి మతంతో పెట్టిన విద్య.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు,
సెల్ : 9676761415

మిత్ర భేదం.. మిత్రలాభం..!

బి.బాబు బహదూర్

తొమ్మిందింటికీ మంచు దట్టంగా పట్టే ఉంది. యాభై గజాల దూరంలో ఏమీ కనిపించటం లేదు. రెండో పంటకి నీరు లేదు. పెసర, మినుము చల్లారు. ఊళ్లో పనులూ లేవు. చలి మంట ముందు జనం కాగుతున్నారు. ఆకలనిపించి ఏడూళ్ల సూరిగాడు లేచి నిలబడి దుప్పటి సర్దుకున్నాడు. నేరుగా సుబ్బయ్య హోటల్‌కి బయలుదేరాడు. అప్పటికే హోటల్ కిటకిటలాడుతోంది.

"ఇక అప్పులు పెట్టలేనబ్బ" సుబ్బయ్య కసురుకున్నాడు.

"రేపు ఇచ్చేస్తాలే" పంచాయతీ బోర్డు మెంబర్ సీతయ్య సణిగాడు.

"అయ్యా ఇక చాలు. ఇప్పటికే ఐదొందలు దాటింది, నీకో నమస్కారం" సుబ్బయ్య దండం పెట్టాడు.

"రోడ్డు బిల్లు రాగానే ఇచ్చేస్తా" సీతయ్య కదల్లేదు.

"రోడ్డుతో నీకేం పని. కాంట్రాక్టర్ పని చేశాడు. డబ్బులు ఆయనకే ఇస్తారు. ఎందుకయ్యా దొంగమాటలు"? సుబ్బయ్య మళ్లీ ఈసడించుకున్నాడు.

"ఆ బిల్లు అవ్వాలంటే నా సంతకం ఉండాలి" సీతయ్య గొప్పగా చెప్పాడు

"నీకు సిగ్గులేదు, నాకు బుద్దిలేదు" అంటూ ప్లేటులో నాలుగు ఇడ్లీలు ఇచ్చాడు. సీతయ్య సుతారంగా ఇడ్లీని తుంచి చెట్నీలో అద్ది నోట్లో వేశాడు. ఇదంతా చూసి సూరిగాడు నవ్వుకున్నాడు.

"ఇలా బతికేస్తున్నారు నాయాళ్లు" మనసులో అనుకున్నాడు.

"ఏంకావలాన్నా" సూరిగాడిని చూసి సుబ్బయ్య అడిగాడు.

"పెసరట్టు, అల్లం, మిర్చి దట్టించు" సూరిగాడు ఆర్డరిచ్చాడు.

ఏడూళ్ల సూరిగాడు

నెమ్మదిగా సీతయ్య దగ్గరకు వెళ్లాడు. సూరిగాడిని చూసి సీతయ్య పళ్లిగిలించాడు.

"ఏరా.. పదెకరాల ఆసామివి. కోటీశ్వరుడివి. ఇంత హీనంగా తిట్టించుకుని ఇడ్లీ తినాల్సిన ఖర్మేంటీ"? సూరిగాడు అడిగాడు. గ్లాసులో నీళ్లు గటగట తాగి బ్రేవ్ మని తేన్చి.."బాబాయ్ ఆడలా తిడతాంటే భలే మజాగా ఉంటాది. నన్ను చూడగానే ఆడి ముఖం నల్లగా మాడిపోద్ది. ఏడుపే తక్కువ. ఎంత గింజుకున్నా వదలకుండా వాడిని పీడిస్తే ఎంతో ఆనందంగా ఉంటాది. ఆడు కక్కలేదు. మింగలేదు. చచ్చినట్టు అప్పు ఇవ్వాల్సిందే. అసలే పంచాయతీ బోర్డు మెంబర్ని ఏం చికాకు పెడతానోనని భయం" సీతయ్య నవ్వాడు. సూరిగాడికి పెసరట్టు ప్లేటు అందింది.

"ఇదిగో మీగడేసి గ్లాసు పాలు పట్రా" సీతయ్య అరిచాడు.

"ఇదో బొక్క బేరం" సుబ్బయ్య తిట్టుకున్నాడు. ఇంతలో ఎట్టోడు మరియన్న అక్కడికి వచ్చాడు. "సీతయ్యగారో మిమ్మల్ని ప్రెసిడెంట్‌గారు రమ్మన్నారు" అన్నాడు.

"ఇప్పుడా మిల్లుకు వెళ్లాలి. ధాన్యం డబ్బులు తెచ్చుకోవాలి, రేపొస్తానని చెప్పు" సీతయ్య కనీసం ముఖం చూడకుండా చెప్పాడు.

"లేదండి ఏదో అర్జంట్ మీటింగంటా... ఊళ్లో ఎంపీటీసీలు, పంచాయతీబోర్డు మెంబర్లు, కులపెద్దలందరినీ పిలుచుకు రమ్మన్నారు", ముల్లుగర్రని నేలకు గుచ్చి "సూరయ్యగారో మిమ్మల్ని ప్రెసిడెంట్‌గారు పిలుస్తున్నారు". ఎట్టోడు చెప్పాడు.

"సరే పదా" సూరిగాడు తలూపాడు. పెసరట్టు పని కానిచ్చి బయలుదేరాడు. సీతయ్య తన బైక్‌మీద ఎక్కించుకున్నాడు. ఇద్దరూ పంచాయతీ ఆఫీసుకి చేరుకున్నారు. అప్పటికే ప్రెసిడెంటు ధనుంజయ చౌదరి, జెడ్పీటీసీ సుందరయ్య,

మండల వైస్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ బోర్డు మెంబర్లు సీరియస్‌గా కూర్చున్నారు.



ఎవ్వరూ మాట్లాడటం లేదు. అంతా నిశ్శబ్దం. ప్రెసిడెంట్ మైక్ అందుకున్నాడు. "మనూరికి చాలా అన్యాయం జరిగింది. జిల్లా పరిషత్తులో మనకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేశారు. మండల ప్రజాపరిషత్తులో, జిల్లా పరిషత్తులో అధికార పార్టీకి పూర్తి మద్దతు ఇచ్చాం. వాళు అడిగినా, అడగకపోయినా వంగి వంగి సలాం చేశాం. కానీ మనల్ని దగా చేశారు. ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని జనంలోకి వెళ్తాం" కళ్లు తుడుచుకున్నాడు.

"ఔను ఊరుచుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు వేస్తామన్నారు. ఐటీ కంపెనీలు వస్తాయన్నారు. 10ఎంజీడీ వాటర్ ప్లాంట్ కడతామన్నారు మనూరు మీద నుంచే మెట్రో రైలు, బుల్లెట్ రైలు...అబ్బో పెద్దాసుపత్రి చాలా ఇస్తామన్నారు" పంచాయతీ బోర్డు మెంబర్ సీతయ్య అందుకున్నాడు.

"ఈ ద్రోహాన్ని సహించటానికి వీల్లేదు. ముందు జెడ్పీటీసీ, ఆ తరువాత ఎంపీటీసీలు, వైస్ ప్రెసిడెంట్‌ను రాజీనామా చేయిద్దాం" పంచాయతీ మెంబర్ వీరాస్వామి ఊగిపోయాడు. అంతే సుందరయ్య పళ్లు పటపట కొరికాడు.

వీడికి నామీద కచ్చ. ఈ వంకతో రాజీనామా చేయించాలని కుట్ర చేస్తున్నాడు. పార్టీ టిక్కెట్టుకి పోటీకలన్నట్లు, ఎలక్షన్‌లో డబ్బులుదు లక్షల మొత్తం కోటి ఖర్చు చేశా. ఇప్పటికి కనీసం పది లక్షల రాలేదు. ఒక్క కాంట్రాక్టు లేదు. కమీషనూ లేదు. ఎలా గట్టెక్కాలా అని చూస్తున్నా. రేపోమాపో నామినేషన్ మీద పనిస్తానని చైర్మన్ మాటిచ్చాడు. నేను రాజీనామా చేయను, ఏం పీక్కుంటారో పీక్కోండి, సుందరయ్య కండువ దులపరించి కుర్చీలో కూర్చున్నాడు.

"నిజమే, ఔటర్‌రింగ్ రోడ్డు, ఆసుపత్రి పనులొస్తే ఆ కాంట్రాక్టులన్నీ ఇప్పిస్తానని మా తోడల్లుడి దగ్గర కోటి నొక్కేశారు. ఇప్పుడా పనులు రావంటే చచ్చిపోతాను" ఎంపీటీసీ నారాయణ అల్లాడిపోయాడు.

"ఇప్పుడు మనం గొడవ పడితే... మనకొచ్చే లాభం ఏమీ లేదు. మనల్ని వదిలించుకోవాలని వాళ్లే పొగపెట్టారు. ఈ ఉక్కిరి బిక్కిరిలో ఇక్కడ ఉండలేం. బయటకు పోలేం. ఐనా జనం గురించి ఆలోచిస్తే ఎట్టా. ఎన్ని మంచి పనులు చేసినా ఆరోజు నోటు ఇవ్వందే ఓటు దేఖరు. మనకి మనం కొట్టుకు చస్తే మనకే నష్టం. అందుకే మనం మిత్ర ధర్మం పాటిద్దాం. లేకపోతే ప్రతిపక్షపోళ్లు కలిసిపోతారు" వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ చౌదరి బోధ చేశాడు.

"ఐతే ఓ పని చేద్దాం, మిత్రలాభం కోసం మిత్రధర్మాన్ని పాటిస్తూనే మిత్రబేధాన్ని అమలు చేద్దాం. రాజీనామాలు చేయకుండా... మనకి అన్యాయం చేస్తున్నారని అందరికీ చెప్పి జనంలో అల్లరి చేద్దాం. చివరికి వాళ్లు పనులు ఇచ్చినా, ఇవ్వక పోయినా తప్పు మనది కాదని చెప్పుకుందాం" వైస్ ప్రెసిడెంటు రంగారెడ్డి అనగానే... అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రాజీనామా గండం తప్పినందుకు లోలోనే సంతోష పడిపోయారు. ప్రెసిడెంట్ మౌనంగా కూర్చున్నాడు. ఎక్కడ మనను మార్చు కుంటాడోనని ఎంపీటీసీలు, పంచాయతీబోర్డు మెంబర్లు ఒక్కసారిగా లేచి నిలబడి నమస్కారం చెప్పి బయటకు వచ్చేశారు. సూరిగాడికి వళు మండిపోయింది. "పై నుంచి కిందవరకూ ఇవే లుచ్చా రాజకీయాలు, ఛీ, ఏపీని అడ్డగోలుగా విడగొట్టి, ఆర్థికంగా చంపేసిన పార్టీతో జట్టుకట్టి...కనీసం నిరసన తెలపలేని దౌర్భాగ్య స్థితిలో టీడీపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీలో తాకట్టు పెట్టారు. ఇక సీఎం మిత్ర ధర్మం, మిత్ర ధర్మం అంటూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్ల దగ్గర పెట్టాడు. గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు తెచ్చినప్పుడే నిలదీసుంటే ఈ ఖర్మ వచ్చేదికాదు. సుజనాచౌదరికి, అశోక్‌గజపతికి మంత్రి పదవులు కావాలి. ఎంపీలకి కాంట్రాక్టులు కావాలి. ఇక్కడ సీఎంకి పోలవరం, రాజధాని, ప్యాకేజీలో వాటాలు కావాలి. ఎవరి స్వార్థం వాళ్లది. ఇక బీజేపీ వీళ్లని ఎందుకు లెక్కచేస్తుంది. ప్రజలే తిరగబడాలి. కనీసం కమ్యూనిస్టులకు మద్దతు తెలిపినా కేంద్రంపై ఒత్తిడి పెరుగుతుంది, ఏం జనమో...ఏంటో"...ఏడూళ్ల సూరిగాడు భారంగా అడుగులు వేశాడు.

విశాలాంధ్ర

బతుకు
The Life

మంగళవారం
06 ఫిబ్రవరి 2018



బతుకు చిత్రం!

రోడ్డు పక్కన పేవ్‌మెంట్ మీద అన్నాన్ని పంచుకు తింటున్న అనాథలైన వృద్ధులు. వారితో పాటే అన్నం వంక ఆత్రంగా చూస్తున్న శునకం. బతుకు వెతలకు దర్పణం పడుతున్న ఈ చిత్రం మనదేశ రాజధాని న్యూఢిల్లీలోది.

చూపు లేకపోయినా సిక్సర్లే... సిక్సర్లు



అతనికి చూపు లేదు....అయినా ప్రపంచమంతా తనవైపు చూసేలా చేశాడు. అతను అంధుడు...అయినా అంతరనేత్రంతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. అతనికి రెండు కళ్ళూ లేవు....అయినా కళ్ళు ఉన్న వారినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తే సరికొత్త రికార్డు సృష్టించాడు. అతనే కర్నూలు జిల్లా డోన్‌కి చెందిన గుండాల ప్రేమ్‌కుమార్. ఇటీవలే ప్రపంచకప్ గెలిచిన అంధుల క్రికెట్ జట్టులో సభ్యుడు అతడు. అతని గురించి చెప్పుకోవడానికి ఇదొక్కటే కాదు ఇంకా చాలా విశేషాలు ఉన్నాయి. చదువులోనే కాదు ఆటపాటల్లో మేటి. క్రికెట్‌లోనే కాదు కబడ్డీ, కరాటేలోనూ అత్యుత్తమ ప్రతిభావంతుడు. సుమధురమైన గానంతో శ్రోతల్ని మైమరిపించగలడు. టెలివిజన్ ఛానల్స్‌లో జరిగిన పాటల పోటీల్లోనూ పాల్గొన్నాడు. ఇంత సాధించాడంటే ఇతనికి ఆర్థిక అండదండలున్నాయేమో, సంపన్న కుటుంబమేమో అనుకోకండి. ప్రేమ్‌కుమార్ నిరుపేద, కడు పేద కుటుంబానికి చెందినవాడు. తనదైన సహజసిద్ధమైన తెలివితేటలు, ప్రతిభతోనే రాణిస్తున్న ఈ అంధుడికి ప్రభుత్వం నుంచి మాత్రం సరైన ప్రోత్సాహం అందడం లేదు. ఇదే విచారించాల్సిన విషయం. జనానికి ఏవేవో చేస్తామని ఎన్నో వాగ్దానాలు, హామీలు ఇచ్చే నాయకులు, ప్రభుత్వం కనీసం ఇలాంటివారిని కూడా పట్టించుకోకపోవడం వారి చేతకానితనానికి నిదర్శనం. ప్రభుత్వం చేయూతనందిస్తే ఇంకెంతో సాధిస్తామంటున్న ప్రేమ్‌కుమార్ లాంటివాళ్ళవైపు ఈ ప్రభుత్వాల చూపు ఎప్పటికి తిరుగుతుందో!



"వైకల్యం శరీరానికే కానీ మనస్సుకు కాదు....శారీరక లోపం ఉన్న వ్యక్తికి మామూలు మనుషులను మించిన సామర్థ్యాలు ఉంటాయి...చూపు లేనివారికి చూపున్నవారిని మించిన గ్రహణశక్తి ఉంటుంది"....ఇవన్నీ మనకు తరచూ వినిపించే మాటలు. ఇవన్నీ చెప్పుకోవడానికి బానే ఉంటాయి బాధ పడేవారికే తెలుస్తుంది అసలు కష్టం....ఆచరణలోనే తెలుస్తుంది అదెలాంటి బాధో. అయినా వెరవకుండా, వెనకడుగు వేయకుండా బతుకు బాటలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసున్నారు దివ్యాంగులు. అందరిచేతా హ్యాట్సాఫ్ అనిపించుకుంటున్నారు. ఇప్పుడు ఈ జాబితాలో చేరాడు గుండాల ప్రేమ్‌కుమార్. అతనికి కంటి చూపు లేదు. రోజువారీ పనులు చేసుకోవడమే కష్టం అయినా సంచలనాలు సృష్టించాడు. రికార్డు మోత మోగించాడు. వార్తల్లోకెక్కాడు.

> "మాది నిరుపేద కుటుంబం. అడుగడుగునా పేదరికం ఆటంకాలు, అవరోధాలు కలిగిస్తూనే ఉంది. అయినప్పటికీ క్రీడలపై నాకున్న ఆసక్తిని చూసి నా తల్లిదండ్రులు, నా భార్య నన్నెంతగానో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల అంటే చిన్నప్పటి నుంచీ ఆసక్తి ఉంది. రెండు కళ్ళూ
>
> **చేయూత ఉంటే మరింత కృషి**
>
> కోల్పోయినా ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేశా. ప్రపంచ క్రికెట్ కప్‌లో విజయం సాధించడం నాకెంతో సంతోషంగా ఉంది. పేదరికంతో పోరాడుతున్న నాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వోద్యోగం కల్పిస్తే క్రీడలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తా"
>
> \- ప్రేమ్‌కుమార్

నిరుపేద కుటుంబం

ఇంత సాధించిన అతి వెనక ఉన్నది కేవలం అతని సామర్థ్యం, అతని కుటుంబం, అతని తల్లిదండ్రుల సంకల్పం మాత్రమే. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుమారుడిని ఉన్నతస్థానంలో చూడాలనుకున్న ఆ తల్లిదండ్రులు అనుకున్నది సాధించారు. అలాగని వారిదేమీ సంపన్న కుటుంబం కాదు. నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు ఇద్దరూ కూలీలే. కూలిపనికి వెళితేనే ఐదు వేళ్ళూ లోనికి వెళ్ళేది, మూడు పూటలా కడుపు నిండేది. ఇలాంటి కుటుంబం నుండి వచ్చాడు ప్రేమ్‌కుమార్. అసలే పేదరికం, అపై అంధత్వం. ఈ పరిస్థితుల్లో ఇంకెవరైనా అయితే ఇంటికే పరిమితమైపోయేవారేమో! కానీ ప్రేమ్‌కుమార్ మాత్రం అలా చేయలేదు. తనలోని శక్తినే కాదు ఆత్మవిశ్వాసాన్ని అంతటినీ కూడదీసుకున్నాడు. అంధులకే కాదు అందరికీ ఆదర్శంగా నిలిచేంతగా ఎదిగాడు.

చదువు-క్రికెట్!

ప్రేమకుమార్ స్వగ్రామం... కర్నూలు జిల్లా డోన్ మండలం సీసంగుంతల గ్రామం. తమ కష్టాలు తమ పిల్లలకు ఉండకూడదనుకున్న ప్రేమ్‌కుమార్ తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి చదువు చెప్పించాలనుకున్నారు. సుంకులమ్మ, ఎల్లయ్య....ప్రేమ్‌కుమార్ తల్లిదండ్రులు. ఈ దంపతులకు మొత్తం ఐదుగురు సంతానం. ఇందులో ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. అందరికంటే పెద్దవాడు ప్రేమ్‌కుమార్. చిన్నప్పటినుంచీ చురుకుగా, చలాకీగా ఉండేవాడు. ఏడేళ్ళు వచ్చేవరకూ అందరిమాదిరిగానే చక్కగా రోజూ స్కూల్‌కి వెళ్ళేవాడు. రెండవ తరగతి చదువుతుండగా ప్రేమ్‌కి తట్టు వచ్చింది. దీంతో రెండు కళ్ళూ పోయాయి. వైద్యులకు చూపించినప్పటికీ ఫలితం లేకపోయింది. కంటిచూపు లేకపోయినా చదువు ఆపలేదు. తల్లిదండ్రులు, స్నేహితులు, ఉపాధ్యాయుల సాయంతో ఆత్మవిశ్వాసమే ఆయుధంగా చదువుని కొనసాగించాడు ప్రేమ్‌కుమార్. 6 నుంచి 10వ తరగతి వరకు పత్తికొండలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉండి చదువుకున్నాడు. చూపు లేని కారణంగా 10వ తరగతిలో గణిత శాస్త్రంలో ఫెయిల్‌లయ్యాడు. అయినప్పటికి సడలని సంకల్పంతో ఇంటి దగ్గర ఉండి చదువును కొనసాగించాడు. తర్వాత అంధుల కోసం ఉన్న నంద్యాలలోని సెయింట్‌లూకాస్ అంధుల కాలేజీ గురించి తెలుసుకుని అక్కడ ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. ఇక్కడ చదువుకునే రోజుల్లోనే సీనియర్‌లు క్రికెట్ ఆడడం గురించి తెలుసుకుని తానూ మంచి క్రికెటర్ కావాలనుకున్నాడు. చిన్నతనం నుంచే క్రికెట్‌పై ఆసక్తిని పెంచుకున్న ప్రేమ్‌కుమార్ అప్పట్లో ఆడకపోయినా స్నేహితులు క్రికెట్ ఆడేటప్పుడు అక్కడికి వెళ్ళి ఆటను విని ఆనందించేవాడు.



ప్రిన్సిపాల్ సాయంతో

నంద్యాలలోని కాలేజీ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ సాయంతో అంధుల క్రికెట్ పోటీలకు సిద్ధమయ్యాడు ప్రేమ్. క్రికెట్‌లో మెళకువలను నేర్చుకొని ఆటలో రాటుదేలాడు. నంద్యాల జట్టు తరుపున తొలుత జిల్లా స్థాయిలో, డివిజన్ స్థాయిలో రాణించాడు. 2010లో స్ఫూర్తి విజన్‌కేర్ అధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనపర్చాడు. 2012లో అంధుల ఏపీ జట్టుకు ఎంపికయ్యాడు. అదే ఏడాది ముంబైలో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆడి అందరిచేతా శభాష్ అనిపించుకున్నాడు. అనంతపురంలో జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ అంధుల క్రికెట్ పోటీలకు, వరల్డ్ కప్‌కు ఎంపికయ్యాడు.

ఆటపాటల్లో మేటి

ప్రేమ్ కుమార్ ఆటల్లోనే కాదు పాటల్లోనూ మేటి. ఒక్క క్రికెట్ మాత్రమే కాదు కబడ్డీ, కరాటే కూడా తెలుసు. నంద్యాలలో చదివే రోజుల్లోనే క్రికెట్‌తో పాటే కబడ్డీ, కరాటేలోనూ అత్యుత్తమ ప్రతిభ కనపరిచాడు. అంధుల కబడ్డీలో రాష్ట్ర స్థాయి జట్టుకు కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. కరాటేలో బ్లాక్‌బెల్టు సాధించాడు. ఆటలు ఎంత బాగా ఆడతాడో పాటలూ అంత బాగా పాడతాడు ప్రేమ్‌కుమార్. కొన్ని టీవి ఛానల్స్‌లో కూడా పాటలను పాడాడు.

\- జె. మల్లికార్జున, డోన్

అందని ప్రభుత్వసాయం

ఇన్ని ప్రత్యేకతలు ఉన్నా, ఇంత సాధించినా, ఇంత ప్రతిభ ఉన్నా, కడు పేద కుటుంబానికి చెందినవాడైనా...గుండాల ప్రేమ్‌కుమార్‌కు ప్రభుత్వ సాయం మాత్రం అందడం లేదు. నిరుపేద కుటుంబం కారణంగా క్రికెట్ మ్యాచ్‌లకు వెళ్ళాలన్నా ఖర్చులు భరించలేని పరిస్థితి. అయినా వరుసగా మూడు సార్లు వన్‌డే ప్రపంచ క్రికెట్ కప్‌లో పాల్గొన్నాడు ప్రేమ్‌కుమార్. ఇతర రాష్ట్రాలలో అంధుల క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలను ఇస్తున్నారు. ఆ రాష్ట్రాల మాదిరిగానే ప్రేమ్‌కుమార్‌కీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని అతని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

సాధించిన విజయాలు

2016లో జరిగిన ఆసియాకప్ పోటీల్లో పాల్గొన్న భారత అంధుల క్రికెట్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు ప్రేమ్‌కుమార్. ఐదు దేశాల క్రికెట్ జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రేమ్‌కుమార్ ప్రతిభను చాటాడు. గత ఏడాది జరిగిన రెండవ టీ20 జట్టులోనూ అతను ఉన్నాడు. తాజాగా జనవరిలో లాహోర్‌లో జరిగిన ఐదవ ప్రపంచ వన్‌డే కప్ పోటీల్లో ఫైనల్లో పాకిస్థాన్‌ని ఓడించడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. ప్రపంచకప్‌ను సాధించిన ఈ అంధుల జట్టును ప్రధానమంత్రి మోడీ, రాష్ట్రపతి కోవింద్, గవర్నర్ నరసింహన్‌లు అభినందించిన విషయం తెలిసిందే.





మోతాదు మించనివ్వద్దు!

ఉదయాన్నే గోరువెచ్చని నీళ్ళల్లో నిమ్మరసం, తేనె కలుపుకుని తాగితే ఆరోగ్యానికి మంచిదని చాలామందికి తెలుసు. కానీ, ఏది ఎంత వాడాలో తెలుసా? ఈ విషయం తెలుసుకోకపోతే ప్రమాదమే సుమా! మోతాదు మించి వాడితే ఔషధం కూడా విషం అవుతుంది, పనిచేయకుండా పోతుంది. ఇది అందరికీ తెలిసిందేగా. వేడినీళ్ళల్లో నిమ్మకాయ, తేనె కూడా అంతే. ఏది ఎంత మోతాదులో తీసుకోవాలో అంతే వాడాలి. లేదంటే అసలు ప్రయోజనం మాటేమో కానీ కొత్త సమస్యలు వచ్చిపడతాయి. మరి ఇలాంటి పరిస్థితి రాకుండా ఏది ఎంత వాడాలో తెలుసుకుందామా. వేడినీళ్ళల్లో నిమ్మరసం, తేనె వాడడం వల్ల బరువు తగ్గుతాం కదాని కొంతమంది తెగ వాడేస్తుంటారు. ఇలా చేస్తే నిమ్మరసంలోని అధిక పులుపు కారణంగా చిగుళ్ళు దెబ్బతింటాయి. పెద్ద గ్లాసు గోరువెచ్చని నీళ్ళకు నిమ్మపండులో సగం చెక్కనే వాడాలి. అంతకుమించి వాడకూడదు. ఎక్కువగా వాడితే చిగుళ్ళు దెబ్బతినడమే కాదు ఎసిడిటీ వచ్చే ప్రమాదమూ ఉంది. దీనివల్ల ఈ ఫార్ముల్లా వల్ల కలిగే అసలు ప్రయోజనం దెబ్బ తింటుంది. ఇది చేసే సహజసిద్ధమైన పనికి ఆటంకం ఏర్పడుతుంది. అందుకే తేనె, నిమ్మరసం మోతాదుకు మించి వాడవద్దు. ఈ తేనె, నిమ్మరసం నీటిని తాగేముందు మామూలు నీళ్ళతో నోటిని రెండుమూడు సార్లు పుక్కిలించడం మంచిది. బ్రష్ చేసుకుని తాగితే ఇంకా మంచిది. పరగడుపున అన్నారు కదాని ముందుగా నోరు శుభ్రం చేసుకోకుండా తాగితే నోట్లోని బాక్టీరియా పొట్టలోకి వెళ్ళిపోయే ప్రమాదం ఉంది. జిమ్, జాగింగ్‌లకు వెళ్ళేవాళ్ళల్లో చాలామంది బయట దుకాణాల్లో బాటిల్స్‌లో విక్రయించిఏ నిమ్మరసాన్ని కొనుక్కొని తాగుతుంటారు. ఆరోగ్యానికి ఇది ఎంతమాత్రం మంచిది కాదు. ఇంట్లోనే సహజసిద్ధమైన నిమ్మకాయల రసాన్ని తీసి ఆ నీటిని తాగడమే ఆరోగ్యకరం. కొంతమంది తేనెనూ అధికంగా కలిపేస్తుంటారు ఈ అలవాటూ మంచిది కాదు. రోజుకి గ్లాసు నీళ్ళకు చిన్న చెంచా తేనె సరిపోతుంది. మరీ వేడినీళ్ళల్లో తేనె కలపడమూ మంచి పద్ధతి కాదు. ఇది కూడా అనారోగ్యాలకు దారితీస్తుంది. నీళ్ళు, నిమ్మరసం, తేనె ఏదైనా సమపాళ్ళల్లోనే ఉండాలి. ఏదీ ఎక్కువ వాడకూడదు.





ఏ జుట్టుకి ఏ ఆయిల్!

జుట్టు పొడిబారిపోవడం, చుండ్రు లాంటి సమస్యలు ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. వీటిని తొలగించుకునేందుకు ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారు. సమస్య ఏదైనా అందరికీ ఒకేరకం ట్రీట్‌మెంట్ పనికిరాదు. ఒక్కోరకం జుట్టుకి ఒక్కోరకం ఆయిల్ ఉపయోగపడుతుంది. అలాగే ఒక్కోరకం సమస్యకు ఒక్కోరకం చికిత్స ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించాలి. అందుకు అనుగుణమైన పదార్థాలను వాడితేనే సరైన ఫలితం ఉంటుంది. అన్నింటికంటే ముందు మీ జుట్టు ఏ రకానికి చెందినదైనా సహజసిద్ధమైన నూనెలను వాడడం అలవాటు చేసుకోవాలి. మరి ఈ ఆయిల్స్‌లో ఏ రకం జుట్టుకి ఎలాంటి ఆయిల్స్ వాడాలో తెలుసుకుంటే జుట్టు సమస్యల నుంచి తేలికగా బయటపడవచ్చు. మరి అవేమిటో, ఎలా ఉపయోగించాలో తెలుసుకుందామా!

పొడి జుట్టు కోసం

అర్గాన్ ఆయిల్‌లో బాగా పండిన అరటిపండు గుజ్జు కలిపి జుట్టు కుదుళ్ళ నుంచి చివర వరకూ పట్టించి 45 నిముషాలు ఉంచండి. తర్వాత తలస్నానం చేయండి. నెలలో రెండుసార్లు ఇలా చేస్తే పొడి జుట్టుకి కావలసినంత తేమ అందుతుంది.

జిడ్డు జుట్టు కోసం

కోడిగుడ్డు తెల్లసొన, ఆల్మండ్ అయిల్ కలిపి జుట్టుకి పట్టించి ఆరాక తలస్నానం చేయండి. వారానికి ఒకసారి ఇలా చేస్తే మీ జుట్టుకు ఉన్న జిడ్డు పోయి కొత్త మెరుపు సంతరించుకుంటుంది.



జుట్టు పలచగా ఉంటే

ఆముదంలో అలోవెరా జెల్ కలిపి జుట్టు అంతా బాగా పట్టించి మసాజ్ చేయండి. నెలకు రెండుసార్లు ఇలా చేస్తే చాలు పలచగా ఉన్న మీ జుట్టు దట్టంగా తయారువుతుంది.

వెంట్రుకలు నిర్జీవంగా ఉంటే

విటమిన్ ఇ క్యాప్స్యూల్స్ రెండు తీసుకుని అందులోనుంచి ఆయిల్ తీసి జుట్టుకి పట్టించి రాత్రంతా అలాగే ఉంచండి. ఉదయాన్నే తలస్నానం చేయండి. మీరనుకున్న ఫలితం వేగంగా అందుకోవాలంటే వారానికి ఒకసారయినా ఇలా చేయండి.

జుట్టు చిట్లిపోతోందా

సహజసిద్ధమైన కొబ్బరినూనె తీసుకుని గోరువెచ్చగా చేసి దీనిని జుట్టుకి పట్టించి మసాజ్ చేయండి. వారానికి రెండు లేదా మూడుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

జుట్టు రింగులు తిరిగిపోతోందా

కుదుళ్ళ నుంచి చివర్ల వరకూ జుట్టుకి ఆలివ్ ఆయిల్ పట్టించండి. రాత్రంతా అలాగే ఉంచి ఉదయాన్నే గోరువెచ్చని నీళ్ళతో తలస్నానం చేయండి.





అతడు-ఆమె

65

జరిగిన కథ

"అబ్బే అంత వుండదన్నయ్యా! యేదో జరుగు బాటుకి లోటుకుండానే నాలుగు పైచిలుకు వుంటుం దిలే. నువ్వే మాత్రం గడించావు అన్నయ్యా? పది పదిహేను లక్షలుంటుందనుకుంటాను. వైద్యులు మీకేమిటి - రక్తం చూపించి గణిస్తారు!" అన్నాను.

"ఏం గణనరా చిదంబరం! పెద్దాళ్ళిద్దరూ సీమలో వున్నారాయె. కుర్రది కంటి వైద్యానికి వియన్నా వెళుతానని మంకుపట్టు పట్టుక్కూచుంది. యాభై అరవైవేలు చదువులకిందే అయిపోయింది. మూడోవాడిని వచ్చే సంవత్సరం ఈటన్ పంపించ డానికి మీ వదినె నిశ్చయం చేసేసింది. ఆవిడదే రాజ్యం - నేమారుమాటాడ్డానికి వీలు లేదుకదా! వీటన్నింటికీ ఖర్చు కేటాయించగా - నువ్వన్నంత ఉంటుందేమోలే!" అన్నాడు.

(నిన్నటి సంచిక తరువాయి)

ఇంకా యిలా అన్నాడు: "అయినా వైద్యంలో రామికూడా మునపటిలాగు లేదురా! మునపటి రోజుల్లో దబ్బున రోగి మాలాంటి పెద్దవాళ్ళ దగ్గిరకొస్తే - మేం ఎంత అడుగుతే అంతా పారేసేవాళ్ళు. ఇప్పుడేం వుంది? ఇంటికో వైద్యుడు! రోగులు కూడా మందుల షాపులకి వెళ్ళనూ - ఇంజక్షనులు కొనుక్కొని కంపౌడర్లు చేత పొడిపించేసుకోనూ. వీళ్ళ తస్సాదియ్యా ఆయుర్వేదం ఆచార్యుల వారుకూడా స్టెతస్కోపు, ధర్మామీటరు, ఇంజక్షను పిచికారీతో తయారవుతూంటే - మా ఇంగ్లాండు చదువు లెందుకురా - తగలెట్టను! అంచేత రోగిని బల్లమీద పడుకోబెట్టి, సహం శస్త్రంచేసి మరీ బేరం చెయ్యవలసొస్తోంది - "రొక్కం అక్కడ బల్లమీద పెడితేనే కుట్లు కుట్టేది - లేకపోతే సప్తకట్లే" అని! అంతవరకూ దిగలేదనుకో ఇంకా - మాట వరసకి చెప్పా! మొన్నేమయింది? సికిందరుపూరు పెద్ద కొడుక్కి టైఫాయిడ్. పదివేలకి బేరం కుదిర్చేడు మా అసిస్టెంటు సర్జను. పేరా టైఫాయిడ్ అని మేం చెప్పలేదనుకో. కీడెంచి మేలెంచ మన్నాడు మరి! దానిమీద వంటినిండా పేతలాగు పోసింది. ముసలాడు భయపడ్డాడు. కుర్రాడిది సుకుమారమైన వొళ్ళుకదూ - నెల్లాళ్ళు మంచం పట్టడంచేత చర్మం వొరిసి బొబ్బలెక్కింది. నా అసిస్టెంటు సర్జను భలే వాడులే! "ఇది నయం చెయ్యడానికి రెండువేలు అదనం" అన్నాడు. మళ్ళీ జ్వరం తిరగబెట్టిందను కున్నాం-ధర్మామీటరు వక డిగ్రీ తప్పు చూపించడం వల్ల. కుర్రాడు బాగైపోయాడు. పారితోషికం ఇచ్చేవేళ కల్లా ఎనిమిదివేలకే చెక్కు పంపించి వూరుకున్నాడు. ప్రపంచంలోకూడా - నీతీ జాతీ పోయిందిరా అబ్బీ!" అన్నాడు అన్నయ్య.

గవర్నమెంటు ఉద్యోగంలో వున్నావు. నీ కేమిటన్నయ్యా! నాలాగ కంఠశోష చెమట వూడ్చడం నీకు లేదుగా. నెల అయ్యేసరికి దవ్వ బిళ్ళల్లా చేతులో పడతాయి రెండువేలున్నూ!"అన్నా.

"అలాగనుకుంటున్నావు గావును! ప్రయివేటు ప్రాక్టీసు లేకపోతే ఎలా గడుస్తుందిరా? అది కాస్తా వుండబట్టే - వేడినీళ్ళలో చన్నీళ్లూ - పులగం మీద పచ్చిపులుసూ! దాల్లోనేనా యెంతటిపోటీ అను కున్నావు? మన ఆడవాళ్ళు చీరెలలోనూ, మీ వదిన గొన్ల లోనూ నిమిష నిమిషానికి నూతనం ఎల్లా బయలుదేరుతోందో - మందుల్లోనూ - చికిత్సల్లోనూ అంతే అనుకో. ఈ వైద్యుడు ఎక్సురేబొమ్మ తీశాడు అంటే - పొరుగు వైద్యుడు 'అదేమి వైద్యం అండీ - అల్ట్రా వైలెట్టు ఇవ్వాలిగానీ!' అంటాడు. నువ్వు క్వినైను ఇచ్చావూ అంటే నేను ఎటెబ్రిను ఇచ్చి తీరాల్సిందే. లేకపోతే రోగే నన్ను తట్టాబాజా కట్టేస్తాడు. కడుపులో పాములు బాధపెడు తుంటే - నువ్వు ఇంత శాంటోనిను - ఆముదం పుచ్చుకోండని చెబితే - 'ఇదేమీ పల్లెటూరి వైద్యం అండీ' అని అంటూ పెరటి వీధిలో వైద్యుడిదగ్గరకెళ్ళి సల్ఫోనాలు ఇంజక్షను పొడిపించు కుంటాడు. నాలాంటి గడుసు వైద్యుడైతే రోగిని కనిపెట్టి - డొక్కలో నాలుగు మాట్లూ, తుంటిమీద నాలుగు మాట్లూ ఇంత సెలైనో - కొసకి కుళాయి నీళ్ళో ఇంట్రావీనసు పొడిచి పాతిక రూపాయలు సంపాదిస్తాడు!" "అన్నయ్యా! అయితే మీ



వైద్యశాస్త్రంలో యిన్ని పరిశోధ నలు జరుగుతున్నాయి కదా - అవన్నీ చదవడానికి నీకెక్కడ తీరుబడి వుంటుందో!" అని అడిగే.

అన్నయ్య ఫక్కున నవ్వేడు. "నువ్వు వుత్త సత్యకాలపు వాడివిరా చిదంబరం! మీరు దేశాయి డెసెన్నియలు డైజస్టులూ, సంజీవరావు ఆలిండియా కేసులై తెప్పించుకొని యెలా పుటలు తిరగేస్తారో మేమూ కేటలాగుల్లో బొమ్మలన్నీ చూసే కొత్తకొత్త మందులు తెప్పించి ప్రయోగిస్తుంటాం. ఇంతకీ తమ్ముడూ - ఎం పరిశోధనలు లెద్దూ! పడిశానికి మందులేదు. తలనొప్పికి పట్టులేదు. కడుపునొప్పికి మాత్రలేదు. ఆయుష్షుంటే - అల్లపు రసం అమృతం - శొంఠికషాయం సంజీవి. ఆయుష్షు లేదూ -



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

ఆ గుండెకాయ డిజి టాలిస్ ఇచ్చి పిచికారీతో పొడిచినా పదు కుంటుంది !" అన్నాడు.

"అద్భుతమైన శస్త్ర చికిత్స పెట్టుకుని నీలాంటివాడు కూడా అలా అంటే ఎలాగు అన్నయ్యా?" అన్నా. "నీ పిచ్చి! యుద్ధంలో మొండికాళ్ళనీ, మొండి చేతులనీ రంపాలతో కోసి బాడిసెలతో చెక్కేవాళ్ళమి - ఏమనుకొన్నావో. మొన్న మీ సెసీలి వదినె సర్జను జనరులుతో జింఖాన క్లబ్బులో డాన్సు చేస్తుంటే కాలుజారి పడింది. అందరూ చుట్టూ మూగేరు. ఇదన్నారు అదన్నారు. మోకాలు వాచి నాలుగు రోజులు వుష్టం. రహస్యంగా మంగ లాడిచేత రెండు పూటలు తోమించేసరికల్లా - మూడోరోజు తయారు మీ వదినె టెన్నీసు కోర్టులో! నేనొక్కటే నిశ్చ యించాను. పించను పుచ్చుకున్నాక - విష్ణురథం లాంటి రోల్సురాయిస్ కారొకటి - వైనతేయం లాంటి చిన్న ఏరోప్లేను ఒకటి కొని - వాటి మీదే ప్రయాణం రోగులను చూడటానికి. అంత డాబుగా వెళితే రోగులకి ఎంత ఆనందం అనుకున్నావు! ఒక డబ్బీలో కస్తూరి మాత్రలు బాలారిష్టాలకి. మరో డబ్బీలో మకరధ్వజం మొగాళ్ళ రోగాలకి. మూడో డబ్బీలో వసంత కుసుమాకరం ఆడాళ్ళ జబ్బులకి! చూతువుగాని - నా పేరు చింతామణి కాదనుకో!" అన్నాడు.

అన్నయ్య మంచి అదృష్టవంతుడు. కాని - అంత డబ్బు కక్కుర్తి, అంత నిర్దాక్షిణ్యం వుండ కూడదు. సరి - అన్నయ్యని మించింది వదినె - అందులో దొరసాని! శాంతం వుంటే అన్నయ్య మాటలు విని మండిపోను. లేక పోవ డమే మంచిదైంది. అన్నయ్య మాత్రం - మర దలు పిల్ల-మరదలు పిల్లఅని ఆపేక్ష పడతాడు!

83 ఆమె

రైల్లో రెండవ తరగతి ప్రయాణం. సదుపాయంగా వుంది. ఆడవాళ్ళ పెట్టె. సుభ వొళ్ళో పడుకుంది పాపాయి. "తధి కిణతోమ్- తిధికిణతోమ్" అని రైలు లయ వేస్తుంటే, జోకొట్టి నట్టే వుండి రైలు కదిలిన వెంటనే నిద్ర పట్టిపోయింది నాకు...

...కురుక్షేత్రం... సైన్యాలు బారులుతీర్చి వ్యూహాలు పన్ని విడిసివున్నాయి... ఇటుప్రక్క ఖాకీ దుస్తులూ ఇనుపటోపీలు.. అటుప్రక్క తెల్లటి దుస్తులూ తెల్లటోపీలు.. రెండు వైపులా ఫిరంగుల మోత.. తధిక్కిణతోం - తధిక్కిణతోం.. పైన ఆకాశాన రెండు పక్షాల విమానాలు తాధుం - తాధుం- తాధూం అంటూ ఒకదాన్నొకటి వెన్నంటి వేటాడుతున్నాయి... మర ఫిరంగులు ధిమికిటతాధుం-ధిమికిటతాధుం - ధిమికిటతాధుం - అంటూ నిప్పులు పేల్చుతున్నాయి.... ఇద్దరు వీరులు మల్లయుద్ధం చేస్తున్నారు. ఖాకీదుస్తులవారు ఈలలు వేసి చప్పట్లుకొడు తున్నారు. తెల్లదుస్తులవారు "హరిబోల్ బోల్ హరి - నిర్బలకే బల్‌రామ్" అని జేగంటలు కొడుతున్నారు... నేను ఆకాశాన రంగనాథస్వామివారి నీలవేణి గుర్రాన్నెక్కి - ఒకచేత త్రివర్ణ పతాకం - రెండవచేత హనుమద్ధ్వజం- మూడవచేత ఆత్మశక్తి అస్త్రం - నాల్గవచేత ప్రకృతిశక్తి అస్త్రం ధరించి - శ్వేతాంబరు లని విజయోన్ముఖంగా నడిపిస్తున్నాను... శాస్త్రి వేదాధ్యయనంతో ఉత్తేజపరుస్తున్నాడు... నీలవేణి రూపంమారి బులాకీపిట్ట అయి పోయింది... బులాకీపిట్ట తధిగిణతోం- తధిగిణతోం - తధిగిణతోం అని పాడుతూంది... బులాకీ రూపం మార్చి మళ్ళీ నీలవేణి అయిపోయింది.. నారద తుంబురులు "వందేమాతరం" గీతం పాడుతున్నారు... యక్షులు గంధర్వులు కిన్నరులు వీణా గానం చేస్తున్నారు - "ఝుండా ఊంఛా రహేహై హమారా" అని... మునిగణాలు రఘుపతిరాఘవస్తవం చేస్తున్నారు. ఖాకీ దుస్తులవారు పలాయనం - తద్దుం - తధికిణతోం - తాధుం - తధిక్కిణతోం - శ్వేతాంబరుల విజయభేరి మ్రోత - తధిక్కి ణతోం - తధికిటతోం - తద్దుం తధికిటతోం - తధికిణతోం - తధికిణ - తధి - కిణ - తోమ్ - తోమ్ - తో-మ్..

రైలాగిపోయింది. నాకు తెలివొచ్చేసింది.

హరిద్వారం : లల్లూభాయి ఘన్‌వాలా ధర్మశాలలో బస. సావడి రెండోవైపున అహోబిలం నుంచి వచ్చిన ఇద్దరు పుణ్యస్త్రీలు - తెలుగు మధ్వులు. మహాశివరాత్రి వరకు ఇక్కడే వుంటారుట. పిల్లలిద్దరినీ వారికి వొప్పచెప్పి ఇప్పుడే వస్తానని ధర్మశాల బయటకు వచ్చాను.

సూర్యోదయం కాలేదు. తెల్లవారుతూంది. గంగోత్రి వడ్డునే నడిచి వెళ్లాను - నల్లగా నేలమీద వొలికిన సిరాలావుంది: గంగా నది భారత వర్షపు ఇతిహాస ఫలకమీద నల్లనిగీత ఆర్యవర్తపు నేలమీద నాగటిచాలు! భారతీయుల వంశధార, భరతమాత నుదుటిపై బ్రహ్మదిద్దిన వ్రాత...

సూర్యుడుదయించాడు - గంగోత్రి పాదరసపు ధారలా మెరుస్తూంది. నల్లని కొండలు, తెల్లటి శిఖరాల చుట్టూ పట్టుగొడుగుల్లాగు తెల్లని మబ్బులు అంటివున్నాయి....

గంగ నన్నగిల్లింది. కరగబోసిన వెండి సెలయేరు - అదిగో గంగావతరణం! దూరాన కైలాసగిరి కానవస్తూంది. ఇరుప్రక్కల నందాదేవి, కంచనగంగలు. కైలాసగిరి చుట్టూ ఛత్రచమరాల్లాగు తేజరిల్లుతునన మబ్బులు - రూపం మారి కాలసర్పం పడగ పట్టినట్టుంది !

అదిగో! రామలక్ష్మణఝూలా - వైతరణీమీద వారధిలాగు : ఆ గడ్డి పట్టుకుని దాటితిమా - మానస సరోవరమే! బదరీ నారాయణం, బ్రహ్మకపాలం, అమరనాథం నడచిపోతున్నారు యాత్రికులు, ఈ చలిలో - ఈ మంచులో ! శేషనాగం - సతీసరోవరం - మృత్యుంజయం - మహామేరువు!...

- ఇంకా వుంది.

రంజీట్రోఫీలో విజేతగా నిలిచిన జట్టు ఏది ?

విశాలాంధ్ర ప్రజ్ఞ

కరెంట్ ఎఫైర్స్ ఆబ్జెక్టివ్ బిట్స్

1. న్యాయవ్యవస్థను దూషించిన కేసులో ఈజిప్టు మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ మోర్సీకి అక్కడి న్యాయస్థానం ఎన్నేళ్ల జైలుశిక్ష విధించింది ?
   1. ఏడాది 2. రెండేళ్లు
   3. మూడేళ్లు 4. నాలుగేళ్లు
2. దేశంలో అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌ను కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి హర్షవర్ధన్ పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటరాలజీ (ఐఐటీఎం)లో ప్రారంభించారు. ఆ కంప్యూటర్ పేరు ఏమిటి ?
   1. ఆదిత్యా 2. పరమ్
   3. ప్రత్యూష 4. వర్ష
3. ఆసియాన్-భారత్ ప్రాంతీయ ప్రవాసీ భారతీయ దివస్ 2018 జనవరి6,7 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
   1. న్యూఢిల్లీ 2. కౌలాలంపూర్
   3. సింగపూర్ 4. బ్యాంకాక్
4. భారత్‌లో జరిగే ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ?
   1. కెవిన్ అండర్సన్ 2. గైల్స్ సిమోన్ (ఫ్రాన్స్)
   3. మారిన్ సిలిక్ 4.యూకీ బాంబ్రీ (భారత్)
5. పాకిస్థాన్‌లో అంతర్జాతీయ, పాక్ ఆక్రమిత కాశ్మీర్ సరిహద్దుల వద్ద ఎన్ని బంకర్లను నిర్మించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది ?
   1. 14,200 2. 14,360
   3. 14,460 4. 14,560
6. సిక్కిం ప్రభుత్వ ప్రచారకర్తగా ఎవరిని నియమిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం పవన్‌కుమార్ చామ్లింగ్ ప్రకటించారు ?
   1. ప్రియాంక చోప్రా 2. ప్రియదర్శన్
   3. ఏఆర్ రెహ్మాన్ 4. విద్యాబాలన్
7. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా రాష్ట్రప్రభుత్వం ఎవరిని నియమించింది ?
   1. బీఎస్ఎస్ ప్రసాద్ 2. జేసీ శర్మ
   3. శ్యామలరావు 4. కరికల్ వలవెన్
8. ప్రస్తుత ప్రభుత్వం ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సవాళ్లకు పరిష్కారాలు కనుగొనేందుకుగాను 'రైజినా డైలాగ్' పేరిట సదస్సును ఏ సంవత్సరం నుంచి భారత విదేశాంగ శాఖ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్)లు ప్రతి ఏడాది సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి ?
   1. 2013 2. 2014
   3. 2015 4. 2016
9. భారత జాతీయ భద్రతా డిప్యూటీ సలహాదారుగా కేంద్రప్రభుత్వం ఎవరిని నియమించింది ?
   1. జీవసాగర్ 2. విజయ్ కేశవ్ గోఖలే
   3. రాజేశ్వర్ తివారి 4. రాజీందర్ ఖన్నా
10. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నూతన చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ?
    1. అనిల్ భరద్వాజ్ 2. టీకే అనురాధ
    3. రీతు కరిధాల్ 4. కె.శివన్
11. డబ్ల్యూటీఏ ఆక్లాండ్ క్లాసిక్ టెన్నిస్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ?
    1. జూలియా జార్టెస్ (జర్మనీ)
    2. కరోలిన్ వోజ్నియాకి (డెన్మార్క్)
    3. లారెన్ డేవిన్ (అమెరికా)
    4. అనా ఇవనోవిచ్ (సెర్బియా)
12. అగస్టావెస్ట్‌లాండ్ కుంభకోణం కేసులో హెలికాప్టర్ తయారీ సంస్థ ఫిన్ మెకానికా సంస్థ మాజీ సీఈఓను ఇటలీ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఆయన పేరు ఏమిటి ?
    1. జాన్ మెకీకీ 2. మత్తీయాస్ ముల్లర్
    3. బాబ్ ఐగర్ 4. గుసెప్పె ఒర్సి
13. భారత విదేశాంగశాఖ నూతన కార్యదర్శిగా ఎవరు నియమితులయ్యారు ?
    1. రాజీందర్ ఖన్నా
    2. జీవసాగర్
    3. బీఎస్ఎస్ ప్రసాద్



14. హిమాచల్ ప్రదేశ్‌లోని కర్సోగ్ తహసీల్ సపోన్త్ గ్రామానికి చెందిన మహిళకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 2018 క్యాలెండర్‌లో చోటు దక్కింది. ఆమె పేరేమిటి ?
    1. గీతా వర్మ 2. చాందినీ ప్రసాద్ వర్మ
    3. సంయుక్త వర్మ 4. తారిషి వర్మ
15. అత్యంత ప్రతిష్టాత్మక 'సిసిల్ బీ డీమెల్లే' అవార్డు ఈసారి ఎవరికి లభించింది ?
    1. ఓప్రా విన్‌ఫ్రే 2. సోఫియా వెర్గర
    3. కెర్రీ వాషింగ్టన్ 4. కేట్ జాక్సన్
16. ప్రతిష్టాత్మక హాప్‌మన్ కప్‌లో సహచరురాలు బెలిండా బెన్సిచ్‌తో కలిసి ఫెదరర్ ఎన్నేళ్ల తరువాత స్విట్జర్లాండ్‌కు టైటిల్ అందించాడు ?
    1. 15 ఏళ్ల తరువాత
    2. 16 ఏళ్ల తరువాత
    3. 17 ఏళ్ల తరువాత
    4. 18 ఏళ్ల తరువాత
17. మనుషులు, జంతువులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున కేంద్రప్రభుత్వం ఎన్ని రకాల పురుగు మందులపై నిషేధం విధిస్తూ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది ?
    1. 17 రకాల పురుగు మందులు
    2. 18 రకాల పురుగు మందులు
    2. 19 రకాల పురుగు మందులు
    4. 25 రకాల పురుగు మందులు
18. నాటి సిక్కుల ఊచకోతకు సంబంధించి మూసివేసిన 186 కేసుల పర్యవేక్షణకు కొత్తగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని సుప్రీంకోర్టు 2018 జనవరి 11న ఏర్పాటు చేసింది. అయితే దీనికి ఎవరు నేతృత్వం వహించారు ?
    1. జస్టిస్ రేవా ఖేత్రపాల్
    2. జస్టిస్ ఎస్.ఎన్.ధింగ్రా
    3. జస్టిస్ ఆర్.ఎస్.సోధి
    4. జస్టిస్ ఇందిరా బెనర్జీ
19. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమిన్ నెతన్యాహు 2018 జనవరి 14-19 తేదీల మధ్య ఆరు రోజుల పాటు భారత్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్ ప్రధాని భారత్‌లో పర్యటించడం ఎన్నేళ్ల తరువాత ఇదే తొలిసారి ?
    1. 15 ఏళ్లు 2. 16 ఏళ్లు
    3. 17 ఏళ్లు 4. 18 ఏళ్లు
20. నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) మూలధనాన్ని రూ.5,500 కోట్లు నుంచి ఎన్ని రూ. కోట్లకు పెంచడానికి వీలు కల్పిస్తున్న బిల్లుకు 2018 జనవరి 4న పార్లమెంటు ఆమోదముద్ర వేసింది ?
    1. రూ.20,000 కోట్లు
    2. రూ.30,000 కోట్లు
    3. రూ.40,000 కోట్లు
    4. రూ.50,000 కోట్లు
21. రంజీ ట్రోఫీలో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
    1. హిమాచల్‌ప్రదేశ్ 2. మధ్యప్రదేశ్
    3. విదర్భ 4. సౌరాష్ట్ర
22. రియాద్‌లో జరిగిన ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్- 2017లో విజేతగా నిలిచింది ఎవరు ?
    1. హికారు నకమురా
    2. మాగ్నాస్ కార్ల్‌సన్
    3. విశ్వనాథన్ ఆనంద్
    4. ఫాబియానో కరుఅన
23. కాసాని కృష్ణ ముదిరాజ్ స్మారక జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
    1. రాజస్థాన్ 2. మహారాష్ట్ర
    3. ఆంధ్రప్రదేశ్ 4. హిమాచల్‌ప్రదేశ్
24. బ్రిటన్ తొలి మహిళా సిక్కు ఎంపీని ప్రతిపక్షంలో మంత్రి (షాడో మినిస్టర్)గా లేబర్ పార్టీ నేత జెరెమి కార్బిన్ నియమించారు ?
    1. ప్రీత్‌కౌర్ గిల్ 2. మార్గట్ జేమ్స్
    3. క్లెయిర్ పెర్రీ 4. కరెన్ బ్రాడ్‌లే
25. అంతర్జాతీయ టీ 20 క్రికెట్‌లో మూడు శతకాలు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించింది ఎవరు ?
    1. కోలిన్ మున్రో (న్యూజీలాండ్)
    2. క్రిస్ గేల్ (వెస్టిండీస్)
    3. సురేశ్ రైనా (భారత్)
    4. మార్టిన్ గప్టిల్ (న్యూజీలాండ్)
26. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏటా అందించే 'రంగినేని ఎల్లమ్మ' సాహిత్య పురస్కారానికి 2017 సంవత్సరానికిగాను ఎవరు ఎంపికయ్యారు ?
    1. జి.భరత్‌భూషణ్
    2. కె.శివారెడ్డి
    3. సుంకిరెడ్డి నారాయణరెడ్డి
    4. బి.రెడ్డి శంకర్‌బాబు
27. భారత సంతతికి చెందిన ప్రవాస పార్లమెంటేరియన్ల మొట్టమొదటి సదస్సు 2018 జనవరి 9, 10 తేదీల్లో ఎక్కడ జరిగింది ?
    1. కోల్‌కతా 2. ఢిల్లీ
    3. తిరువనంతపురం 4. బెంగళూర్
28. బీహార్ దేవ్‌గఢ్ ఖజానా కార్యాలయం నుంచి పశుగ్రాసం కొనుగోలు నిమిత్తం రూ.89.27 లక్షలను తప్పుడు పత్రాలతో తీసుకోవడానికి సంబంధించి ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌కు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం 2018 జనవరి 6న ఎన్నేళ్ల కారాగార శిక్ష విధించింది ?
    1. మూడున్నరేళ్లు
    2. నాలుగున్నరేళ్లు
    3. ఐదున్నరేళ్లు
    4. ఆరున్నరేళ్లు
29. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2018 జనవరి 12వ తేదీన ఉపగ్రహ వాహక నౌక పీఎస్ఎల్‌వీ-సీ 40 ద్వారా ఎన్ని ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్షంలో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది ?
    1. 28 ఉపగ్రహాలు
    2. 29 ఉపగ్రహాలు
    3. 30 ఉపగ్రహాలు
    4. 31 ఉపగ్రహాలు
30. 2018 సంవత్సరానికిగాను అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ (ఏఐఏఏ) సంస్థ అసోసియేట్ ఫెలోగా భారత్ నుంచి ఎవరు ఎంపికయ్యారు ?
    1. డాక్టర్ హేమలత
    2. ప్రదీప్‌సింగ్ ఖరోలా
    3. డాక్టర్ దేవయాని ఘోష్
    4. డాక్టర్ ప్రకాశ్ చంద్ జైన్
31. ప్రభుత్వ రంగ బ్యాంకులను (పీఎస్‌బీ) గట్టెక్కించే దిశగా బాండ్ల జారీ ద్వారా ఎన్ని రూ.కోట్ల మేర అదనపు మూలధనాన్ని సమకూర్చే ప్రతిపాదనకు లోక్‌సభ 2018 జనవరి 4న ఆమోదముద్ర వేసింది ?
    1. రూ.75,000 కోట్లు
    2. రూ.80,000 కోట్లు
    3. రూ.85,000 కోట్లు
    4. రూ.90,000 కోట్లు
32. ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ మూడో సీజన్‌లో విజేతగా నిలిచిన జట్టు ఏది ?
    1. ముంబై రాకెట్స్
    2. బెంగళూరు బ్లాస్టర్స్
    3. చెన్నై స్మాషర్స్
    4. హైదరాబాద్ హంటర్స్

సమాధానాలు

1. 3	2. 3	3. 3
4. 2	5. 3	6. 3
7. 1	8. 4	9. 4
10. 4	11. 1	12. 4
13. 4	14. 1	15. 1
16. 3	17. 2	18. 2
19. 1	20. 2	21. 3
22. 2	23. 2	24. 1
25. 1	26. 3	27. 2
29. 4	30. 4	31. 2
32. 4		

కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించి

భౌతికశాస్త్రం అంశాలకు ఎలా సిద్ధమవ్వాలి?



- భౌతికశాస్త్రంలో ప్రధానంగా ధ్వని, కాంతి, అయస్కాంతత్వం, విద్యుత్, ఆధునిక భౌతికశాస్త్రం, ఉష్ణం, యాంత్రిక శాస్త్రం, శాస్త్రవేత్తలు- వారి ఆవిష్కరణలు, నోబెల్ గ్రహీతలు తదితర అంశాలపై ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. ఒక్కో అంశానికి సంబంధించి ముఖ్యమైన వాటిని ప్రణాళికాబద్ధంగా చదవాలి. ఉదాహరణకు 'విద్యుత్' నుంచి ముఖ్యంగా విద్యుత్ ప్రవాహం, విద్యుత్ పొటెన్షియల్, ఓమ్ నియమం, నిరోధాల శ్రేణి, సమాంతర సంధానం, విద్యుత్ ఘటాలు, విద్యుత్ సాధనాలపై అవగాహన పెంపొందించుకోవాలి. ఉదా : కరెంటు - ఆంపియర్ ; నిరోధం- ఓమ్.
- ఉష్ణం నుంచి ఉష్ణం ప్రమాణాలు (కెలోరీ, జౌల్, ఎర్గ్), ఉష్ణ వహనం, ఉష్ణ సంవహనం, ఉష్ణ వికిరణం, వివిధ రకాల ఉష్ణోగ్రతా మాపకాలు (ఉదాహరణకు సెల్సియస్ ఫారన్‌హీట్, కెల్విన్ మాపకాలు), పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు (ముఖ్యంగా నీటి అసంగత వ్యాకోచం) తదితర అంశాలు నేర్చుకోవాలి.
- కాంతి నుంచి కాంతి ధర్మాలు (రుజువర్తనం, వివర్తనం, వికిరణం, పరావర్తనం, వ్యతికరణం), దృక్ సాధనాలు (కటకాలు, దర్పణాలు, మైక్రోస్కోప్‌లు, టెలిస్కోప్‌లు, టెలివిజన్‌లు), దృష్టి లోపాలు (హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టి), అదృశ్య వికిరణాలు (పరారుణ కిరణాలు, అతినీల లోహిత కిరణాలు, మైక్రో తరంగాలు, లేజర్ కిరణాలు) అంశాలపై దృష్టి సారించాలి.
- ధ్వనికి సంబంధించి ధ్వని ఉత్పత్తి, ధ్వని ప్రసారం, అతిధ్వనుల ఉపయోగాలు, అనునాదం, ప్రతిధ్వని, డాప్లర్ ఫలితం, ధ్వని కాలుష్యం తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- అయస్కాంత పదార్థాల ధర్మాలు, అయస్కాంతీకరణ పద్ధతులు, అయస్కాంత క్షేత్రం, అయస్కాంత పదార్థాల రకాలు (పారా, ఫెర్రో, దయా), భౌమ్య అయస్కాంతత్వం మొదలైన అంశాలను నేర్చుకోవాలి.

  ఆధునిక భౌతికశాస్త్రంలో రేడియో ధార్మికత, కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం, అణు రియాక్టర్లు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి.
- యాంత్రిక శాస్త్రంలో న్యూటన్ గమన నియమాలు, వాటి అనువర్తనాలు, ప్రచోదనం, ప్రక్షేపకం, యాంత్రిక శక్తి, స్థితిజ, గతిజ శక్తులు, భ్రమణ చలనం (అభికేంద్ర, అపకేంద్ర బలాలు, వాటి అవర్తనాలు) చదవాలి.
- వివిధ అంశాలకు సంబంధించిన ప్రాథమిక భావనలు- వాటి వాటి అనువర్తనాలపై దృష్టి సారించాలి. ముఖ్యంగా దైనందిన జీవితంలో ఉపయోగించే అనువర్తనాలను సమగ్రంగా చదవాలి.
- భౌతిక శాస్త్రంలో పేర్కొన్న అంశాలకు సంబంధించిన సమాచారాన్ని పాఠశాల స్థాయిలోని 8,9,10 తరగతుల ఫిజికల్ సైన్స్ నుంచి సంగ్రహించవచ్చు. వీటితోపాటు ఈ విభాగంలో ప్రామాణిక రచయితలు ప్రచురించిన పుస్తకాలు కూడా చదవాలి. కాబట్టి ఈ సూచనలను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు సరైన పుస్తకాలు చదవడంతోపాటు వివిధ దినపత్రికలు గమనిస్తూ సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులు, ఆవిష్కరణలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ముఖ్యంగా సొంతంగా నోట్స్ రూపొందించుకుంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



వివిధ శాస్త్రాలు - వాటి పితామహులు

శాస్త్రం	పితామహులు
జన్యుశాస్త్రం	గ్రిగరీ మెండల్
ఆర్గానిక్ కెమిస్ట్రీ	ఓలర్
వృక్షశాస్త్రం	థియోఫ్రాస్టస్
రేఖాగణితం	యూక్లిడ్
జీవశాస్త్రం	అరిస్టాటిల్
రాజనీతి శాస్త్రం	అరిస్టాటిల్
జంతుశాస్త్రం	అరిస్టాటిల్
జీవపరిణామ సిద్ధాంతం	చార్లెస్ డార్విన్
ఖగోళశాస్త్రం	హెకాటియస్
రోగనిరోధక శాస్త్రం	ఎడ్వర్డ్ జెన్నర్
కణశాస్త్రం	రాబర్ట్ హుక్
రసాయన శాస్త్రం	రాబర్ట్ బాయిల్
ఆధునిక రసాయనశాస్త్రం	ఆంటోని లావిసియర్
ఆధునిక జన్యుశాస్త్రం	మోర్గాన్
వర్గీకరణ శాస్త్రం	లిన్నేయస్
పరిణామక్రమ శాస్త్రం	లామార్క్
సూక్ష్మజీవ శాస్త్రం	లీవెన్ హుక్
అర్థశాస్త్రం	ఆడం స్మిత్
చరిత్ర	హెరిడోటస్
పద్యభాగం (ఆంగ్లం)	జెఫ్రీ ఛాసర్
న్యూక్లియర్ ఫిజిక్స్	ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్
ఆధునిక వైద్యశాస్త్రం	హిప్పోక్రటీస్

విశాలాంధ్ర బిజినెస్

-309.59 ▼ సెన్సెక్స్ 34,757.16	-94.05 ▼ నిఫ్టీ 10,666.66	100 ▲ బంగారం (విజయవాడ) 28,800 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 28,900 ప్రొద్దుటూరు 28,610 22 క్యారెట్లు, 10 గ్రాములు	◀◀ వెండి (విజయవాడ) 39,800 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 42,476 ప్రొద్దుటూరు 39,900 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 64.06

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఎయిర్‌టెల్	439.50	4.20
టాటా మోటార్స్	396.05	3.12
టాటా మోటార్స్ (డి)	218.80	2.27
బీహెచ్ఇఎల్	95.40	1.50
ఐటీసీ	281.80	1.43

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
హెచ్‌డీఎఫ్‌సీ	1,825.95	-4.06
లార్సెన్	1,362.75	-3.65
ఇండస్ఇండ్ బ్యాంక్	1,714.25	-2.36
కోటక్ మహీంద్ర	1,079.40	-2.32
బజాజ్ ఆటో	3,239.00	-2.00

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.05	64.06
యూరో	79.82	79.77
పౌండ్	90.47	89.94
ఆస్ట్రేలియా డాలర్	50.77	50.77
సింగపూర్ డాలర్	48.55	48.64

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,900	30,909
చెన్నై	28,960	30,973
బెంగళూరు	28,500	30,481
ముంబై	29,940	32,021
విజయవాడ	28,800	31,350
విశాఖపట్నం	28,900	30,350
ప్రొద్దుటూరు	28,610	30,900


ముడి చమురు	69.58



పెరిగిన బంగారం, తగ్గిన వెండి

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్‌లో సోమవారం బంగారం ధరలు అతి స్వల్పంగా రూ.20లు పెరిగి 10గ్రాముల బంగారం ధర రూ.31,270లు పలికింది. స్థానిక ఆభరణాల వర్తకుల నుండి డిమాండ్ అధికం కావడం, అమ్మకాలు పెరగడంతో బంగారం ధరలు స్వల్పంగా పెరిగినట్లు తెలుస్తోంది. వెండి ధరలు రూ.300లు తగ్గి కేజీ వెండి రూ.39,500లకు చేరింది. పరిశ్రమలు, నాణేల తయారీ దారులనుండి వెండికి డిమాండ్ తగ్గడం ప్రధానం కారణంగా ఉంది. అంతర్జాతీయంగా ట్రేడర్లు నుండి బంగారానికి డిమాండ్ పెరగడం, పెండ్లిడ్ల సీజన్ కావడంతో విలువైన లోహాల ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా బంగారం ధర 0.02శాతం పెరిగి ఔన్స్ 1332.10 డాలర్లకు చేరింది. వెండి ధర 0.78శాతంతో సింగపూర్‌లో ఔన్స్ 16.70 డాలర్లకు చేరింది. దేశ రాజధానిలో 99.9 శాతం మరియు 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.20లు పెరిగి రూ.31,270 మరియు రూ.31,120లకు చేరింది.

16పైసలు తగ్గిన రూపాయి



ముంబై: ఇంటర్‌బ్యాంకు ఫారెన్ ఎక్స్‌చేంజిలో డాలర్‌తో రూపాయి విలువ 16పైసలు తగ్గడంతో 64.22కు చేరింది. ఈక్విటీమార్కెట్‌లో నష్టాలు కూడా రూపాయి డిమాండ్ తగ్గేందుకు దోహదపడింది. దిగుమతిదారులు, బ్యాంకుల నుండి అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం, డొమెస్టిక్ ఈక్విటీ మార్కెట్‌లో నష్టాలు రూపాయికి డిమాండ్ తగ్గినట్లు కరెన్సీ ట్రేడర్ వెల్లడించారు. శుక్రవారం రూపాయి 4పైసలు విలువ తగ్గి 64.06 వద్ద నిలచింది. తాజా బడ్జెట్‌లో ద్రవ్యలోటు అంచనాకు మించి మరింత పెరగనున్నట్లు ప్రకటించడం రూపాయి విలువ తగ్గేందుకు దోహదపడింది. శుక్రవారం విదేశీ మదుపరులు ఈక్విటీ, డెబ్ట్ మార్కెట్‌లో 387 డాలర్లు పెట్టుబడులుపెట్టారు.

లాభాలకు ఊతమిచ్చే అప్‌స్టాక్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: న్యూఏజ్ డిస్కౌంట్ బ్రోకింగ్ ఫర్మ్ అప్ స్టాక్స్ ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో పెట్టు బడిదారులకు మేలైన పెట్టుబడులకు సహకారం అందిస్తోంది. ట్రేడింగ్‌లో గణాంకాల విశ్లేషణ, స్టాక్ మార్కెట్‌లో పెట్టు బడుల గుర్తించి సమర్థవంతమైన నిర్వహణను కలిగివుంది. దీనికితోడు అతి తక్కువ బ్రోకరేజ్ ఫీజును వసూలు చేస్తుంది. అత్యాధునిక సాంకేతిక సహాయంతో అప్‌స్టాక్స్ పెట్టుబడిదారులకు మార్గనిర్దేశనం చేస్తుందని అప్‌స్టాక్స్ వ్యవస్థాపకుడు మార్కెట్‌లో పెట్టుబడుల విషయంలో నష్టభయాన్ని తగ్గించేందుకు అప్‌స్టాక్స్ చేయూతనందిస్తుందన్నారు.


నకిలీ యాంటిబయోటిక్‌లు..!



లండన్ : ప్రపంచంలో ప్రజలు దాదాపు ఎక్కువమంది ఏదో ఒక రోగం పేరుతో యాంటిబయోటిక్ మందులు వాడుతుంటారు. ఇకనుంచి వాటిని వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండటం మంచిది. ఎందుకంటే మన దేశంలో దొరుకుతున్న యాంటిబయోటిక్‌లలో 64శాతం నకిలీ వేనని తెలుస్తోంది. వాటిని విక్రయించేందుకు కనీసం అనుమతులు వేలు. బ్రిటన్ నిర్వహించిన ఓ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా యాంటిబయోటిక్ మందుల వినియోగంపై లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీ, న్యూక్యాస్టిల్ యూనివర్సిటీలోని పరిశోధకులు సంయుక్తంగా ఓ అధ్యయనం చేపట్టారు. బ్రిటిష్ జర్నల్ ఆఫ్ క్లినికల్ ఫార్మాకాలజీలో ఈ అధ్యయనాన్ని ప్రచురించారు.

దీని ప్రకారం.. భారత మార్కెట్లో విక్రయిస్తున్న లక్షల సంఖ్యలో యాంటిబయోటిక్ మందులకు ఎలాంటి అనుమతులు లేనట్లు తెలిసింది. 2007 నుంచి 2012 మధ్య భారత్‌లో 118 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) ఫార్ములేషన్స్‌ను గుర్తించారు. ఇందులో 64శాతం మందులకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీవో) నుంచి ఎలాంటి అనుమతులు లేవని వెల్లడైంది. అనుమతిలేని కొత్త మందులను విక్రయించడం, సరఫరా చేయడం భారత్‌లో చట్టవ్యతిరేకం అయినప్పటికీ.. ఈ మందులను యథేచ్ఛగా అమ్ముతున్నట్లు సమాచారం. ప్రపంచ వ్యాప్తంగా యాంటిబయోటిక్ మందులను అత్యధికంగా వినియోగిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. దేశంలో 3,300 బ్రాండ్ల పేర్లతో ఎఫ్‌డీసీ యాంటిబయోటిక్స్ విక్రయమవుతున్నాయి. వీటిని 500 ఫార్మాస్యూటికల్ కంపెనీలు తయారుచేస్తున్నాయి. ఇందులో 12 మల్టీనేషనల్ కంపెనీలు ఉన్నాయి.

స్వల్పంగా కోలుకున్న మార్కెట్లు



ముంబై: బడ్జెట్ ప్రభావంతో దారుణంగా నష్టపోయిన మార్కెట్లు సోమవారం ప్రారంభంలో దాదాపు 546పాయింట్ల వరకు నష్టపోయి ముగింపులో స్వల్పంగా కోలుకున్నాయి. వరుసగా ఐదవ సెషన్‌లో కూడా అంటే సోమవారం ఎన్ఎస్ఇ ఇండెక్స్ నష్టాల్లో ముగిసింది. ఈక్విటీలపై ఎల్‌టీసిజి పన్ను 10శాతం విధించనిట్లు బడ్జెట్‌లో నిర్ణయించడం, రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా పరపతి విధాన సమీక్షా సమేవేశం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో సూచీలు భారీగా నష్టపోయాయి. వడ్డీరేట్లపై నిర్ణయాన్ని ఈ నెల 7న ప్రకటించనుండటంతో మదుపరులు అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తున్నారు. సెన్సెక్స్ మార్కెట్ ముగింపులో 310 పాయింట్ల నష్టంతో 0.88 శాతంతో 34,757 పాయింట్లుకు చేరింది. అయినా 238 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 94 పాయింట్లు నష్టంతో 0.87 శాతంతో 10,667 పాయింట్లు వద్ద ముగిసింది. 24 స్టాక్స్ గ్రీన్‌లో నమోదుకాగా 26 రెడ్‌లో నమోదయ్యాయి. ఇండెక్స్ 174 పాయింట్లతో 10,586 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో 23 స్టాక్స్ రెడ్ మార్కులో ట్రేడ్ అయ్యాయి. యస్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టాటాస్టీల్ నష్టాల్లో మునిగాయి. పిసి జ్యువెల్లర్స్ ఫిబ్రవరి 2న 60శాతం నష్టాలతో 15.26శాతం వద్ద ట్రేడ్ అయింది. బిఎస్ఇ మేజర్ లబ్దిదారులుగా బాంబో డైయింగ్, యునైటెడ్ బ్రువరీస్ నమోదయ్యాయి. వక్రాంజి లిమిటెడ్ బిఎస్ఇ టాప్ లూజర్‌గా 10శాతంతో 236 వద్ద నమోదైంది. నిఫ్టీ ప్యాక్‌లో హెచ్‌డిఎఫ్‌సి, ఎల్ అండ్ టి, ఇండస్ఇండ్ బ్యాంకు టాప్ లూజర్స్‌కాగా నిఫ్టీ ఆటో, ఫార్మా, పిఎస్‌యు బ్యాంకు, ఎఫ్ఎమ్‌సిజి గ్రీన్‌లో నమోదయ్యాయి. ఎన్ఎస్ఇ సెక్టరల్ సూచీల్లో నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ మరింతగా నష్టపోయింది. 136స్టాక్స్ 52 వారాల కనిష్టానికి దిగజారాయి.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియా షేర్లుకూడా సోమవారం నష్టాల్లో నమోదయ్యాయి. షాంఘై ఎస్ఇ కాంపోజిట్ ఇండెక్స్ 0.03శాతం నష్టపోగా, హాంగ్ శాంగ్ 1.46శాతంతో 479 పాయింట్లు నష్టపోయింది. నిక్కీ 542పాయింట్లతో 2.32శాతం దిగజారింది. తైవాన్ టి సెక్ 50 ఇండెక్స్ 1.58శాతంతో 174 పాయింట్లు నష్టపోయింది. జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 1.7శాతం నషాల్లో మునిగింది. ఎస్ అండ్ పి0.3 శాతం, డౌ ఫ్యూచర్స్ 0.6శాతం నష్టపోగా ఎఫ్‌టిఎస్ఇ ఫ్యూచర్స్ 1శాతం నష్టపోయాయి.

1150 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

బడ్జెట్ నేపథ్యంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సెన్సెక్స్ భారీగా పతనమైంది. బడ్జెట్ అనంతరం రెండు సెషన్లలో ఏకంగా 1150 పాయింట్లు కోల్పోయింది. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో 840 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్.. ఈ ఉదయం కూడా భారీ నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఆరంభ సమయంలో ఏకంగా 500 పాయింట్లకు పైగా నష్టంతో కొనసాగింది. అయితే చివర్లో కాస్త కోలుకున్నప్పటికీ.. నష్టాలు మాత్రం తప్పలేదు.

సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి 309.59 పాయిట్ల నష్టంతో 34,757.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా రెండు రోజుల్లో 350 పాయింట్లు పోగొట్టుకుంది. శుక్రవారం 256 పాయింట్లు నష్టపోయిన సూచీ.. నేటి ఆరంభంలోనూ 100కు పైగా నష్టాలతో ట్రేడ్ అయ్యింది. చివరకు 94.05 పాయింట్లు కోల్పోయి 10,666.55 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్ అండ్ టీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ తదితర షేర్లు నష్టపోయాయి.

దిగుమతులపై ప్రతికూల ప్రభావం

న్యూఢిల్లీ: పలు వస్తువుల దిగుమతులపై పన్ను పెంచేందుకు తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం నిర్ణయించడంతో దీని ప్రభావం రూ.65 బిలియన్ల దిగుమతులపై ప్రతికూల ప్రభావం చూపనుంది. మొబైల్ ఫోన్లు, ఆటోమొబైల్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, కాపిటల్ గూడ్స్, ఎడిబుల్ ఆయిల్స్, ఫుట్‌వేర్, ఇమిటేషన్ జ్యువెల్లరీ, జ్యూస్‌లు వంటి వాటి ద్వారా సుమారు 38.3 బిలియన్లకుపై వస్తువులు మనం దిగుమతి చేసుకుంటాం. దిగుమతి సుంకం పెంచడంతో దేశీయ తయారీ దారులను ప్రోత్సహించేందుకు మేకిన్ ఇండియా మిషన్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్ విన్నీ మెహతా వెల్లడించారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు నని తెలిపింది. ఆటో కాంపోనెంట్స్ అయిన ఇంజిన్, ట్రాన్స్ మిషన్ పార్టులు, బ్రేక్స్, సస్పెన్షన్, గేర్ బాక్సులు, ఎయిర్‌బ్యాగ్స్ వంటివాటిపై 7.5శాతం నుండి 15 శాతం పెరిగింది. ఎలక్ట్రానిక్స్ విషయానికొస్తే, డిసెంబర్‌లో 4.6 బిలియన్ డాలర్ల విలువగల వస్తువులను దిగుమతి చేసుకోగా ఏడాదికి దాదాపు 20 శాతం పెరుగుదల నమోదు చేసింది. దిగుమతి సుంకం పెరగడంతో అమ్మకాలపై పరిమితి ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు సూచిస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో అందుబాటులో ఉండి మార్కెట్ అంతగా లేని వస్తువులపై దిగుమతి సుంకాన్ని పెంచినట్లు తెలుస్తోంది.


నాలుగు రాష్ట్రాల్లోనే పెట్రో, డీజిల్‌పై వ్యాట్ తగ్గింపు

కేంద్ర మంత్రి ప్రధాన్

న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుం కాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న 2017, అక్టోబర్ నుంచి ఆ రెండింటిపై స్థానిక అమ్మకం పన్ను లేదా వ్యాట్‌ను కేవలం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం మాత్రమే కోత విధించాయని చమురు శాఖ మంత్రి ధర్మేంద ప్రధాన్ సోమవారం తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు మూడేళ్లలో తారా స్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వం 2017, అక్టోబర్ 3న పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.2 చొప్పున తగ్గించింది. వ్యాట్‌లో కోత విధించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. లోక్ సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ప్రదాన్ మాట్లాడుతూ ' నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను తగ్గించాయి' అని తెలిపారు. అయితే ఆ రాష్ట్రాల పేర్లను ఆయన వెల్లడించలేదు. ప్రధాన్ మాట్లాడుతూ 'అంతర్జాతీయ ఉత్పత్తి ధరలు, ఇతర మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ కంపెనీల నిర్ణయం ఉంటుందన్నారు. ఎక్సైజ్ సుంకం తగ్గింపు వినియోగదారులకు ఉపశమనం కలిగించే లక్ష్యంతోనే అని ఆయన అన్నారు. అయితే అంతర్జాతీయ ధరలు తగ్గుముఖం పట్టినా రిటైల్ ధరలు మాత్రం అక్టోబర్‌కన్నా అత్యధిక స్థాయికి చేరాయి. ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.73.31తో నాలుగేళ్లలో గరిష్ట స్థాయికి చేరింది. ఇక డీజిల్ కూడా మునుపెన్నడూ లేని గరిష్ట స్థాయిలో రూ.64.14గా ఉంది.

బడ్జెట్‌లో బీహార్ ఎక్కువే పొందింది

రాజకీయ సమీకరణతో ప్రత్యేక హోదా ఆశించడం సరికాదు : నితీష్ కుమార్



పాట్నా : పన్ను ఆదాయంలో వాటాపరంగా కేంద్ర బడ్జెట్ నుంచి ఆశించిన దానికంటే రాష్ట్రం ఎక్కువే పొందిందని బీహార్ ముఖ్యమంత్రి నితిష్ కుమార్ సోమవారం తెలిపారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో నితిష్ మాట్లాడుతూ బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండుకు తాను కట్టుబడి ఉన్నానని అన్నారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో తన పార్టీ జేడీ(యూ) పొత్తు పెట్టుకోవడం ఫలితంగా అది వస్తుందని ఆశించడం సరికాదన్నారు. 'కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు అన్యాయం జరిగిందన్నది సరికాదు. పన్ను ఆదాయంలో రాష్ట్ర వాటా రూ.76 వేల కోట్లుగా ఉందని, మనం ఆశించింది దానికన్నా తక్కువ. బీహార్ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న (రాజకీయ సంస్కరణ కోసం) నిర్ణయం' అని జేడీ(యూ) జాతీయ అధ్యక్షుడు నితిష్ పేర్కొన్నారు. ఎన్నికల కోసం బీజేపీతో నితిష్ చేతులు కలిపినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు న్యాయం జరగలేదన్న ఆర్‌జేడీ, ఇతర విపక్ష పార్టీల ఆరోపణలకు ఆయన సమాధానమిస్తూ, ప్రత్యేక హోదాను బీహార్ ప్రజలు కోరుకుంటున్నారని, రాష్ట్ర చట్ట సభలు రెండింటిలోనూ ఆ మేరకు తీర్మానం ఆమోదం పొందిందన్నారు. 'కానీ అక్కడ ఒక ప్రక్రియ ఉంది. రాజకీయ సమీకరణ ఫలితంగా ప్రత్యేక హోదా వస్తుందని ఆశించడం సరికాదు' అని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే బీహార్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఇదిలాఉండగా రాజస్థాన్ ఉప ఎన్నికల్లో బీజేపీ పరాభావం ఒక హెచ్చరికేనంటూ వస్తున్న వ్యాఖ్యలను నితిష్ తోసిపుచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీయే మరోసారి విజయం సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 'ఉప ఎన్నికల ఫలితాల ద్వారా రాజకీయ పరిస్థితిని మేము జాగ్రత్తగా గమనిస్తున్నాం' అని చెప్పారు.

ధరల పెంపుపై

యూడీఎఫ్ వాకౌట్

తిరువనంతపురం: నిత్యవసర ధరల పెంపునకు నిరస నగా కాంగ్రెస్ -యూడీఎఫ్ కూటమి అసెంబ్లీ నుంచి వాకవుట్ చేసింది. కేరళ ప్రభుత్వం ధరలను నియంత్రించడంలో ఘోరంగా విఫలమైందని దీనిపై చర్చచే పట్టడానికి నిరాకరించడంతో నిరసనగా వాక్‌అవుట్ చేస్తున్నామన్నారు. మార్కెట్‌లోని నిల్వలు నల్లబజారుకు తరలిపోతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనిపై రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి పి.తిలోత్తమన్ మాట్లాడుతూ నిత్యవసర సరుకులపై ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ,పెట్రోలు రేట్ల పెంపుతో తరచూ రవాణా చార్జీలు పెరుగుతున్నాయన్నారు. అంతకుముందున్న యూడీఎఫ్ ప్రభుత్వం కంటే కూడా రెండేళ్ల ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంలో ప్రభుత్వం ధరలను అదుపులో పెట్టిందన్నారు. 13 నిత్యావసర సరుకులను సబ్సిడీపై అందిస్తున్నామని ఆయన వివరించారు. బియ్యం, చక్కెర, కొబ్బరినూనెలపై మాత్రమే కొంచెం ధరలు పెరిగాయని, జీఎస్టీ అమలు తర్వాత బ్రాండెడ్ బియ్యం రేట్లు పెంచారని, దీంతో షాపింగ్‌మాల్స్‌పై తూనికలు కొలతల శాఖ దాడులు నిర్వహించి ఇప్పటి వరకు 80 కేసులు నమోదు చేసిందన్నారు. కాంగ్రెస్ సభ్యుడు కె మురళీధరన్ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నాయని, సామాన్య జనం మాత్రం ఇబ్బందుల పాలవుతున్నాయని విమర్శించారు. చమురు ధరలపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అదనపు పన్నుల భారాన్ని తీసివేయడం లేదని ప్రశ్నిస్తూ అంతకు ముందున్న ఒమెన్ చాందీ ప్రభుత్వం వాటిని తన నాలుగు సార్ల ప్రభుత్వంలో తగ్గించారని గుర్తు చేశారు. గతేడాది మార్కెట్ ఇంటర్‌వెన్షన్ కోసం బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయించి ఈ ఏడాది మాత్రం కేవలం రూ. 250 కోట్లు కేటాయించడంపై చర్చ చేపట్టాలని కోరడంతో స్పీకర్ అందుకు అనుమతించలేదు. దీంతో ప్రతిపక్షం వాక్ అవుట్ చేసింది.

సెల్ఫీ ప్రియులకు సోనీ ఎక్స్‌పీరియా..!

విజయవాడ : సెల్ఫీ ప్రేమికుల కోసం సోనీ ఇండియా సరికొత్త ప్రీమియం స్మార్ట్‌ఫోన్ ఎక్స్‌పీరియా ఎల్-2ను ఆవిష్కరించింది. 13.9 సెంటీమీటర్ల స్క్రీన్ డిస్‌ప్లే, రెండు శక్తివంత కెమెరాలో రోజంతా డిచ్చార్జి కానీ బ్యాటరీ ఈ స్మార్ట్ ఫోన్ ప్రత్యేకత. 8 ఎంపీ 120 సూపర్ వైడ్ యాంగిల్ సెల్ఫీ కెమెరా, 13 ఎంపీ ఎఫ్-2 ప్రధాన కెమెరా, 3300 ఎంఏహెచ్ బ్యాటరీ దీని సొంతం. ఒన్‌టచ్‌రియర్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సార్‌తో సులభంగా అన్‌లాక్ చేసుకోవచ్చు. నలుపు, బంగారు రంగుల్లో అందుబాటులోకి వచ్చింది. దీని ధరరూ.19,990లు. అన్ని సోనీ షాపుల్లోనూ లభిస్తుంది.

విజ్ఞానం

పలు మార్పులకు

లోనవుతున్న భూ అయస్కాంత క్షేత్రం



భూమి తన అయస్కాంత ధృవాలను క్రమంగా మారుస్తోందని యూరోపియన్ స్పేస్ ఏజన్సీ హెచ్చరించింది. కేవలం 200ఏళ్ల నుండి భూమి చుట్టూ ఉన్న అయస్కాంత క్షేత్రం 15శాతం తగ్గుతూ వస్తోందని శాస్త్రజ్ఞుల పరిశోధనలో వెల్లడైంది. ఈ క్షీణత వేగవంతమైనకొలదీ రేడియేషన్ మరింత పెరుగుతుందని తెలుస్తోంది. రానున్న 2000 సంవత్సరాల్లో మాగ్నటిక్ ఫ్లిప్ ఎప్పుడైనా సంభవించవచ్చునని వీరి అంచనా.. వీరి పరిశోధనల ప్రకారం మన గ్రహం యొక్క అయస్కాంత క్షేత్రం 5శాతం వంతున మార్పులకు లోనవుతోంది. భూమి అవిర్భవ దశనుండి ధృవాల్లో జరిగే అయస్కాంత ఆకర్షణ మార్పులు నూతన ప్రక్రియ ఏమీకాదనేది వీరి అభిప్రాయం సుమారు 780,000 ఏళ్ల క్రితమే, భూమి తన అయస్కాంత క్షేత్రంలో పలు మార్పులకు లోనైంది. సాధారణంగా భూమి ధృవాల్లో అయస్కాంత క్షేత్ర మార్పులు ప్రతి రెండు, మూడు సంవత్సరాలకోసారి జరుగుతుందని అమెరికన్ స్టాటిస్టికల్ అనాలసిస్ అంచనా.. దీని ప్రకారం భూమి అయస్కాంత క్షేత్రం మొత్తం తిరోగమనానికి వస్తుందని వీరి అంచనా. కానీ దీని పరిణామాలు మాత్రం వినాశకరంగా ఉంటాయి. దీనివలన వాతావరణంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయి. ధృవాల్లో అయస్కాంత క్షేత్ర మార్పులు కారణంగా మొత్తం అయస్కాంత క్షేత్రం పలు మార్పులకు లోనవుతుంది.

పాలపుంత ఆవల గ్రహాలను

కనుగొన్న శాస్త్రజ్ఞులు

శాస్త్రవేత్తలు సౌర వ్యవస్థను అర్థంచేసుకోవడంతోపాటు మరిన్ని నూతన విషయాలకోసం అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. మొదటిసారి పాలపుంత గెలాక్సీని దాటి ఉన్న గ్రహాల్లో మనుషుల కోసం ఒక్లహోమా యూనివర్సిటీ అంతరిక్ష పరిశోధకులు కనుగొన్నారు. నాసాకుచెందిన చంద్ర ఎక్స్-రే పరిశోధన నుండి సమాచారాన్ని ఉపయోగించి, పరిశోధకులు మైక్రోలెన్సింగ్ ద్వారా చంద్రుని ద్రవ్యరాశి నుండి జూపిటర్ మాస్ వరకు ఎక్స్‌ట్రాగలాక్టిక్ గెలాక్సీలను పరీక్షించారు. మైక్రోలెన్సింగ్ అనేది ఖగోళశాస్త్ర పరిశోధనకు సంభందించినది. దీని ద్వారా గ్రహాలను గుర్తించేందుకు గురుత్వాకర్షణ ద్వారా కాంతి వక్రీభవనం చెందినా గ్రహాలను గుర్తిస్తుంది. భూమి దూరంగా ఉన్నప్పటికీ నూతన గ్రహాలను గుర్తించేందుకు ఇదొక పద్ధతి. ఆస్ట్రోఫిజికల్ జర్నల్‌లో ప్రచురించిన ప్రకారంగా, 3.8 బిలియన్ కాంతి సంవత్సరాలకు దూరంగా గెలాక్సీ స్పాట్‌ను గుర్తించారు. దీన్నిచూసి తాము చాలా ఆశ్చర్యానికి లోనయ్యామని,మొదటిసారి గెలక్సీ ఆవల గ్రహాలను కనుగొన్నామని ఒక్లహోమా ప్రొఫెసర్ దాయ్ వెల్లడించారు. దీనిపై మరింత పరిశోధన జరగవలసిఉందని ఆయన వెల్లడించారు.

మిస్ ఇండియా ఆడిషన్స్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలో ఎంతో ప్రాముఖ్యత వహించిన ఎఫ్‌బీబీ కలర్స్ ఫెమినా మిస్ ఇండియా పోటీలు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సరికొత్త విధానంలో ఈ 55వ ఎడిషన్ ఫెమినా మిస్ ఇండియా పోటీలు నిర్వహిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి యువతులు ఈ పోటీల్లో పాల్గొనన్నునారు. జాతీయ స్థాయి ఫైనల్ పోటీలు ముంబైలో జరుగనున్నాయి. తుదిగా ఎంపికైన విజేతలకు మిస్ ఇండియా కిరీటాన్ని బహుకరించనున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికై టాప్ 3 విజేతలు తదుపరి బెంగళూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు దరఖాస్తులను పంపుకోవచ్చని ఎఫ్‌బీబీ తెలిపింది.

దేశీయపు నంబర్ వన్ ఆశీర్వాద్ ఆటా

విజయవాడ : దేశీయ నంబర్ వన్ ప్యాకేజ్డ్ గోధుమపిండి ఆశీర్వాద్ ఐటిసి సంస్థ పి.ఆర్. ఎన్ రావు తెలిపారు. ఇటీవల ఇంటర్నేట్ విస్తృతంగా ప్రసారంపై భారతదేశపు నంబర్‌వన్ గోధుమపిండిని ఆటాలో ప్లాస్టిక్ మిశ్రమం ఉందన్న అసత్య ఆరోపణలతో కూడిన వీడియోలు ఇటీవల ప్రసారమవుతున్న విషయాన్ని ఐటిసి పేర్కొంది. ఇది ఏ మాత్రం నిజం కాదని పిండి వాడకం పట్ల జనంలో ఏహ్యభావం కలిగించి ఆశీర్వాద్ బ్రాండ్ యొక్క ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారం మాత్రమేనని తెలిపారు. ఐఎస్ఒ 22000 ధృవీకరణ పొందిన తన ఉత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి చేసిన ఆటా ని 410 రకాల పరీక్షలను నిర్వహించి విడుదల చేసినట్లు తెలిపారు. దీనిపై గౌరవ న్యాయస్థానం సామాజిక మాధ్యమాల ద్వారా కొనసాగించడం నిషేదిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసిందన్నారు.

హార్లిక్స్ గ్రోత్ ప్లస్ జాగృతి ప్రారంభం..!

విజయవాడ: పౌష్టికాహార లేమితో బాలల్లో ఎదుగుదల లోపాన్ని నివారించేందుకు జాతీయ పౌష్టికత అభియాన్ నిర్వహిస్తున్న జాగృతికి హార్లిక్స్ గ్రోత్ ప్లస్ కూడా అత్యాధునిక ప్రచార జాగృతిని చేపట్టింది. యువ భారతదేశానికి కొరత లేకుండా అభివృద్ధి చేసేందుకు మూడు నుంచి తొమ్మిదేళ్ల లోపు బాలల్లో ఎదుగుదలను మెరుగు పర్చేందుకు హార్లిక్స్ గ్రోత్ ప్లస్ కృషి చేస్తోంది. ఇటీవల విడుదలైన గ్లోబల్ ఇండెక్స్ ఫర్ హంగర్స్ నివేదిక ప్రకారం, ఐదేళ్లలోపు బాలల్లో 21 శాతం మంది బక్కచిక్కిపోయారు. సన్నగా, తక్కువ భరువుతో ఉన్నారు. 38.4 శాతం మంది పొట్టిగా ఉన్నారు. నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో 2017 నివేదిక ఈ తీవ్రతను ప్రకటించింది. నగరాల్లోని బాలల్లో 25.1 శాతం తక్కువ బరువు, 28 శాతం బాలలు పొట్టిగా ఉన్నట్టు గుర్తించింది. అంతర్జాతీయ బాలల నిపుణులు రూపొందించిన సూత్రం ప్రకారం హార్లిక్స్ గ్రోత్ ప్లస్ బాలల్లో బొజ్జ పెరగకుండా ఎదుగుదలను గరిష్టం చేస్తుంది. జీఎస్‌కే కన్స్యూమర్ హెల్త్‌కేర్ న్యూట్రిషన్ డైజెస్టివ్ హెల్త్ ఏరియా మార్కెటింగ్ లీడ్ విక్రమ్ బహ్లే ఈ జాగృతి గురించి మాట్లాడుతూ, 15 ఏళ్ల పాటు నిపుణుల పరిశోధనలతో హార్లిక్స్ గ్రోత్ ప్లస్‌ను మెరుగు పర్చిన పౌష్టికాహార ఉత్పత్తిగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. హార్లిక్స్ గ్రోత్ ప్లస్ రెండు రెట్ల ప్రోటీన్లతో బాలల కండరాలను వృద్ధి చేస్తుందన్నారు. ఇతర పానీయాలతో పోల్చితే తక్కువ కొవ్వు పదార్థాలతో ఆరోగ్యకర బరువును పెంచుతుందన్నారు. 90 రోజుల్లో మూడు రెట్ల గ్రోత్‌ను సాధిస్తుందని వైజ్ఞానికంగా నిరూపితమైందన్నారు.



అంటార్కిటికా ఖండం విశేషాలు......



అంటార్కిటికా ఈ ఖండం పేరు వినగానే మనకు గుర్తొచ్చేది కనుచూపుమేరంతా మంచుపరుచుకొని ఉంటుందని. అయితే ఒకశాతం మంచులేని మట్టి భూభాగం కనిపిస్తుంది. ఇది దక్షిణ ధృవం దగ్గర ఉంది. అంటార్కిటికా ఖండానికి సొంతంగా టైమ్‌జోన్ లేదు. అక్కడ స్థానికంగా పుట్టినవారు ఎవరూ లేకపోవడం, ఏ ఒక్క దేశ ప్రభుత్వం కిందా అది లేకపోవడంతో స్వతహాగా దానికి మాత్రమే టైమ్‌జోన్ ఏర్పాటు చేయలేదంటారు. టైమ్‌జోన్ అనేది ప్రతి దేశానికీ ఉంటుంది. అయితే అంటార్కిటికాలో చాలా దేశాల టైమ్‌జోన్‌లు వాడుకలో ఉన్నాయి. ఇక్కడున్న దేశాల బేస్‌క్యాంపుల్లో వాళ్ళ సొంతదేశపు టైమ్‌లైన్లనే ఉపయోగించుకుంటున్నారు. మరికొందరు తమ బేస్‌క్యాంప్‌కు సమీపంలో ఏ దేశం ఉంటే ఆ టైమ్‌ని వాడతారు. కార్లిన్‌బేస్ అని ఒకటుంది. ఇది అర్జెంటీనా ప్రభుత్వపు అధికారిక బేస్‌క్యాంప్. దీనికి సమీపంలోనే అంటే దక్షిణ అమెరికా ఖండం కొసన అర్జెంటీనా దేశం ఉంటుంది. అది ఈ క్యాంప్‌కు దగ్గరగా ఉంటుంది. కాబట్టి ఆ టైమ్‌నే ఇక్కడ వాడతారన్నమాట.

అంటార్కిటికా విస్తీర్ణం మొత్తం కోటీ నలభైలక్షల చదరపు కిలోమీటర్లు. చలికాలంలో ఇక్కడికి దగ్గరగా ఉండే సముద్రాల నీరూ గడ్డకట్టేస్తుంది. దీంతో దీని విస్తీర్ణం కొన్ని లక్షల చదరపు కిలోమీటర్ల వరకూ పెరుగుతూ ఉంటుంది. మళ్ళీ వేసవి ప్రారంభమయ్యేసరికి ఆ మంచు కరిగిపోయి మామూలు లెక్కకి వచ్చేస్తుంది. వేసవికాలం అంటే ఎండ ఉంటుందని అనుకోకండి. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు వేసవే. ఈ సమయంలో ఇక్కడ దాదాపు -15 నుంచి -35డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత ఉంటుంది. మార్చి నుంచి మిగిలిన అన్ని నెలలూ ఇక్కడ చలికాలమే. మనదేశంలో 10డిగ్రీలు ఉంటేనే గజగజ వణుకుతుంటాం. మరి ఇక్కడ చలికాలంలో అయితే -40 నుంచి -70డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతాయి. ఆ చలిని భరించాలంటే అమ్మో! ఊహించలేము.

అంటార్కిటికాలో నివాసాల విషయానికి వస్తే, అంటార్కిటికాలోనే పుట్టి పెరిగిన స్థానికులే లేరు. వేసవిలో మాత్రమే ఇక్కడ కొంతమంది నివసిస్తుంటారు. వాళ్ళు కూడా వివిధ దేశాల నుంచి వచ్చినవాళ్ళే. ఇక్కడ పంటలుండవు, ఆఫీసులుండవు. మరి నివాసాలు ఎలా సాధ్యమవుతాయి? అయితే ఇక్కడ దాదాపు నలభైదేశాలకు చెందిన 100 పరిశోధనా సంస్థలు ఉన్నాయి. ఒక్కో దేశం వారు ఒక్కో ప్రదేశంలో ఇక్కడ బేస్‌క్యాంపులు, పరిశోధనా కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటారు. మన దేశం పేరున కూడా ఒక బేస్‌క్యాంప్ ఉంది. దాని పేరు భారతి. వీటన్నింటిలో పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలు, వారి సహాయకులు మాత్రమే వీటిలో ఉంటారు. వీళ్ళంతా ఇక్కడ వాతావరణం, మొక్కలు, జంతువులు లాంటి వివిధ అంశాల మీద పరిశోధనలు చేస్తారు. చలికాలం ప్రారంభ మయిన వెంటనే బేస్‌క్యాంపులు ఖాళీచేసి వారూ వెళ్ళిపోతారు. అయితే పర్యాటకులు సందర్శించడానికి వెళ్ళినపుడు ఆ కాలనీలో కొన్నిరోజుల పాటు పర్యాటకులు అక్కడ ఉంటారు.



అంటార్కిటికాలో పంటలు పండవు. మరిక్కడ ఉన్నవారికి ఆహారం కావాలి. అందుకని వీళ్ళు ఏం చేస్తారంటే దక్షిణధృవంకి దగ్గరగా ఉన్న ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా లాంటి దేశాల నుంచి ఆహారపదార్థాల్ని ఓడలు, విమానాల్లో తీసుకెళతారు. అక్కడ పరిశోధనల కోసమని కొద్దిగా కూరగాయల్లాంటివి పండిస్తున్నారు. అయితే అవి బయటి ఉష్ణోగ్రతలకు సంబంధం లేకుండా పూర్తిగా భవనాల్లోపల, లైట్ల వెలుతురుల మధ్య వాటిని పెంచుతున్నారు. ఇక్కడుండే ఇళ్ళన్నీ దాదాపుగా చెక్కతో చేసినవే ఉంటాయి. చెక్క చలిని లోపలికి రానివ్వకపోవడమే అందుకు కారణం. వీళ్ళంతా శరీరం మొత్తం కప్పిఉండేలా దుస్తులు వేసుకుంటారు. స్వెట్టర్లు, గ్లౌజులు వేసుకుని శరీరాన్ని వేడిగా ఉంచుకునేందుకు జాగ్రత్తలు చేపడతారు. ఇవి లేకుండా ఇక్కడ మనుషులు జీవించలేరు. దాదాపు 1700 రకాల మొక్కల జాతులు ఉన్నాయి. వీటిలో నేలన పెరిగే గడ్డిమొక్కలు, గుల్మాలు ఎక్కువగా ఉంటాయి. చలిలో మనుషులు ఉండటం కష్టంగానీ ఇక్కడ చాలారకాల జంతువులు ఉన్నాయి. జడలబర్రెలు, గుడ్లగూబలు, ధృవపు ఎలుగుబంట్లు, పెంగ్విన్‌లు ఉంటాయి. అనేక అరుదైన జీవజాతులు కూడా కనిపిస్తాయి. ఇన్ని తేడాలు, వైవిధ్యాలు ఉన్నాయి కాబట్టే అంటార్కిటికా ఖండం ప్రత్యేకత సంతరించుకుంది.



పదార్థాలను విశ్లేషించడానికి ఉపయోగించే పరికరాన్ని 'మాస్ స్పెక్ట్రోగ్రాఫ్' అంటారు. దీన్ని బ్రిటన్‌కు చెందిన విలియమ్ ఫ్రాన్సిస్ ఆస్టన్ రూపొందించాడు. దీని ద్వారా పదార్థంలో వున్న అణువులు, పరమాణువులను గుర్తించవచ్చు. అవి ఎన్నెన్ని ఉన్నాయో కూడా లెక్కించవచ్చు. భూగర్భ, రసాయన, జీవశాస్త్రాల్లోనూ, న్యూక్లియర్ ఫిజిక్స్ మొదలైన శాస్త్రాలలో దీన్ని ఉపయోగిస్తారు. ఐసోటోపిక్ అధ్యయనంలో ఇది అత్యంత ఉపయుక్తం. దీనిని ఉపయోగించి 212 ఐసోటోపుల్ని ఆస్టన్ కనుగొన్నాడు. ఈ పరికరాన్ని రూపొందించినందుకు 1922లో ఆస్టన్‌కు నోబెల్ బహుమతి లభించింది. ఆ తరువాత డెంప్‌స్టర్, బెయిన్ బ్రిడ్జ్, నియర్ మొదలైన శాస్త్రజ్ఞులు ఈ పరికరాన్ని మరింత అభివృద్ధి చేశారు.

ఇంగ్లీషు అక్షరం ' జ ' ఆకారంలో చిన్న అచ్చు తయారు చేసిన దానిలో దాదాపు 1.25 కిలోల గడ్డకట్టిన నెయ్యి మాదిరిగా ఉన్న అమ్మోనియమ్ నైట్రేట్ (నియెజిల్-90)ను 600 నుంచి 700 గ్రాముల గుండ్రటి ఇనుపు గుళ్లను కూరుస్తారు. కొన్ని డిటోనేటర్లను అమర్చి 9 ఓల్టుల బ్యాటరీని అమర్చే విధానాన్ని విస్ఫోట పరిభాషలో "షేప్డ్ బాంబ్" అంటారు.

ఒక మిశ్రమంలోని వివిధ పదార్థాలను గుర్తించడానికి, శుభ్రపరచడానికి, వేరుచేయడానికి వాడే అత్యాధునిక పద్ధతిని 'క్రొమాటోగ్రఫీ' అంటారు. 1906లో రష్యాకు చెందిన వృక్షశాస్త్రవేత్త మిక్కాల్‌జ్వెట్ తొలిసారిగా ఈ పద్ధతిని ఉపయోగించాడు.



మనుష్యుల్లో గానీ, జంతువుల్లోగానీ ఎడంచేతి వాటం గలవాళ్ళు చాలా తక్కువ. కానీ ధృవ ప్రాంతాలలో వుండే ఎలుగుబంట్లు అన్నీ ఎడమచేతి వాటంవే.



మనిషి శరీరంలో బొటన వ్రేలుకి ఎంతో ప్రాముఖ్యం వుందని అందరికీ తెలుసు. అయితే మన మెదడు-గుండెనీ, నడుముకు దిగువభాగాన వుండే అవయవాల్ని నియంత్రించడానికి ఎంత శక్తిని వినియోగిస్తుందో, బొటనవ్రేలుని నియంత్రించడానికి అంతకన్నా ఎక్కువ శక్తిని వినియోగిస్తుంది.





మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన మరో జన్యు చిత్ర పటాన్ని (జినోమ్) బ్రిటన్ శాస్త్రవేత్తలు రూపొందించారు. ఇంతవరకూ రూపొందించిన జినోమ్‌లలో ఇది మూడోది. ఈ జినోమ్ ద్వారా మనుషులకు సంబంధించిన పలు శారీరక సమస్యలను అధ్యయనం చేయడానికి వీలవుతుందని వారు తెలిపారు. స్థూలకాయం నుంచి ఎలర్జీదాకా వివిధ సమస్యలు ఎందుకు వస్తాయో తెలుసుకోవడానికి తాజా జినోమ్ ఉపకరిస్తుందని చెప్పారు. ఇంతవరకూ రూపొందించిన జినోమ్‌లన్నిటికంటే ఇది పెద్దది. 727 జన్యువులు, 6 కోట్ల డి.ఎన్.ఎలు, 20 జతల క్రోమోజోమ్‌లతో ఈ భారీ జినోమ్‌ను రూపొందించారు. మెదడు మొద్దుబారటం, రోగనిరోధక శక్తి సన్నగిల్లటం, తరచు జ్వరం రావడం, గుండెజబ్బు, మధుమేహం, కీళ్లనొప్పుల వంటి అనేక రోగాలకు 32 జన్యువులు కారణమని తమ పరిశీలనలో తేలిందని జినోమ్ రూపశిల్పులు తెలిపారు.



సాయిధరమ్ తేజ్... చిరంజీవి అంత పెద్ద స్టార్ కావాలి

వి.వి.వినాయక్



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా లావణ్య త్రిపాఠి హీరోయిన్‌గా సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లి. అధినేత సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్ చిత్రం ఇది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఫిబ్రవరి 9న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా రాజమండ్రిలో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో...

సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ - అత్తకి యముడు అమ్మాయికి మొగుడు సినిమా వంద రోజుల ఫంక్షన్ తర్వాత ఆ రేంజ్‌లో గ్రాండ్‌గా జరుగుతున్న ఫంక్షన్ ఇంటిలిజెంట్. ప్రేక్షకులు ఆశీర్వాదం మాకు ఉంటుందని భావిస్తున్నాం. వి.వి.వినాయక్‌గారు నాకు ఎంతో ఇష్టమైన డైరెక్టర్. ఆయన్ని చూడగానే హోమ్లీ డైరెక్టర్ అనే ఫీలింగ్ కలుగుతుంది. ఇంత మంచి సినిమా చేసే అవకాశాన్ని ఆయన నాకు ఇచ్చారు. ఆయన చాలా పెద్ద డైరెక్టర్. చిరంజీవిగారి కమ్‌బ్యాక్ ఫిలింను డైరెక్ట్ చేసిన ఆయన నాతో సినిమా చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు. ఆయనతో పని చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు, మెగాభిమానులకు ఈ సినిమా గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఒక ఆర్టిస్ట్‌కు కంఫర్ట్ జోన్‌ను క్రియేట్ చేసి..సినిమాను గ్రాండ్‌గా తెరకెక్కించడానికి వెనుకాడని సి.కల్యాణ్‌గారికి థాంక్స్. చమకు చమకు సాంగ్‌ను ఇళయరాజా, సీతారామశాస్త్రి చేతుల మీదుగా విడుదల చేశాం. మంచి సినిమా తీశామని నమ్మకంతో ముందుకెళున్నాం. నా స్నేహితుడు తమన్ ఎంతో మంచి మ్యూజిక్ ఇచ్చాడు. జానీ, శేఖర్‌లు నాతో డ్యాన్స్‌ను కుమ్మించేశారు. చిరంజీవిగారు స్థాపించిన ఈ సామ్రాజ్యంలో జెండా రెపరెపలనే నా గుండె చప్పుడులుగా భావించి కష్టపడుతుంటాను. ఎప్పటికీ ఇలాగే కష్టపడుతుంటాను. నాకు మెగాస్టార్, పవర్‌స్టార్, మెగాపవర్‌స్టార్, స్టైలిష్ స్టార్, వరుణ్ ఇలా అందరూ నాకు పంచభూతాలు. వరుణ్ సినిమా కూడా డెఫనెట్‌గా హిట్ అవుతుంది. ఫిబ్రవరి 10న తొలిప్రేమ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఒకేరోజు ఇద్దరు మెగా హీరోలు బాక్సాఫీస్ వద్దకు వచ్చి హిట్ కొడితే ఆ కిక్కే వేరు. ఆ రికార్డ్ మనం మిస్సయ్యాం. మెగాస్టార్ చిరంజీవిగారు, పవర్‌స్టార్‌పవన్‌కల్యాణ్‌గారు, సహజ నటుడు నాగబాబుగారు నాకు గురువులు. వారు లేకుండా ఈ స్టేజ్‌పై నేను లేను అన్నారు. సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ - మెగాఫ్యామిలీ అభిమానులకు థాంక్స్. పవన్‌కల్యాణ్‌గారికి ఓ రిక్వెస్ట్. ఆయన సినిమాలు చేయనని అన్నారు. కానీ ఆయన రాజకీయంగా ఎంత ఎదిగినా, ప్రజా సమస్యలపై ఎంత పోరాడినా.. సమయం దొరికినప్పుడల్లా సినిమాలు చేయండి. సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది. సినిమాను చూసిన వారందరూ సంతోషిస్తారు. మంచి కథను అందించిన ఆకుల శివ, సినిమాటగ్రాఫర్ విశ్వేశ్వర్, ఎడిటర్ గౌతంరాజుగారు, సంగీతం అందించిన తమన్, సాహిత్యం అందించిన రచయితలు సహా అందరికీ థాంక్స్. తేజుతో చమకు చమకు సాంగ్ చేసేటప్పుడు నాకు చిరంజీవిగారే గుర్తుకు వచ్చారు. అలాగే రెండు మూడు సన్నివేశాలు పవన్ కల్యాణ్‌లా తేజు కనపడేలా షూట్ చేశాను. ఎందుకంటే చిరంజీవిగారు, పవన్‌కల్యాణ్‌గారు కలిస్తే ఎలా ఉంటుందో అలా తేజు స్టైల్ ఉంటుంది. మెగా ఫ్యామిలీలో కష్టపడేతత్వం ఎలా ఉందో.. తేజులో ఆ తత్వం కనపడుతుంది. చిరంజీవిగారిలా తేజు అందరినీ కలుపుకు పోతుంటాడు. కాబట్టి తేజు కూడా అన్నయ్యంత, పవన్‌కల్యాణ్‌గారంత పెద్ద స్టార్ కావాలని కోరుకుంటున్నాను. మా అన్నయ్య కల్యాణ్ నన్ను గాజు బొమ్మలా చూసుకున్నారు. నన్నెంతో బాగా కేర్ తీసుకున్నారు. ఈ సినిమా ఇంత త్వరగా పూర్తి కావడానికి నిర్మాతలే కారణం. సి.కె.ఎంటర్‌టైన్మెంట్స్ వంద సినిమాలు పూర్తయ్యే వరకు నా జర్నీ వారితో ఉంటుంది. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పట్నుంచి పెద్ద డైరెక్టర్‌ని అవుతానని నమ్మినవారిలో సి.కల్యాణ్ అన్నయ్య ఒకరు. ఆయన రామానాయుడిగారిలా వంద సినిమాలు తీస్తారు. ఆ జర్నీలో నేను కూడా ఉంటాను. మాతో పాటు విడుదలవుతున్నతొలిప్రేమ, మోహన్‌బాబుగారి గాయత్రి సినిమాలు పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను అన్నారు.

సి.కె.ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత సి.కల్యాణ్ మాట్లాడుతూ - త్రివిక్రమరావుగారి నిర్మాణంలో ఇళయరాజాసంగీతంలో సీతారామశాస్త్రి రచించిన చమకు చమకు సాంగ్ ఎంత పెద్ద హిట్టో మనకు తెలిసిందే. ఇప్పుడు ఇంటిలిజెంట్ సినిమాలో మేం రీమేక్ చేశాం. ఈ చమకు చమకు సాంగ్ ఫ్యాన్స్‌కు పండగే అవుతుంది. మెగాస్టార్ చిరంజీవి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్, నాగబాబు మావయ్యల కలిసి మరో మెగాస్టార్ కావాలనుకున్నది ఈ సుప్రీమ్ స్టార్ సాయిధరమ్‌తేజ్. ఇప్పటి వరకు సాయిధరమ్ తేజ్ చేసిన సినిమాలు వేరు. ఈ సినిమా వేరు. డెఫనెట్‌గా ఈ సినిమా వేరు. మా సోదరుడు వినాయక్ సినిమాను ఇరగదీయించారు. పాటలు చూస్తుంటే చిరంజీవిగారి సాంగ్స్ చూస్తున్నట్లుంటుంది. ఫిబ్రవరి 9న ఓ పండుగ ఉంటే, ఫిబ్రవరి 10న వరుణ్ నటించిన తొలిప్రేమ మరో పండుగ అవుతుంది. తేజు ఎంతో సిన్సియర్‌గా ఈ సినిమా కోసం పనిచేశాడు. మా యూనిట్‌కు ఇంత మంచి సినిమా ఇచ్చిన వినాయక్‌గారికి థాంక్స్. ఫిబ్రవరి 9న ఈసినిమా కొత్త రికార్డులను క్రియేట్ చేస్తుంది. ఓ దర్శకుడు కారు దిగగానే ..సింహం,పులి, ఏనుగులాగంభీరంగా అనిపించే వారిలో మా గురువుగారు దాసరిగారుంటే.. తర్వాత అలా అనిపించే దర్శకుడు వినాయక్ మాత్రమే. లోపల ఎంత టెన్షన్ ఉన్నా బయటకు నవ్వుతూ పలకరిస్తుంటాడు. మా కాంబినేషన్‌లో ఫ్యూచర్‌లో ఇంకా రిపీటవుతుంది. ఎంటైర్ యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ అన్నారు.

పార్లమెంట్ సభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ - ప్రీ రిలీజ్ వేడుకనే కాదు, సక్సెస్ మీట్‌ను కూడా రాజమండ్రిలోనే జరుపుకోవాలని కోరుకుంటున్నాను. సాయిధరమ్ తేజ్ డాన్సులను అద్భుతంగా చేశాడు. 35 ఏళ్ల క్రితం నేను, చిరంజీవిగారు కలిసి మన వూరి పాండవులు సినిమాలో నటించాం. ఇప్పుడు సాయిధరమ్‌ను చూస్తుంటే చిరంజీవిగారే గుర్తుకు వస్తున్నారు. మామకు తగ్గ అల్లుడుగా సాయిధరమ్ నిరూపించుకుంటున్నాడు. రేపు మామను మించిన అల్లుడు కావాలని కోరుకుంటున్నాను. ఎన్నో హిట్స్ మీద హిట్స్ తీస్తున్న వినాయక్‌గారికి అభినందనలు. చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయికి ఎదిగిన కల్యాణ్ ఇప్పుడు పెద్ద నిర్మాతగా రాణిస్తున్నారు. మరో నాలుగేళ్లలో రామానాయుడుగారిని మించి సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ - సి.కె.ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌లో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది. కల్యాణ్‌గారు, వినాయక్‌గారు చాలా బాగా ట్రీట్‌చేశారు. సాయిధరమ్ తేజ్ సూపర్బ్‌గా యాక్ట్‌చేశాడు. సినిమాలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు థాంక్స్ అన్నారు.

ఎన్టీఆర్ బయోపిక్‌లో నదియా



స్వర్గీయ ఎన్టీఆర్ బయోపిక్‌ను నందమూరి బాలకృష్ణ తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఈ బయోపిక్‌లో ఆయన పుట్టుక నుండి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం వరకు ఉంటుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నందమూరి బాలకృష్ణ ఇందులో ఎన్టీఆర్ పాత్రధారిగా కనపడతారు. అప్పట్లో దేశమంతటా ఇందిరాగాంధీ హవా నడిచినా.. రాజకీయంగా తెలుగు రాష్ట్రంలో ఎన్టీఆర్ సత్తా చాటి కొత్త పార్టీని పెట్టి ప్రభంజనం సృష్టించారు. ఇప్పుడు ఎన్టీఆర్ బయోపిక్‌లో కూడా ఆమె పాత్ర కీలకంగా మారనుంది. ఆమె పాత్రను ఎవరు చేస్తారా అనే దానిపై యూనిట్ చాలా ఆలోచించింది. చివరకు నటి నదియాతో సంప్రదింపులు చేస్తున్నారట. అంతా ఓకే అయితే నదియా మాజీ దివంగత ప్రధాని ఇందిర పాత్రలో కనపడతారు.



'తొలిప్రేమ' ప్రీ రిలీజ్ వేడుక

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై నిర్మించిన చిత్రం తొలిప్రేమ. రాశి ఖన్నా హీరోయిన్‌గా నటించింది. యువ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ సినిమాను ఫిబ్రవరి 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్.కాలేజ్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరిగింది. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, ఎమ్మెల్యే రాధాకృష్ణ హీరో వరుణ్ తేజ్, రాశీ ఖన్నా, దర్శకుడు వెంకీ అట్లూరి, హైపర్ ఆది, డిస్ట్రిబ్యూటర్ ఎల్.వి.ఆర్, తణుకు డి.ఎస్.పి. ఎస్.ఆర్.కె.ఆర్.కాలేజ్ ప్రిన్సిపాల్ పార్థసారథి పాల్గొన్నారు.



దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ "కథను రాసింది, రిలీజ్ చేసేది దిల్‌రాజుగారైతే, సినిమాను నిర్మించింది మాత్రం బివిఎస్ఎన్.ప్రసాద్‌గారు. జీవితం ఓ సర్కిల్ అని వినే ఉంటాం. నా జీవితంలో అలాగే జరుగుతోంది. తొలిప్రేమ సినిమాను చేసినప్పుడు, చూసినప్పుడు ప్రేక్షకులకు ఓ ఫ్రెష్‌నెస్ ఎలా కలిగిందో.. అలాంటిఫ్రెష్‌నెస్‌తోనే ఈ సినిమాను మేం చేశాం. ఈ సినిమా టైటిల్ పెట్టినప్పుడు కాస్త భయపడ్డాం. టైటిల్ అయితే పెడుతున్నాం.. పరావాలేదు కదా! అన్నాడు వరుణ్. ఆ సినిమాతో నేను పోలిక పెట్టను కానీ.. గౌరవాన్ని కాపాడుతానని మాట ఇస్తున్నాను. సినిమా అంటే టీంఎఫర్ట్ అని ఎందుకంటారో నాకు ఇప్పుడు అర్థమవుతోంది. ప్రేక్షకులకు సినిమా బాగా నచ్చుతుంది" అన్నారు.

బివిఎస్ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ "33 సంవత్సరాల క్రితం మెగాస్టార్‌తో సినిమా తీయాలని తణుకు నుండి మద్రాస్ వెళ్లాను. తర్వాత బన్నితో ఆర్య 2. మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్‌తో మగధీర, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌తో అత్తారింటికి దారేది సినిమాలు చేసే అవకాశం దక్కింది. ఇప్పుడు మా మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్‌తో తొలిప్రేమ సినిమా చేశాం. గ్యారంటీగా సినిమా పెద్ద హిట్ అవుతుంది" అన్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ "భీమవరం ఊర్లో ఏముందో తెలియదు కానీ ఇక్కడ నుండి త్రివిక్రమ్, సునీల్ వంటివారు పక్కనున్న పాలకొల్లు నుండి చిరంజీవిగారు,కృష్ణంరాజుగారు, ప్రభాస్ వంటి ఎందరో తెలుగు సినిమాలోకి వచ్చారు. తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఓ పిల్లర్‌లా ఇక్కడి నుండి వచ్చినవారున్నారు. ఇక్కడ నీటిలోనే ఏదోఉంది. సినిమాకు కావాల్సిన కళ ఇక్కడ ఉంది. అదే మిమ్మల్ని, మమ్మల్ని ఇక్కడి వరకు తీసుకొచ్చింది. అప్పుడు 1998 తొలిప్రేమకు నేనే డిస్ట్రిబ్యూటర్‌ని, 2018 తొలిప్రేమకు నేనే డిస్ట్రిబ్యూటర్‌ని. ఆ తొలిప్రేమ యూత్ ఫిలిం ఎలా అయ్యిందో.. ఈ సినిమా కూడా 100 పర్సంట్ అలాంటి యూత్‌ఫిలిం అవుతుంది. రెండేళ్ల క్రితం వెంకీ నాకు చెప్పిన కథ ఇది. బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ. వరుణ్‌కు ఫిదా తర్వాత ఈ సినిమా రావడం ప్లస్ అవుతుంది. ఫిదా సినిమా రిలీజ్ అయిన తొలి ఆట నుండి అద్భుతం అని ఎలా అన్నారో.. ఇప్పుడు అలాగే అంటారు. వన్ ఆఫ్ ది బెస్ట్ లవ్‌స్టోరీ. వరుణ్, రాశీ ఖన్నా మధ్య బ్యూటీఫుల్ కెమిస్ట్రీ కుదిరింది. ఫిబ్రవరి 10న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతుంది. అయితే ఒకరోజు ముందుగానే ఈ సినిమా అమెరికాలో రిలీజ్ అవుతుంది. మెగాఫ్యాన్స్‌కి మంచి పండుగలాంటి సినిమా" అన్నారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ "మా సినిమాకు పనిచేసిన దర్శకుడు వెంకీ తొలి చిత్రమే అయినా ఎంతో బాగా చేశాడు. తను భవిష్యత్‌లో పెద్ద దర్శకుడవుతాడు. ఇక ఈ సినిమా అందరి కంటే ఎక్కువగా నమ్మింది నిర్మాత దిల్‌రాజుగారే. ఈ సినిమాకు ఓ సపోర్ట్‌గా నిలిచారు. ఇక బాపినీడు, ప్రసాద్‌గారు సినిమాను అద్భుతంగా నిర్మించారు. సినిమాటోగ్రఫీ జార్జ్ విలియమ్స్ ప్రతి సీన్‌ను ఎంతో అందంగా చూపించారు. తొలి ప్రేమ సినిమాకు ఇది రీమేకో, కాపీయో కాదు. కథకు తగ్గ టైటిల్ అనిపించే పెట్టాం. బాబాయ్ టైటిల్‌ను పాడు చేస్తానని ఎవరూ అనుకోవద్దు. ఫిబ్రవరి 10న సినిమా విడుదలవుతుంది. మా ఫ్యామిలీ నుండి తేజు సినిమా ఫిబ్రవరి 9న, నా సినిమా ఫిబ్రవరి 10న విడుదలవుతున్నాయి. మా మధ్య పోటీ ఏదీ లేదు. ఇద్దరం చిన్నప్పట్నుంచి కలిసే పెరిగాం. నా సినిమా ఎంత పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నానో, తేజు సినిమా కూడా అంతే సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను.



మోడీపై ప్రకాశ్‌రాజ్ మళ్లీ సెటైర్లు

బెంగళూరు : ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యంగా సినీ నటుడు ప్రకాశ్ రాజ్ మరోసారి విమర్శలు గుప్పించారు. ట్విట్టర్ వేదికగా సెటైర్లు వేశారు. ప్రామిస్ టూత్‌పేస్ట్‌ను అడ్డం పెట్టుకొని.. నిన్న బెంగళూరులో జరిగిన మోడీ ర్యాలీని అవహేళన చేశారు. 2014లో అమ్మిన ప్రామిస్ టూత్‌పేస్ట్ రైతులు, నిరుద్యోగుల మోముల్లో చిరునవ్వు తీసుకురాలేక పోయిం దని, మరి ఇప్పుడు మరోసారి అమ్మిన ప్రామిస్ టూత్‌పేస్ట్‌ను నమ్ముతారా అంటూ ప్రకాశ్‌రాజ్ ట్వీట్ చేశారు. త్వరలోనే ఎన్నికలకు వెళ్లబోతున్న కర్ణాటకలో మోడీ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సిద్ధరామయ్య ప్రభు త్వంపై విషం గక్కారు. అధికార కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడంతోపాటు కేంద్రంలో తమ ప్రభుత్వం సాధించిన ఘనతలను మోడీ చెప్పుకున్నారు. దీనిపైనే ప్రకాశ్‌రాజ్ సెటైర్ వేశాడు. జర్నలిస్ట్ గౌరీ లంకేష్ హత్య తర్వాత మోడీ ప్రభుత్వంపై ఆయన బహిరంగంగానే విమర్శలు ఎక్కుపెట్టారు. అవకాశం దొరికి నప్పుడల్లా విమర్శలు చేస్తున్నారు.



మార్చి1 నుంచి సినీ పరిశ్రమ బంద్

చెన్నై: డిజిటల్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మార్చి1 నుంచి చిత్ర పరిశ్రమ బంద్ చేపడుతున్నట్టు తమిళ నిర్మాతల మండలి ప్రకటించింది. ఈ నేపథ్యంలో షూటింగ్‌లు, సినిమాల విడుదలను నిలిపి వేయాలని నిర్ణయం తీసుకుంది. డిజిటల్ విధానానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం మండలి సభ్యులు ప్రకటించారు. డిజిటల్ ప్రొవైడర్ల విధానాల కారణంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు తీవ్రంగా నష్టపోతున్నారని వారు మండిపడ్డారు. కేవలం తమ లాభాలనే దృష్టిలో పెట్టుకుని తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు సినీపరిశ్రమలో అందరికీ నష్టాలను మిగులుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన చార్జీలు వసూలు చేయాలని దక్షిణాది ఫిల్మ్ ఛాంబర్స్ పలుసార్లు డిజిటల్ ప్రొవైడర్లను కోరినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో చిత్ర పరిశ్రమ బంద్‌కు పిలుపునిచ్చారు.

ఈవీఎంల అమ్మకంపై ఈసీ ఆంక్షలు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగ సంస్థలు రూపొందించిన రెండు ప్రత్యేక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం)ల అమ్మకాలపై ఆంక్షలు విధిస్తూ భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈసీఐ ఆదేశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్లు అభ్యంతరం తెలిపాయి. ఇటీవల రాష్ట్రాల ఎన్నికల కమిషనర్ల సమావేశ వివరాలు ఆర్‌టీఐ ద్వారా వెల్లడయ్యాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు, దాదాపు అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలపై సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 'ఈవీఎంల విశ్వసనీయత, వినియోగంపై రాజకీయ పార్టీలు, ఓటర్లలో గందరగోళం ఏర్పడుతుంది' అని పేర్కొంది. 'సాంకేతిక నిపుణుల కమిటీ, కమిషన్ ఈవీఎంల డిజైన్‌ను ఆమోదించింది. ఎవరికీ ఈవీఎంలను అమ్మకానికి ఉపయోగించరాదు. రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో సహా ఇతరులకు ఈవీఎంల అమ్మకానికి ప్రత్యేక రూపకల్పన చేయబడుతుందని ఆ ఆదేశాల్లో పేర్కొంది. మధ్యప్రదేశ్‌లో 2017, నవంబరు 8-9 తేదీల్లో జరిగిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల సమావేశంలో ఈ విషయాన్ని చర్చిం చారు. భోపాల్‌కు చెందిన సామాజిక కార్యకర్త అజయ్ దూబే దాఖలు చేసిన ఆర్‌టీఐ ప్రశ్న ఈ సమాధానం అందింది. భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల(ఎస్ఈసీలు) ఎన్నికల ప్రక్రియ ఒకటే. అందువల్ల, భారత ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (బీఈఎల్), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లు తమ అనుమతి లేకుండా ఎవరికీ ఈవీఎంలను అమ్మరాదంటూ భారత ఎన్నికల సంఘం ఎందుకు ఆదేశాలు జారీ చేసిందో అర్థంకావడం లేదు' అని ఆ సమావేశం అభిప్రాయపడింది.

చంద్రుడిపై ఇస్రో రోవర్

- మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రెడీ
- ఏప్రిల్‌లో ప్రయోగానికి సన్నాహాలు : ఇస్రో చైర్మన్ శివన్



బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో). అంతరిక్ష పరిశోధనలో ఇది ఇప్పటికే ఎన్నో మైలురాళ్లను అందుకున్నది. తాజాగా మరో చారిత్రాత్మక ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తున్నది. భారత్ తరపున తొలిసారి ఓ రోవర్‌ను చంద్రుడిపైకి పంపే ప్రతిష్టాత్మక చంద్రయాన్ -2 మిషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లో చేపట్టడానికి సన్నాహాలు చేస్తోంది. చంద్రుడిపై ఇస్రో పరిశోధనలు చేయడం ఇది తొలిసారి కాదు. 2008లోనూ శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-1ను చంద్రుని కక్ష్యలో విజయవంతంగా ఉంచగలిగింది. ఇది చంద్రునిపై నీటి జాడను కనుక్కొన్నది. ఇప్పుడు లాంచ్ చేయబోయే చంద్రయాన్-2ను చంద్రునిపై దించాలని ఇస్రో సంకల్పించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను ఇస్రో చైర్మన్ కె.శివన్ వెల్లడించారు. ఇప్పటికే చంద్రునిపై రోవర్‌ను దించడానికి రెండు ప్రదేశాలను పరిశీలించామని, గతంలో ఏ రోవర్ దిగని ప్రదేశంలో చంద్రయాన్-2ను దింపబోతున్నామని ఆయన తెలిపారు. ఏప్రిల్‌లో శ్రీహరికోట నుంచి చంద్రయాన్-2ను ప్రయోగించనున్నామని, అక్కడి నుంచి చంద్రుని కక్ష్యలోకి అది చేరడానికి ఒకటి నుంచి రెండు నెలల సమయం పడుతుందని శివన్ తెలిపారు. చంద్రయాన్-2ను లాంచ్ చేయడానికి జీఎస్ఎల్‌వీ ఎంకే 2ను వాడతామన్నారు. 'చంద్రుని ఉపరితలంపై 14 రోజులపాటు ఉండగలిగేలా రోవర్‌ను రూపొందించాం. ఇది చంద్రునిపై 150 నుంచి 200 కిలోమీటర్ల మేర నడుస్తుంది.

అక్కడి ఉపరితలంపై రసాయన విశ్లేషణ చేస్తుంది' అని శివన్ వెల్లడించారు. ఈ మిషన్ కోసం ఇస్రో మూడు మానవరహిత వాహనాలను రూపొందిస్తుంది. ఇందులో ఒకటి ఆర్బిటర్ క్రాఫ్ట్. ఇది చంద్రునిపై కొంత ఎత్తులో తిరుగుతూ ఉంటుంది. ఒక రోవర్, ఆ రోవర్‌ను చంద్రునిపై సురక్షితంగా దించేలా ఓ ల్యాండర్‌ను తయారు చేస్తున్నారు. ఆరు టైర్లున్న రోవర్ చంద్రునిపై ల్యాండవు తుంది. ఇది సెమీ అటానమస్ మోడ్‌లో ఉంటుంది. భూమి నుంచి ఇచ్చే కమాండ్స్ ఆధారంగా రోవర్ అటూ ఇటూ తిరుగుతుంది. చంద్రుని ఉపరితలానికి సంబంధించిన డేటాను సేకరించి భూమికి చేరవేస్తుంది. ఇస్రోలో దానికి సంబంధించిన విశ్లేషణ జరుగుతుంది. చంద్రయాన్-2 ఆర్బిటర్ ద్వారా ఈ డేటా అంతా భూమిని చేరుతుంది. చంద్రయాన్-2 బరువు మొత్తం 3290 కిలోలు. ఇందులో ఆర్బిటర్, ల్యాండర్, రోవర్ ఉంటాయి. చంద్రుని కక్ష్యకు వంద కిలోమీటర్ల దూరంలో ఆర్బిటర్ నుంచి ల్యాండర్ వేరవుతుంది. ఆ తర్వాత అది రోవర్‌ను చంద్రుని ఉపరితలంపై దించుతుంది.

చావుకు ముందు నాన్న మాతో మాట్లాడారు

కాల్పుల్లో చనిపోయిన జవాను పిల్లలు ఆవేదన



శ్రీనగర్: చనిపోయే ముందు తమ నాన్న ఫోన్ చేశారని, పరీక్షలు దగ్గరపడుతున్నందున బాగా చదువుకోమని చెప్పారని, అంతలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారని ఆదివారం కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరమరణం పొందిన హవల్దార్ రోషన్ అనే జవాను పిల్లల ఆవేదనతో చెప్పారు.
రాజౌరి సరిహద్దు ప్రాంతంలో నియంత్రణ రేఖ వెంబడి ఆదివారం సాయంత్రం పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో ముగ్గురు భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయపడ్డారు. చనిపోయిన జవాన్లలో హవల్దార్ రోషన్ లాల్ ఒకరు. పాక్ సైన్యం కాల్పులు జరపడానికి కొద్దిసేపటి

ముందు లాల్ ఇంటికి ఫోన్ చేసి పిల్లలతో మాట్లాడారు. లాల్‌ది జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని సాంబా జిల్లాలోని నిచ్లా గ్రామం. 1995లో ఆయన ఆర్మీలో చేరారు. లాల్ తండ్రి దేశ్‌రాజ్, భార్య ఆశాదేవి, ఇద్దరు పిల్లలు నిచ్లాలో నివసిస్తున్నారు. ఉదయం ఫోన్ చేసి బాగా చదువుకోమని చెప్పిన తండ్రి సాయంత్రానికల్లా అమరుడయ్యాడని తెలిసి ఆ పసి హృదయాలు విలవిల్లాడాయి. లాల్ బతికే ఉంటే పాక్ సైన్యాన్ని క్షణాల్లో మట్టుబెట్టి ఉండేవాడని ఆయన సోదరుడు దర్శన్ కుమార్ తెలిపారు. పాక్ కాల్పుల్లో అమరులైన భారత సైనికుల్లో కెప్టెన్ కపిల్ కుందు ఒకరు. మరో ఆరు రోజుల్లో ఆయన తన 23వ పుట్టినరోజు జరుపుకోవాల్సి ఉండగా పాక్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు. జనవరి 18 నుంచి 22 మధ్య నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం జరిపిన కాల్పుల కారణంగా దాదాపు 13 మంది ప్రాణాలు కోల్పోయారు.

నిత్యం రాజౌరి, పూంచ్, జమ్ము, సాంబా, కతువా జిల్లాల వెంబడి ఉన్న నియం త్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంట కాల్పుల మోత మోగుతూనే ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని దాదాపు 300 పాఠశాలలను గత నెలలో వారం రోజుల పాటు మూసివేసినట్లు అధికారులు తెలిపారు.

పాక్‌కు తగిన సమాధానం చెబుతాం

కాల్పుల విరమణ ఉల్లంఘనను ఖండించిన రాజ్‌నాథ్



న్యూఢిల్లీ : సరిహద్దు వెంబడి పాకిస్థాన్ కాల్పులు జరపడాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ఖండించారు. పాక్ జరిపిన కాల్పుల్లో ఒక కెప్టెన్‌తో సహా నలుగురు సైనికులు మరణించిన సంగతి తెలిసిందే. కాగా 'భారత సైనిక శౌర్యంపై పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. పొరుగు దేశానికి 'తగిన సమాధానం ఇస్తుంది' అని రాజ్‌నాథ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అంతకుముందు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్సరాజ్ హన్స్ మాట్లాడుతూ జమ్మూ, కాశ్మీర్‌లోని రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లో ఆదివారం పాకిస్థాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించడాన్ని ఖండించారు. త్వరలోనే పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించవల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. 'ఎల్‌వోసీ వెంబడి పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడింది. ఈ ఏడాది పెద్ద సంఖ్యలో కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు జరిగాయి' అని అన్నారు. 'నిన్న(ఆదివారం) కూడా కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడింది. పాకిస్థాన్ చర్యలను మేము క్షమించం' అని మంత్రి తెలిపారు. 'కాల్పుల విరమణ ఉల్లంఘన పాకిస్తాన్ అవివేకాన్ని నిరూపిస్తోంది. దానికి తగిన మూల్యం చెల్లించకతప్పదు' అని అన్నారు. మరో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా పాకిస్థాన్ వైఖరిని విమర్శించారు. 'భారత సైన్యంపై విశ్వాసం కలిగి ఉన్నాం. సరైన సమయంలో తగిన సమాధానం చెబుతుంది' అని చెప్పారు. 2016 సర్జికల్ దాడులను ప్రస్తావిస్తూ, సర్జికల్ దాడులు చేపట్టినపుడు మీడియాకు తెలియలేదు. అదే విధంగా సరైన సమయంలో చర్యలు ఉంటాయన్నారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా భారత్ నడుస్తుందన్నారు. ఆదివారం రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో ఫిబ్రవరి 10న 23వ జన్మదినం జరుపుకోనున్న హర్యానాకు చెందిన కెప్టెన్ కపిల్ కుందు మరణించారు. ఆయనకు తల్లి సునీత ఉన్నారు. కాగా జమ్మూ, కాశ్మీర్‌లోని సాంబాకు చెందిన హవాల్దార్ రోషన్‌లాల్(43), కతువాకు చెందిన శుభంసింగ్(23)లతోపాటు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన బరకా గ్రామస్తుడు రైఫిల్‌మెన్ రామావతార్(27) మరణించిన సైనికులలో ఉన్నారు.

పకోడీలు అమ్ముకుంటే తప్పేంటి..?

కాంగ్రెస్‌ను ప్రశ్నించిన అమిత్‌షా



న్యూఢిల్లీ : జీఎస్‌టీని విమర్శిస్తూ, నిరుద్యోగం, ఇతర సమస్యల పరిష్కారంలో వైఫల్యాలను ఎత్తిచూపిన కాంగ్రెస్‌పై బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా విమర్శలు చేశారు. సోమవారం రాజ్యసభలో ఆయన తొలిసారి మాట్లాడుతూ వేర్వేరు రంగాలలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో 'పకోడా'పై కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పకోడీలు అమ్ముకుంటే తప్పేంటని అమిత్‌షా ప్రశ్నించారు. రోడ్డుపై ఎవరైనా పకోడీలు అమ్ముకుని రూ.200 సంపాదిస్తే, దానినే ఉద్యోగంగా భావించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో దుమారం రేగడం, కాంగ్రెస్ సైతం విమర్శలు గుప్పించడంపై అమిత్‌షా రాజ్యసభలో స్పందించారు. కాంగ్రెస్ పకోడా రాజకీయాలు చేస్తోందన్నారు. 'పకోడాలు అమ్ముకోవడం స్వయం ఉపాధి. వారిని మీరు అడ్డుక్కునే వాళ్లతో పోల్చుతున్నారా' అని ప్రశ్నించారు. ఒక ఛాయ్‌వాలా కొడుకు నేడు ప్రధాని అయ్యారని' తెలిపారు. అమిత్ షా గంటకు పైగా ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగం ఉందని అంగీకరిస్తూ, అదొక సమస్య అని అన్నారు. కానీ కాంగ్రెస్ దేశాన్ని అనేక ఏళ్లు పరిపాలించిందని, తాము(వాజ్‌పేయి హయాంతో సహా) ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్నామన్నారు. జీఎస్‌టీ ఓ చక్కటి ఆర్థిక సంస్కరణ అని, జీఎస్‌టీకి కాంగ్రెస్ వ్యతిరేకమని చెప్పారు. దీనిని గబ్బర్ సింగ్ టాక్స్ అంటూ కొందరు ఎద్దేవా చేయడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. పన్నులతో వచ్చిన సొమ్ములతో ఉచితంగా గ్యాస్, కరెంట్ వంటివి ఇచ్చామని, సైనికులకు ఉపయోగించామని, రైతులకు వెచ్చిస్తున్నామని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక 31 కోట్ల జన్‌ధన్ ఖాతాలు తెరిపించామన్నారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రాయితీలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలనే మోడీ ప్రభుత్వం తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

పాక్ జాతీయుడికి ఆధార్ కార్డు!

న్యూఢిల్లీ : యూఐడీఏ నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. ఓ పాకిస్థానీ ఆధార్ కార్డుతో పట్టుబడటం కలకలం రేపింది. భారత పౌరసత్వం లేకపోయినా ఆధార్ కార్డు ఎలా జారీ చేశారన్న అంశంపై పోలీసులు ఇప్పుడు ఆరా తీస్తున్నారు. పాకిస్తాన్‌కు చెందిన పుర్ణారామ్ 2000 సంవత్సరంలో పాక్ నుంచి రాజస్థాన్‌కు వచ్చి స్థిరపడ్డాడు. కూలీ పనులు చేసుకునే రామ్.. భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ క్రమంలో గత నెలలో జైసల్మేర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వద్ద అతను తచ్చాడుతుండగా భద్రతా సిబ్బంది గమనించారు. అనుమానంతో అతని బ్యాగ్ తనిఖీ చేయగా వారికి అందులో పాకిస్థాన్ పాస్‌పోర్టు, ఆధార్ కార్డు దర్శనమిచ్చాయి. వెంటనే అప్రమత్తమై అతన్ని అరెస్ట్ చేశారు. పోలీసులతోపాటు పలు భద్రతా ఏజెన్సీలు అతన్ని సుదీర్ఘంగా ప్రశ్నించాయి. విచారణలో ఎలాంటి విషయాలు వెలుగు చూడకపోవటంతో చివరకు అతన్ని వదిలేశారు. అయినప్పటికీ పౌరసత్వం లేకపోయినా ఆధార్ కార్డును కలిగి ఉండటంతో అతనిపై విజయ్‌నగర్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. రామ్‌కు ఆధార్ కార్డు ఎలా మంజూరు అయ్యింది? అన్న విషయంపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. జాతీయత, వ్యక్తిగత వివరాలు తదితర అంశాలను తగిన పత్రాలతో ధృవీకరించుకున్నాకే ఆధార్ కార్డును యూఐడీఏ మంజూరు చేయాల్సి ఉంటుంది.

దమ్ముంటే నిరూపించండి

మోడీకి సిద్ధరామయ్య సవాల్



బెంగళూరు : ప్రధాని నరేంద్ర మోడీపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విరుచుకుపడ్డారు. తన ప్రభుత్వంపై చేసిన అవినీతి ఆరోపణలను నిరూపించాలని ప్రధానికి సిద్ధరామయ్య సవాల్ విసిరారు. పరివర్తన యాత్ర ముగింపు సభలో మోడీ ప్రసంగిస్తూ సిద్ధరామయ్య ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని విమర్శలపై సోమవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించిన సిద్ధరామయ్య... మోడీపై మండిపడ్డారు. మోడీ బాధ్యతారాహిత్య ప్రకటనలు చేశారని సీఎం ఎదురుదాడి చేశారు.

తాము అధికారంలోకి వచ్చినప్పుడు పెట్టుబడుల విషయంలో కర్నాటక దేశంలో 11వ స్థానంలో ఉందని, రెండేళ్లుగా ఆ జాబితాలో తాము మొదటి స్థానంలో కొనసాగుతున్నామని గుర్తుచేశారు. ఇది తాము చెబుతున్నది కాదదని, కేంద్ర ప్రభుత్వ గణాంకాలే సూచిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు అవినీతి ఆరోపణల ప్రస్తావన ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు. గుజ రాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో లోకా యుక్తను నియమించక పోవటంతోనే అవినీతిపై మోడీ పోరాటం ఏపాటి దో స్పష్టమైపోతోందని సిద్ధ రామయ్య హేళన చేశారు. ఇక యడ్యూ రప్ప లాంటి వారిని పక్కన పెట్టుకుని తమపై ప్రధాని అవినీతి ఆరోపణలు చేయటం హాస్యాస్పదమని చెప్పారు. తమ ప్రభుత్వంపై ఆరోపణ లు చేసే ముందు వారి గురించి కాస్త ఆలోచించుకోండి. గోద్రా ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు? సుమారు 2000 మందికి పైగా కదా! ఇప్పుడు హర్యానాలో శాంతి భద్రతల పరిస్థితి ఎలా ఉంది? బీజేపీ అధికారంలో ఉంటే మైనార్టీలకు రక్షణే ఉండదు. అలాంటి వాళ్లు తమపై విమర్శలు చేస్తున్నారని సిద్ధరామయ్య తెలిపారు.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం : గవర్నర్

బెంగళూరు : రాష్ట్రంలో శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం స్పష్టం చేశారు. రాష్ట్రంలో హిందువులు, బీజేపీ శ్రేణులను హతమార్చుతున్నారన్న ప్రతిపక్ష ఆరో పణలకు ఆయన పై విధంగా స్పందించారు. శాంతి భద్రతల కోసం కఠిన చర్యలు తీసుకున్నామని కర్ణాటక గవర్నర్ వజుభాయ్ వాల శాసనసభ ఉమ్మడి సమావేశం లో వెల్లడించారు. రాష్ట్రంలో చెదరుమదరు జరుగుతున్న హింసా ఘటనలపై ఉక్కుపాదం పెట్టా మన్నారు. సిద్ధ రామయ్య జిహాదీల పట్ల మెతక వైఖరి అనుసరిస్తు న్నారని, వారంతా హిందువులు, సంఘ పరివార్ కార్యకర్తలను హత్య చేస్తున్నారన్న ప్రతిపక్ష వాదనను కొట్టి పారేశారు. ఆదివారం ప్రధాని మోడీ బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి తాండవిస్తోందని, 10 శాతం కమీషన్ ప్రభుత్వమని ఎద్దేవా చేస్తూ, నేరస్తుల పరిపాలనలో హత్యలు చేయడం సులభమైపోయిందని విమర్శించారు. దీనిపై స్పందించిన గవర్నర్ కర్ణాటక ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తోందని, పారదర్శకత పెంచేందుకు ఇ- గవర్నెన్స్ ను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రజాసేవలో అవినీతిని అరికట్టేందుకు అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) సమర్థ వంతంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 404 కేసులు నమోదు చేశామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏసీబీ అనేక కార్యక్రమా లు చేపట్టిందన్నారు. ఐదేళ్లలో ఆర్థిక ప్రగతి, సామాజిక న్యాయం, సంక్షేమం అన్ని వర్గాలకు అందేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, ఇకపై ఆకలిలేని కర్ణాటక కోసం కృషి చేస్తున్నామన్నారు. గతేడాది జూలై 1 నుంచి అమలు చేసిన జీఎస్టీ అమలుకు అన్ని చర్యలు చేపట్టామని, జీఎస్టీలో తరచూ మార్పులు చేపట్టడంతో పన్ను చెల్లింపుదారులు అవస్థలు పడుతున్నా రని, దీంతో పన్ను వసూళ్లలో హెచ్చుతగ్గులు వస్తున్నా యన్నారు. పన్నుచెల్లింపుదారుల కోసం న్యాయ సలహా అందించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. కావేరీ, కృష్ణ జలాలపై, గోవాలోని మహదాయి బేసిన్‌పై కన్నడ వాసులకు ఉన్న హక్కు కోసం పోరాడతామని గవర్నర్ వజుభాయ్ వాల వెల్లడించారు.

బీజేపీపై మధ్యతరగతి వర్గం విముఖత : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : బీజేపీపై మధ్యతరగతి విముఖతతో ఉందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం ట్వీట్ చేశారు. 2014లో బీజేపీ 282 స్థానాలను గెలుచుకుందని అయితే ఈసారి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 215 స్థానాలు కూడా గెలుచుకోలేదని పేర్కొన్నారు. నిరుద్యోగం ప్రధాన సమస్యగా మారిందని, దీంతో యువత బెంబేలెత్తుతోందని తెలిపారు. మధ్యతరగతి వర్గంలో బీజేపీపై తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు.

నాణెం మింగి చిన్నారి మృతి

నాసిక్ : మహారాష్ట్ర నాసిక్‌లోని చందిగిరిలో ప్రమాదవశాత్తూ నాలుగేళ్ల బాలిక పది రూపాయల నాణెంను మింగడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. షాలిని హండేజ్ అనే చిన్నారి తన తల్లిని తినడానికి ఏమైనా ఇవ్వమని కోరడంతో, దగ్గరలోని దుకాణంలో కొని తెచ్చుకోమని పది రూపాయల నాణేంను ఇచ్చిందని తెలిపారు. అయితే చిన్నారి ఆ నాణెంతో ఆడుకుంటూ, ప్రమాదవశాత్తూ మింగిందని, వెంటనే ఆమె తల్లిదండ్రులు చిన్నారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినప్పటికీ మృతిచెందినట్టు తెలిపారు.

స్మగ్లింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే కుమారుడి అరెస్ట్

కోల్‌కతా : బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న మణిపూర్ మాజీ ఎమ్మెల్యే కుమారుడిని అరెస్టు చేసినట్టు డీఆర్ఐ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మిజోరాం ఐజ్వాల్‌లోని త్వైరియల్‌లో నివాసముంటున్న ఆయన ఉత్తర కోల్‌కతాలో గది అద్దెకు తీసుకొని ఉంటున్నాడని తెలిపారు. మయన్మార్ నుంచి రూ 2.16 కోట్లు విలువైన 6.64 కిలోల బంగారాన్ని తరలిస్తుండగా కోల్‌కతాలోని బుర్రా బజార్‌లో అదుపులోకి తీసుకొని, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

సీబీఐ కస్టడీకి ఇంద్రాణి ముఖర్జియా

న్యూఢిల్లీ : షీనా బోరా హత్యకేసులో ప్రధాన నిందితురాలు ఇంద్రాణి ముఖర్జియాను ప్రత్యేక కోర్టు రెండు రోజులు సీబీఐ కస్టడీకి తరలించింది. ఐఎన్ఎక్స్ మీడియాకు సంబంధించిన కేసు విచారణ కోసం తమ కస్టడీకి తరలించాలని సీబీఐ కోరడంతో ప్రత్యేక సీబీఐ జడ్జి సునీల్ రానా అందుకు అనుమతిచ్చారు. కాగా ఈ నెల 13న ముంబై కోర్టులో ఇంద్రాణీని హాజరుపరచాల్సి ఉందని ముంబై పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ కేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కుమారుడు కార్తి కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు.

అన్నాడీఎంకే కార్డుదారులకే సంక్షేమ ఫలాలు !

మధురై : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అన్నాడీఎంకే కార్డుదారులకు మాత్రమేనని తమిళనాడు మంత్రి సెల్లూర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆదివారం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ కార్డును కలిగి ఉండాలని,ఈ కార్డును పొందిన వ్యక్తి, వారి కుటుంబసభ్యులు సంక్షేమ ఫలాలు పొందుతారని చెప్పారు. కాగా సమాజంలోని సామాన్య, పేద ప్రజలందరూ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులేనని డిప్యూటీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం తెలిపారు.

ప్రజలను వెర్రి వాళ్లను చేస్తున్న ఎంపీ

ధర్మశాల : హమీర్‌పూర్‌కు రైలు మార్గంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకుర్ ప్రజలను వెర్రివాళ్లను చేస్తున్నారని సుజనాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేందర్ రాణా ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉనా-హమీపూర్ రైలు మార్గాన్ని ఏర్పాటుచేస్తామని ఎంపీ చెప్పుకొస్తున్నారు గానీ, ఇంతవరకూ ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. బీజేపీ నాయకుడు ప్రేమ్‌కుమార్ ధుమాల్ కుమారుడు ఠాకుర్.

'డేటా ఎనలటిక్స్' చైర్మన్‌గా ప్రవీణ్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ కంప్యూటర్ సెల్‌కు డేటా అనలటిక్స్ విభాగంగా ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేరు మార్చారు. అలాగే ఈ విభాగానికి చైర్మన్‌గా ప్రవీణ్ చక్రవర్తిని నియామకం చేసినట్టు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రవీణ్‌కు ముందు కంప్యూటర్ సెల్‌కు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన విశ్వజిత్ సింగ్ గత ఏడాది మరణించాడు. ఇటీవల రాహుల్ పార్టీలోని వివిధ విభాగాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆ క్రమంలో కొన్ని విభాగాల్లో నూతన నియామకాలు జరిగాయి.

రేపు ఒడిశాకు నేపాల్ రాజు

భువనేశ్వర్ : నేపాల్ రాజు జ్ఞానేంద్ర బిర్ బిక్రంషాదేవ్ ఈ నెల 7వ తేదీ నుంచి ఆరు రోజులపాటు ఒడిశాలో పర్యటిస్తారని అధికారవర్గాలు తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం బిక్రంషాదేవ్ పూరీలోని జగన్నాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, జట్నీలోని రాతిపూర్ సమీపంలో 'మిషన్ కౌ' గోశాలను ప్రారంభిస్తారని, 8న లింగరాజ్ ఆలయాన్ని, మధ్యాహ్నం సకిగోపాల్ ఆలయాన్ని సందర్శిస్తారని, 9, 10 తేదీల్లో జగద్గురు పూరీ శంకరాచార్య పట్టాభిషేకం జూబ్లీ సిల్వర్ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపాయి.

'కాస్‌గంజ్' షూటర్ అరెస్ట్

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో ఇటీవల గణతంత్ర దినోత్సవంలో కాల్పులకు పాల్పడిన నిందితుడు తస్వీర్, ఆయన అనుచరుడిని ఢిల్లీలో సోమవారం ఉదయం అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. కొద్దిసేపు పోలీసులకు వారికి మధ్య కాల్పులు జరిగాయని, అనంతరం వారిని అరెస్టు చేసినట్టు తెలిపారు. యూపీలో 'చైను' గ్యాంగ్ సభ్యుడైన తస్వీర్ అలియాస్ మున్నావార్‌కు ఢిల్లీలో జంట హత్యల కేసు, పోలీసును కాల్చి చంపిన కేసులతోపాటు పలు కేసులతో సంబంధం ఉంది. ఆయనపై రూ.70 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు.

రాహుల్‌ను కలిసిన రాజస్థాన్ 'విజేతలు'

న్యూఢిల్లీ : రాజస్థాన్ ఉపఎన్నికల్లో గెలుపొంది నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే, ఎంపీలు సోమవారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీలను మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఆ పార్టీ సీనియర్ నాయకుడు తెలిపారు. అల్వార్, అజ్మీర్ పార్లమెంట్ నియోజకవర్గాలను గెలుచుకున్న కరన్‌సింగ్ యాదవ్, రఘుశర్మలు సోమవారం ప్రమాణస్వీకారం చేశారని తెలిపారు. వీరితోపాటు మండలఘర్ శాసనసభ స్థానం దక్కించుకున్న వివేక్ ధకాడ్, రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ సచిన్‌పైలట్,సీపీ జోషిలతోపాటు ఇతర నాయకులతో వచ్చి రాహుల్‌గాంధీని కలిసినట్టు తెలిపారు.

ఎన్‌పీపీలో ఎన్‌సీ విలీనం

దిమాపూర్ : ఈ నెల 27న నాగాలాండ్‌లో శాసనసభ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)లో నాగాలాండ్ కాంగ్రెస్ (ఎన్‌సీ) పార్టీ సోమవారం విలీనమయ్యింది. ఎన్‌పీపీ మాత్రమే ఈ ప్రాంత ప్రజల అవసరాలను చూడగలదని, కాబట్టి ఆ పార్టీలో విలీనం కావాలని తాము నిర్ణయించుకున్నట్టు ఎన్‌సీ అధ్యక్షుడు నిల్లో రెంగ్మా మీడియాతో సోమవారం తెలిపారు. ఎన్‌పీపీ వ్యవస్థాపకుడు పీఏ సంగ్మా ఎన్‌సీ విలీన కార్యక్రమంలో పాల్గొన్నారు.

లాలూను కలిసిన శరద్‌యాదవ్, బాబూలాల్ మరాండి

పాట్నా : రాంచీలోని జైల్లో ఉన్న రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌ను జనతాదళ్ (యునైటెడ్) మాజీ అధ్యక్షుడు శరద్‌యాదవ్ సోమవారం ఉదయం కలిశారు. జార్ఖండ్ వికాస్ మోర్చా (ప్రజాతంత్రిక్) నాయకులు బాబూలాల్ మరాండి, ప్రదీప్ యాదవ్‌లు కూడా జైలుకు వెళ్లి ఆయన్ని కలిశారు. ప్రస్తుత దేశ రాజకీయలపై వారు చర్చించుకున్నట్టు సమాచారం. దాణా కేసుల్లో లాలూ ప్రస్తుతం జైలుశిక్ష అనుభవిస్తున్నారు.

తాజ్‌మహల్ ఇక తేజ్ మందిర్ అట

న్యూఢిల్లీ : తాజ్‌మహల్ త్వరలో తేజ్‌మందిరం అవుతుందంటూ బీజేపీ ఎంపీ వినయ్ కతియార్ సోమవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆగ్రాలో నిర్వహించనున్న 'తాజ్ మహోత్సవం' పై అడిగిన ప్రశ్నకు ఆయన మీడియాకు ఈ విధంగా బదులిచ్చారు. తాజ్ మహోత్సవం గాని తేజ్ మహోత్సవం అని గాని రెండూ ఒకటే అనీ, ఏదైనా పిలవవచ్చు, తాజ్‌కు, తేజ్‌కు మధ్య తేడా ఏమీ లేదని అన్నారు. తేజ్ మందిరాన్ని ఆక్రమించుకుని మొఘల్ చక్రవర్తి దాన్ని సమాధిగా మార్చారని పేర్కొన్నారు.



వీర్రాజు ఇల్లు ముట్టడిలో ఉద్రిక్తత

బీసీ విద్యార్థి సంఘ నేతలను అడ్డుకున్న పోలీసులు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం సిటీ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు మరుకుర్తి దుర్గా యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఇంటి ముట్టడి ఉద్రిక్తతలకు దారితీసింది. సోము ఇల్లు ముట్టడిస్తామని ముందే ప్రకటించడంతో అడ్డుకోవడానికి బీజేపీ కార్యకర్తలు ముందస్తుగా పెద్దసంఖ్యలో సోము ఇంటికి చేరుకున్నారు. దుర్గాయాదవ్ బృందం సోము ఇంటి వైపు వస్తుండగా బీజేపీ కార్యకర్తలు వారిపై రాళ్ళు రువ్వడంతో గందరగోళం నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు రెండు వర్గాల వారిని అడ్డుకున్నారు. ఆ ప్రాంతం నుంచి చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. దుర్గాయాదవ్ బృందం సోము ఇంటికి రాకముందే పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు.



రెండు కుటుంబాల మధ్య కొట్లాట

విశాలాంధ్ర-గురజాల : గుంటూరు జిల్లా గురజాల మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి రెండు కుటుంబాల మధ్య స్వల్ప వివాదం హత్యలకు దారితీశాయి. ఓ కుటుంబం కత్తులతో దాడికి తెగబడటంతో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన పొలు చెన్నారెడ్డికి చెందిన గేదె విషయంలో మూడు రోజులుగా కొంగటి నాగిరెడ్డితో వివాదం కొనసాగుతుంది. ఈ విషయంలో ఆదివారం రాత్రి గేదెపై నాగిరెడ్డి దాడి చేశాడు. దీంతో నాగిరెడ్డి ప్రశ్నించేందుకు చెన్నారెడ్డి తన బావమరుదులు శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డిని తీసుకుని వెళ్లాడు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి కుమారులు శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డితోపాటు అతని భార్య మూకుమ్మడిగా చెన్నారెడ్డి పై నాటు కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరెడ్డిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. అతని తమ్ముడు పుల్లారెడ్డి తలకు బలమైన గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయింది. చెన్నారెడ్డి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్, పట్టణ సీఐ రామారావు ఘటనా స్థలిని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

జనసేనలోకి పిరియా సాయిరాజ్ !



విశాలాంధ్ర-సోంపేట : మాజీ శాసన సభ్యులు, ఉద్దానం ఫౌండేషన్ వ్యవస్థాపకులు పిరియా సాయిరాజ్ త్వరలో జనసేన పార్టీలో చేరనున్నట్టు తెలుస్తోంది. ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో చర్చలు కూడా జరిగినట్లు సమాచారం. కొంత కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న సాయిరాజ్‌కు స్వయంగా పవన్‌కళ్యాణ్ నుంచి పిలుపు రావడంతో ఇద్దరూ కలిసి అనేక విషయాలు చర్చించినట్లు తెలిసింది. హైదరాబాద్ నుంచి సోమవారం కవిటి మండలం బల్లిపుట్టుగలోని స్వగృహానికి చేరుకున్న సాయిరాజ్ తన అభిమానులు, అనుచరులతో సంప్రదింపులు చేస్తున్నారు. పార్టీలో చేరిక ముహూర్తం ఇంకా ఖరారు కాలేదని భోగట్టా. కొద్ది నెలల క్రితం వైసీపీ నుంచి సస్పెండ్ అయిన సాయిరాజ్ రాజకీయాలపై అసంతృప్తితో ఉంటున్నారు. ఉద్దానం ఫౌండేషన్ ద్వారా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభించి అందరి దృష్టి తన వైపు తిప్పుకున్నారు. గతం నుంచి కొన్ని గ్రామాల్లో శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేసి కిడ్నీ బాధిత ప్రాంతాలకు మినరల్ వాటర్ అందిస్తున్న విషయం తెల్సిందే. 2009 ఎన్నికల్లో టీడీపీ నేత, అప్పటి ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు పిలుపుతో ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా గెలుపొంది అందర్నీ ఆశ్చర్యపర్చారు. మూడేళ్లు కూడా పూర్తి కాక ముందే పార్టీలో వివాదాలతో వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014 ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ దక్కకపోయినా నర్తు రామారావు తరపున పని చేశారు. ఇచ్ఛాపురంలో పార్టీ అభ్యర్థి ఓడిన తర్వాత ఒక వైపు రామారావుకు, మరోవైపు సాయిరాజ్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జులుగా నియమించి గందరగోళంలోకి నెట్టింది. ఈ క్రమంలో 2019 ఎన్నికల్లోనూ టిక్కెట్‌పై పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టత ఇవ్వకపోవడం, పార్టీలో సరైన గుర్తింపు లేదంటూ మీడియా ఎదుట ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సాయిరాజ్‌ను వైసీపీ నుంచి బహిష్కరించారు. ఏడాది నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యాపారం, సామాజిక సేవలో కొనసాగుతున్నారు. స్థానికుల అభిప్రాయ సేకరణ తర్వాత జనసేన పార్టీలో చేరే అంశంపై నిర్ణయం తీసుకుంటానని పిరియా సాయిరాజ్ వ్యాఖ్యానించారు.

బడ్జెట్, ప్రత్యేక హోదాపై రేపు విజయవాడలో రాష్ట్ర సదస్సు



విశాలాంధ్ర-గుంటూరు సిటీ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం, ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరి నాయుడు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారన్నారు. గుంటూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర నాయకులు బాబురావు, సీపీఐ మంగళగిరి ఏరియా సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు మల్లాది విష్ణు, పార్థసారథి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలనుకొండ శివాజీ, ఆకుల శ్రీనివాసకుమార్, నిరుద్యోగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మరివేముల శ్రీనివాస్, నాన్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వి.ప్రసాద్ తదితరులు రానున్నారన్నారు. ఈ నెల 8వ తేదీన వామపక్ష పార్టీలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు నాన్ పొలిటికల్ జేఏసీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రాని జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించేందుకు రాష్ట్ర బంద్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పుంజుకుంటున్న మిర్చి ధరలు

- గత ఏడాది క్వింటా రూ.5,000
- ప్రస్తుత ధర రూ.10,000
- మిర్చి రైతుల్లో ఆనందం



విశాలాంధ్ర - నందిగామ : మార్కెట్‌లో మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గుంటూరు మార్కెట్‌లో తేజా రకం అనూహ్యంగా క్వింటా ధర రూ.15 వేలకు చేరింది. కృష్ణాజిల్లా నందిగామ యార్డులో రూ. 10 వేలకు మించి ధర పలుకుతుంది. గత ఏడాది ఇబ్బందుల దృష్ట్యా ఈ ఏడాది మిర్చి పంట సాగు గణనీయంగా తగ్గిపోవడం ధరల పెరుగుదలకు కారణమని చెబుతున్నారు. సకాలంలో నీటి తడులు అందకపోవడం, వైరస్ తెగుళ్ల దెబ్బకు దిగుబడులు తగ్గుతున్న నేపథ్యంలో మార్కెట్‌లో ధరలు పుంజుకోవటం రైతులకు కొంత ఊరటనిస్తోంది. గత ఏడాది మార్చిలో మిర్చి మార్కెట్ సంక్షోభంలో చిక్కుకుంది. ఎట్టకేలకు ప్రభుత్వం రంగంలోకి దిగినా నాణ్యమైన తేజా రకం ధర రూ.5 వేలు పలకటం గగనమయ్యింది. మిగతా రకాలు రూ.2 వేలు, రూ.3 వేలకు మించలేదు. తాలుకాయలు అయితే వందల రూపాయలు దాటలేదు. కోత కూలి కూడా రాని దుస్థితి నెలకొనడంతో కొందరు రైతులు కాయలు కోయకుండానే పొలాల్లో వదిలేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి మార్కెట్ కుప్పకూలటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎక్కువ శాతం మంది అప్పులు ఇచ్చిన వారి వత్తిళ్ల తట్టుకోలేక తక్కువ ధరకు తెగనమ్ముకున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.1,500 వంతున నగదు అందజేసింది. ఆర్థిక వెలుసుబాటు కలిగిన రైతులు తక్కువ ధరకు మిర్చి అమ్మకుండా అప్పట్లో నిల్వ చేయడంతో పశ్చిమ కృష్ణా ప్రాంతంలోని 16 శీతల గిడ్డంగులు నిండిపోయాయి.

ఈ ఏడాది తగ్గిన సాగు విస్తీర్ణం

ఈ ఏడాది మిర్చిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. గత ఏడాది కృష్ణాజిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో 25 వేల ఎకరాలకు పైగా సాగుచేశారు. ఈ ఏడాది 15 వేల ఎకరాలకు పడిపోయింది. మిర్చి సాగు కోసం ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరం పొలం కౌలు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంది. వ్యవసాయ బోర్లున్న పొలాలు అయితే మరింత డిమాండ్. విత్తనాలు, వ్యవసాయం, ఎరువులు, పురుగుమందులు ఇలా ఇతర ఖర్చులు కలిపి రూ. 75 వేల వరకు అవుతుంది. కోత కూలి అదనం.

పడిపోయిన దిగుబడులు

కృష్ణా పశ్చిమ ప్రాంతంలో కొద్దిరోజుల నుంచి మిర్చి కోతలు ప్రారంభమయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది తెగుళ్లతో 2016వ సంవత్సరంలో క్వింటా మిర్చి ధర రూ.12,000లకు పైగా పలికింది. 2017లో మిర్చి సంక్షోభంలో చిక్కుకోవడంతో క్వింటా రూ. 5000 పలకడం కష్టమైంది. ఈ ఏడాది గుంటూరు యార్డులో తేజా రకం రూ.15,000, నందిగామ యార్డుల్లో రూ.10000లకుపైనా ధర ఉంది. నాటు, హైబ్రీడ్ రకాలు సైతం రూ. 8,000లకు పైగా ధర లభిస్తుంది. శీతల గిడ్డంగుల్లో నిల్వచేసిన కాయలుకన్నా ప్రస్తుత కాయలకు రూ.1000లకు పైగా అదనపు ధర వస్తుంది.



నిధి దొరికే వరకు కోటలో తవ్వకాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని చెన్నంపల్లి కోటలో గుప్త నిధుల జాడ దొరికే వరకు తవ్వకాలు కొనసాగిస్తామని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం డిసెంబర్ నెల 13వ తేదీన కోటలో తవ్వకాలు చేపట్టిన ప్రభుత్వం జియాలజికల్ అధికారులతో పలుమార్లు సర్వే నిర్వహించింది. ఆదివారం ఆనాడు రాజులు యుద్ధంలో వినియోగించిన ఫిరంగు గుండ్లు ఎనిమిది లభ్యమయ్యాయి. సోమవారం తవ్వకాలు కొనసాగాయి.

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చనందుకు నిరసనగా

విశాఖ హార్బర్ బంద్

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన బోట్లు
- స్తంభించిన రూ.5 కోట్ల లావాదేవీలు
- రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని నేతల ఆగ్రహం



విశాలాంధ్ర- విశాఖపట్నం : మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన నాటి టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి నాలుగేళ్లు అవుతున్నా పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మత్స్యకారుల ఎస్టీ సాధన సమితి పిలుపుతో సోమవారం విశాఖ హార్బర్‌లో మత్స్యకారులు బంద్ పాటించారు. 40 రోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేసిన సమితి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం రద్దీగా దర్శన మిచ్చే ఫిషింగ్ హార్బర్ అంతా ఖాళీగా దర్శనమిచ్చింది. మత్స్యకారులు మూకుమ్మడిగా బంద్‌లోపాల్గొనడంతో ఎక్కడి బోట్లు అక్కడ నిలిచిపోయాయి. చేపల వ్యాపారం సాగకపోవడంతో హార్బర్ నిర్మానుష్యంగా మారింది. ఈ ఒక్క రోజు దాదాపు రూ. 5 కోట్లు మేర ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయినట్లు వ్యాపారులు తెలిపారు. ఈ సందర్భంగా హార్బర్ వద్ద జరిగిన సభలో మరపడవల ఆపరేట్ల సంఘం అధ్యక్షులు పీసీ అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారులను చిన్న చూపు చూస్తుందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల హామీల అమలుకు పూనుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల బంద్‌కు పిలుపు ఇస్తామని హెచ్చరించారు. కనీస ఆదాయం లేక ఆటుపోట్ల జీవితాలు గడుపుతున్న మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని మత్స్య కార్మికుల సంఘం నాయకులు కె తాతారావు డిమాండ్ చేశారు.

ఏసీబీకి చిక్కిన నీటిపారుదల శాఖ జేఈ



విశాలాంధ్ర-చోడవరం : విశాఖ జిల్లా చోడవరం మండల నీటిపారుదలశాఖ పరిధిలోని వడ్డాది సెక్షన్ జూనియర్ ఇంజనీర్ ఆకుల ప్రకాష్ సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. కె.జె.పురానికి చెందిన రైతు ఆళ్ల సంతోష్ కుమార్ నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

ఏసీబీ డీఎస్పీ రామక్రిష్ణప్రసాద్ కథనం ప్రకారం.. మాడుగుల మండలం కె.జె.పురం గ్రామంలోని శ్రీరాంసాగర్, రంగారావుసాగర్, సీతారాంసాగర్ తదితర ప్రాంతాల్లో 2016లో నీరు-చెట్టు పథకం కింద చెరువు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు చేసిన కె.జె.పురంవాసి ఆళ్ల సంతోష్‌కుమార్‌కు సగం బిల్లులు చెల్లించారు. మిగిలిన బిల్లుల చెల్లింపునకు రూ.50 వేలు ఇవ్వాల్సిందిగా వడ్డాదిని సెక్షన్ జె.ఈ. ప్రకాష్ డిమాండ్ చేశారు. తన వద్ద అంత సొమ్ము లేదని, రూ.20 వేలు ఇస్తానంటూ చెప్పి నప్పటికీ జె.ఈ. వినకపోవటంతో సంతోష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనలతో జేఈ డిమాండ్ చేసిన రూ.50 వేలు ఇచ్చేందుకు సంతోష్ సుముఖత వ్యక్తం చేశాడు. జె.ఈ. ప్రకాష్‌కు ప్రైవేటు అసిస్టెంటుగా పనిచేస్తున్న ప్రసాద్ ద్వారా బాధితుడి నుంచి డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జేఈ ప్రకాష్ తీసుకోమని ఆదేశించడంతో తాను తీసుకున్నట్టు ప్రసాద్ ఏసీబీ అధికా రులకు వివరించారు. జేఈతోపాటు ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇరువురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రామక్రిష్ణ ప్రసాద్ చెప్పారు.. డీఎస్పీ వెంట ఎస్సైలు గణేష్, రమేష్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లోడు లారీల చోరీ ముఠా అరెస్టు



విశాలాంధ్ర - నందిగామ : రహదారుల పక్కన నిలిపిన లారీలను మాయం చేసే ఇరువురు ముఠాను కృష్ణాజిల్లా నందిగామ డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. రూ.17 లక్షల విలువైన సిమెంట్ బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. నందిగామలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ రాధేష్ మురళీ ఈ ముఠా కార్యకలాపాలను విలేకరులకు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని వైరా గ్రామానికి చెందిన ఉప్పు తిరుపతిరావు, వైరాకు చెందిన బండారు శ్రీను కలిసి కొంతకాలంగా రహదారుల పక్కన ఆగివున్న లోడ్ లారీలను చాకచక్యంగా అపహరిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి లారీల్లోని సరుకు అమ్ముకొని లారీలను వదిలివెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన లారీ యజమాని ముత్తసాని కృష్ణకు సత్యదేవ లారీట్రాన్స్ పోర్టు కంపెనీ ఉంది. సిమెంట్ కంపెనీలకు లారీలను కాంట్రాక్ట్‌కు పెడుతుంటారు. ఈ నెల తొమ్మిదో తేదీన అతని లారీని బత్తుల సైదారావు అనే లారీ డ్రైవర్‌కు ఇచ్చి సూర్యపేట జిల్లా దొండపాడులోని జువారీ సిమెంట్ ప్యాక్టరీలో లోడుకు పంపారు. లారీలో 450 సిమెంట్ బస్తాలు లోడ్ చేసుకొని గుంటూరు వెళ్తుండగా మార్గం మధ్యలో అదే రోజు రాత్రి డ్రైవర్ లారీని తన స్వగ్రామమైన హైతవరంలో రోడ్డు పక్కన నిలిపివేసి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకున్నాడు. తెల్లవారుజామున బయటికి వచ్చి చూడగా లారీ కనిపించలేదు. ఎవరో దొంగిలించినట్లు గుర్తించి నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ పీవీ రమణ దర్యాప్తు చేపట్టారు. ఈ నెల నాల్గవ తేదీ ఆదివారం సాయంత్రం ప్రస్తుతం పట్టుబడిన ఇరువురు ముద్దాయిలు నందిగామ శివారు అనాసాగరం వద్ద ఉండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అపహరించిన లారీని కీసర టోల్‌గేట్ మీదుగా కంచికచర్ల, మధిర, వైరా మీదుగా ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకోడిమ గ్రామానికి తరలించినట్లు నిందితులు అంగీకరించారు. అక్కడ వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ దగ్గరకు వెళ్లి సిమెంట్‌ను వేరే వ్యక్తి దగ్గర నుంచి తీసుకువచ్చామని, డబ్బు అవసరమైనందున అతను అమ్ముతున్నాడని మాయమాటలు చెప్పి కాంట్రాక్టర్ వద్ద రూ. 90,000 వేలు నగదు తీసుకున్నారు. మిగతా డబ్బు బిల్లు వచ్చిన తర్వాత ఇస్తామని కాంట్రాక్టర్ తెలిపినట్లు వివరించారు. లారీ నుంచి సిమెంట్ అన్‌లోడ్ చేసిన తర్వాత లారీని అక్కడే వదిలేశారు. సంక్రాంతి తర్వాత తీసుకువెళ్తామని చెప్పి వెళ్లిపోయారు. గత నవంబరులో కోదాడ, జగ్గయ్యపేటలో ఇలానే రెండు సిమెంట్ లారీలను దొంగతనం చేసి ఖమ్మం జిల్లా మంగాపురంలో ఒక వ్యక్తికి అమ్మినట్లు నిందితులు తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. ఇరువుర్ని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును సకాలంలో దర్యాప్తు చేసిన సీఐ రమణ, ఎస్సై ఏసేబులకు రివార్డు కోసం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేస్తున్నట్లు ప్రకటించారు.



విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన లేదు

- 2018-19కి రూ.7,983 కోట్ల లోటు
- ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ : విద్యుత్ చార్జీలు పెంచే ప్రతిపాదన ఏమీ లేదని, నష్టాలు తగ్గించి ఆదాయం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఏపీఈఆర్సీ (ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి)చైర్మన్ జస్టిస్ జి. భవానీప్రసాద్ అన్నారు. పంపిణీ నష్టాలు తగ్గించేలా ప్రయత్నం చేయాలన్నారు. విశాఖలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. 2018-19 సంవత్సరానికి వార్షికాదాయ అవసరాలపై అంచనా బడ్జెట్ తయారుచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థలు 2018-19 సంవత్సరానికి రూ.7,983 కోట్ల మేర లోటులో ఉందన్నారు. ఈపీడీసీఎల్ రూ. 1,764 కోట్లు కాగా , ఎస్పీడీసీఎల్ లోటు రూ.6,219 కోట్లుగా వివరించారు. లోటు భర్తీ కి ప్రభుత్వం నుంచి హామీ వచ్చిన తర్వాత చార్జీలు పెంచాలా వద్దా అనే నిర్ణయం ఉంటుందన్నారు. ఏపీఈఆర్‌సీకి కన్సల్టెంట్లు ఎవరూ లేరని, తాము బాధ్యతలు స్వీకరించినప్పుడు కొనసాగుతున్న కన్సల్టెంటును తొలగించి ప్రభుత్వానికి రూ.54 లక్షలు మిగిల్చినట్లు చెప్పారు. 2016-17 సంవత్సరానికి వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం రూ.416 కోట్లు సబ్సిడీ విడుదల చేసిందన్నారు. ప్రైవేటు ఆస్థులలో విద్యుత్ హెచ్‌టీ టవర్లు, లైన్లు ఏర్పాటు చేసినప్పుడు భూమి యజమానికి నష్టపరిహారం ఇవ్వాల్సిందేనని వెల్లడించారు. నష్ట పరిహారం నిర్ణయించే అధికారం జిల్లా కలెక్టర్‌కు అప్పగించినట్లు చెప్పారు. విశాఖ జిల్లాలో స్మార్ట్ మీటర్ల పైలెట్ ప్రాజెక్టు ప్రారంభమైందని, నగరమంతా భూగర్భ విద్యుత్ సరఫరా కేబుల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈపీడీసీఎల్ సీఎండీ హెచ్.వై. దొర మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే క్రమంలో పూర్తి సాంకేతికత పద్ధతిలో విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీఈఆర్సీ సభ్యుడు పి. రామ్మోహన్, డాక్టర్ పి. రఘు, సీజీఎం కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయాల సేకరణలో రగడ

విద్యుత్ విభాగంలో చేపట్టిన పలు ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఐ, సీపీఎం నేతలు ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకించింది. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, రైతులకు తొమ్మిది గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. 2004లో విద్యుత్ చార్జీలు పెంచడం వల్లే చంద్రబాబునాయుడు ఓటమి చవిచూసిన విషయాన్ని గుర్తు చేశారు. చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. పలు ప్రజాసంఘాల ప్రతినిధులు విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

అదరహో అరటి గెల..



శ్రీకాకుళం జిల్లా కవిటి మండల పరిధిలోని చింతామణి కాలనీలో కంటు అప్పాయమ్మ పెరట్లో అరటి గెల చూపరులను అబ్బురపరుస్తోంది. సుమారు 10 అడుగుల మేర పెరిగిన ఈ గెలకు 800 అరటి కాయలు కాశాయి. ఈ గెలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివస్తున్నారు.

-విశాలాంధ్ర, కవిట

మార్చి 31 లోగా ఓడీఎఫ్ లక్ష్యాలు పూర్తి : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 31 లోగా ఏపీ సంపూర్ణ ఓడీఎఫ్ రాష్ట్రం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సోమవారం సచివాలయంలో ఆయన సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే వినతులు, ఈ-పరిపాలన స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా ఓడీఎఫ్ పై సమీక్షను, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలో మన రాష్ట్రం ఇప్పటికి 83.90శాతం ఓడీఎఫ్ సాధించిందని, మిగిలిన లక్ష్యాన్ని మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఓడీఎఫ్‌లో అరుణాచల్ ప్రదేశ్, చత్తీస్ గఢ్, దయ్యు డామన్ లు అగ్రస్థానంలో ఉన్నాయని, మహారాష్ట్ర 19శాతంతో చివరిస్థానంలో ఉందని సీఎం వివరించారు. ఓడీఎఫ్ కు శ్రీకాకుళం, చిత్తూరు, అనంతపురం, విశాఖ జిల్లాలలోనే సమస్య ఉందని కేంద్ర ప్రభుత్వ 'స్వచ్ఛ భారత్' మిషన్ అధికారులు సీఎంకి వివరించారు. వచ్చే రెండు నెలలు పరీక్షలు ఉన్నట్లుగానే భావించి పనిచేయాలని కలెక్టర్లను సీఎం కోరారు. ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ఈ పర్యాయం అన్ని ప్రభుత్వ శాఖలను ఒక దగ్గర చేర్చి కన్వర్జెన్స్ ద్వారా నిధులను కేటాయిస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ప్రజలే ముందు' అనే నినాదంతో ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక 1100 నెంబర్ పరిష్కార వేదిక లాంటిది దేశంలోనే వినూత్నమైనదని, విజయవంతం చేయాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజల్లో పరిపాలనపై, ప్రభుత్వ పథకాల అమలుపై సంతృప్తిని తీసుకురావడంలో 'ప్రజలే ముందు' పరిష్కార వేదిక ప్రధాన పాత్ర పోషించాలని, ఇందుకు జిల్లా కలెక్టర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐదో విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో వచ్చిన ఆర్థికేతర సమస్యలను నెలరోజుల లోగా పరిష్కరించాలని, ఆర్థిక సమస్యలైతే వీలయినంత త్వరలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి కోరారు. కార్యాలయాల్లో ప్రతి 4వ శనివారం మధ్యాహ్నం ఓడీఎఫ్ సాధనపై మాట్లాడాలన్నారు. మంత్రులు కళావెంకట్రావు, శిద్దారాఘవరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, అఖిల ప్రియ, కాల్వ శ్రీనివాసులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



హోదా కోసం విశాఖలో పోరు

విభజన హామీలు అమలు చేయాల్సిందే : చలసాని

విశాలాంధ్ర-విశాఖసిటీ : రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనని ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ డిమాండు చేశారు. సోమవారం విశాఖ లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయం వద్ద జరిగిన 'ఆంధ్రుల ఆత్మగౌరవ పోరాట' కార్యక్రమంలో చలసాని మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులు, ద్రవ్యలోటు, పారిశ్రామిక ప్రోత్సహకాలు, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇలా ఏ అంశంలోనూ న్యాయం చేయలేదన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రైల్వేబడ్జెట్ లో ఏపీ రైల్వేకి రూ.3 వేల కోట్లు కేటాయించి, కర్ణాటకకు రూ.20 వేల కోట్లు, మహారాష్ట్రకు రూ.50 వేల కోట్లు కేటాయించారని మనకు మాత్రం ఒట్టిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో పొందుపరచినట్టు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు రూ. 23 వేల కోట్లు రావాల్సి ఉండగా కేటాయింపులే జరగలేదన్నారు. ఎన్నికలున్న రాష్ట్రాలు, వ్యాపార నగరాలైన బాంబే, అహ్మదాబాద్ వంటి నగరాలు మాత్రమే బీజేపీ దృష్టి పెట్టిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యాసంస్థలు పూర్తి కావాలంటే రూ.11 వేల కోట్లు కావాల్సి ఉండగా రూ.2 వందల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. డీసీఐకు బడ్జెట్‌లో కావాలనే నిధులు కేటాయింపు తక్కువ చేశారని ఆరోపించారు. త్వరలో చేపట్టబోయే చలో ఢిల్లీకి భారీగా విద్యార్థులు చేరుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో విభజన హామీల సాధన సమితి ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, సహాయ కార్యదర్శి కనిశెట్టి సురేష్‌బాబు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి : ఐఏఎల్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశంలోని న్యాయవాదుల సంక్షేమానికి, కోర్టుల అభివృద్ధికి, సిబ్బంది ఏర్పాటుకు, కక్షిదారుల సౌలభ్యం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తగు నిధులు కేటాయించాలని ఇండియా అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) డిమాండు చేసింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్.ఎస్.చీమా అధ్యక్షతన జైపూర్ లో జరిగిన ఐఏఎల్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ అంశంపై జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మ గాని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. అందుకు ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ మూల సూత్రాలను నిర్వీర్యం చేయకుండా వ్యవహ రించాలని, ఆదేశ సూత్రాల అమలుకు చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండు చేసింది. అందుకు దేశ వ్యాప్తంగా ప్రజలను, న్యాయవాదులను చైతన్య పరచేందుకు కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. సమావేశంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది జితేంద్ర శర్మ, సమావేశాల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు కునాల్‌రావర్ట్, ప్రధాన కార్యదర్శులు మురళీధర, ఆర్. లోహిత్, బి. ప్రభాకర్, వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యులు ఎ.వి. కృష్ణారావు, రాథోడ్ సుమన్, కె.యం. ప్రసాద్, డి.జనార్ధన్, తదితరులు ప్రసంగించారు. "దేశంలో అసమానతలు- వాటి పరిష్కారం" అనే అంశంపై మహావీర్ అడిటోరి యంలో జాతీయస్థాయి సెమినార్ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి మనీష్ పాండరీ, సంజీవ్ ప్రకాష్ శర్మ, జాతీయ విశ్రాంతి న్యాయ మూర్తుల అధ్యక్షుడు ఎ.బి.దావేలో పాల్గొని ప్రసంగించారు.

ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మోడీ పాలన



- హిందూత్వ ఫాసిస్టు శక్తులపై సంఘటితంగా ఉద్యమిద్దాం
- లౌకిక, ప్రజాస్వామ్య, ప్రజాతంత్రశక్తుల ఐక్యత అవశ్యం
- భూమి, భుక్తి, సామాజిక న్యాయం కోసం పోరాటం
- జూన్, జూలై మాసాల్లో భూపోరాటాలు
- సురవరం సుధాకరరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : నరేంద్రమోడీ సర్కార్ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. బీజేపీ సారథ్యం లోని ఎన్డీఏ పాలనలో మతోన్మాదం పెచ్చుమీరుతోందన్నారు. హిందూత్వ.. ఫాసిస్టు శక్తులకు, మతోన్మాదులకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష, ప్రజాతంత్రశక్తులు సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ లోని రాజ్‌బహదూర్‌గౌర్ సమావేశ మందిరంలో జరిగింది. సురవరం సుధాకరరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, బీకేఎంయూ జాతీయ ఉపాధ్యక్షుడు గుండా మల్లేష్ ప్రసంగించగా, వర్క్‌షాప్‌కు తెలంగాణ వ్యవ సాయ కార్మిక సంఘం అధ్యక్షుడు తాటిపాముల వెంక ట్రాములు అధ్యక్షత వహించారు. సురవరం మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి భంగం కలుగుతోందని, హిందూత్వశక్తులు పేట్రేగిపోయి దాడులకు తెగబడుతున్నాయని అన్నారు. పోరాటాలతో ఉపాధి హామీ పథకాన్ని సాధించుకోగలిగామని చెప్పారు. మోడీ పాలనలో ఈ పథకం నిర్వీర్యమైందన్నారు.

భూమికోసం, భుక్తికోసం, సామాజిక న్యాయం కోసం పోరు సాగించాలని సురవరం అన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలన సాగుతోందన్నారు. ఎన్నికల హామీలు అమలుకు నోచుకోవడం లేదని చెప్పారు. దళితులకు మూడెకరాల భూమి అటకెక్కిందని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోందన్నారు. గుండా మల్లేష్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీకేఎంయూ జాతీయ మహాసభలు తిరుపతిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలు చేయడానికి పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తాటిపాముల వెంకట్రాములు, సంఘం ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలు, తునికాకు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. భూ సమస్య, పోడు సాగుదారుల పట్టాల కోసం, అటవీ చట్టం అమలు కోసం భూ పోరాటాలు సాగించాలన్నారు. జూన్, జూలై మాసాల్లో భూ పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరు చేయాలని, వృద్ధాప్య పెన్షన్ ఇప్పించేందుకు సంఘం కృషి చేయాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు ముడి మార్టిన్, యాదమ్మ పాల్గొన్నారు.

12 నుంచి జూన్ 7 వరకు

జల సంరక్షణ ఉద్యమం

116 రోజులపాటు రెండో దశ పనులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జల సంరక్షణ, సమర్ధ నీటి నిర్వహణ కోసం మరోసారి ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు. ఈనెల 12 నుంచి జూన్ 7 వరకు 116 రోజుల పాటు 'జల సంరక్షణ ఉద్యమ స్ఫూర్తి - రెండో దశ' పేరుతో పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, చెక్ డ్యాంల నిర్మాణం, పంటకుంటల తవ్వకం వంటి పనులు పెద్దఎత్తున తలపెట్టాలన్నారు. గతేదాది ఇదే సమయంలో చేపట్టిన మొదటి దశ పనుల ఫలితాలు- ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను విశ్లేషించాలని సోమవారం సచివాలయంలో జరిగిన పోలవరం, ప్రాధాన్య ప్రాజెక్టుల సమీక్షలో తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 16 వేల గ్రామాల్లో వాటర్ ఆడిటింగ్ జరిగేలా చూడాలని, నీటి నిల్వలు సమకూర్చడమే కాకుండా, నాణ్యమైన నీటిని అందించడం ముఖ్యమన్నారు. ఒక మీటరు మేర భూగర్భ జలాలు పెరిగితే రూ. 250 కోట్ల విలువైన విద్యుత్ ఆదా చేయొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

భూగర్భ జలాల పెంపు ద్వారా 2017-18లో రూ. 488 కోట్ల విలువైన విద్యుత్ ఆదా చేశామని, ఈ ఏడాది 2018 మే నాటికి 12.91 మీటర్ల మేర భూగర్భ జలాలు వుండొచ్చని చెప్పారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకంలో పైపులైను, పంపుల బిగింపు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మూరాల, చెర్లోపల్లి రిజర్వా యర్లు, పులకుర్తి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి ఈనెలలోనే ప్రారంభిం చాలని, అలాగే కొండవీటి ప్రాజెక్టును ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. 'గోదావరి-పెన్నా అనుసంధానం మొదటి దశ' ప్రణాళికలను అధికా రులు ముఖ్యమంత్రి ముందుంచారు. గోదావరి-పెన్నా అనుసంధానం మొదటి దశకు మొత్తం 1,778 ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని వెల్లడించారు. మొద టి దశ కార్యరూపం దాల్చడానికి రూ. 4,617 కోట్లు వ్యయం కానుందని అంచనా వేశారు. 5 దశల్లో చేపట్టాలని భావిస్తున్న 'గోదావరి-పెన్నా' అను సంధానానికి రూ. 83,565 కోట్లు ఖర్చు చేయాల్సి వుంటుందని అధికారులు లెక్క తేల్చారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిలో భారత్‌కు ఐదోస్థానం

చికిత్సకు అనుకూలం : డబ్ల్యూటీఓ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మూర్ఛ వ్యాధి రోగుల్లో అత్యధికులు వ్యాధికి చికిత్స చేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఇది నరాల్లో ఉన్న సాధారణ పరిస్థితుల్లో ఒకటని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూటీఓ) తెలిపింది. డబ్ల్యూటీఓ అధ్యయన గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఐదు కోట్లమంది పౌరులు 'మూర్ఛ' వ్యాధితో బాధపడుతూ ఉంటే భారత దేశం ఐదో స్థానంలో ఉంది. భారతీయుల్లో 1.2 కోట్లమంది మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 12వ తేదీన అంతర్జాతీయ మూర్ఛవ్యాధి దినోత్సం (ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డే)గా పాటిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని అపోలో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ హనుమంతగిరి ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూర్ఛ వ్యాధి కొన్ని అకస్మిక ఘటనల క్రమరాహిత్యం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్య అని వివరించారు. హైదరాబాద్‌లోని మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ న్యూరాలజిస్టు డాక్టర్ సిమాచల్ మిశ్రా మాట్లాడుతూ, మూర్ఛ వ్యాధి నివారణకు రెండేళ్ల సమయం పడుతుందని, కొందరు రోగులు సకాలంలో మందులు వేసుకునేందుకు అనుసరించాల్సిన నియమావళిని పాటించక పోవడం వల్లే సమస్య తలెత్తుతుందని చెప్పారు. సంక్రమిత వ్యాధులు, గుండెపోటు, తలకు గాయమైనా, ఆల్కాహాల్ తాగినా సమస్య తలెత్తుతుందని చెప్పారు.


హిందీ ప్రచార సభలో భారీ అవినీతి

సీబీఐకి మాజీ అధ్యక్షుడి ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతో, దాతల సహకారంతో, విద్యార్థుల ఫీజులతో ఐదు రాష్ట్రాల్లో హిందీ భాష ప్రచారం కోసం ఏర్పాటైన హిందీ ప్రచార సభలో ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని మాజీ అధ్యక్షుడు పోతుల సుబ్బిరెడ్డి సోమవారం సీబీఐకి ఫిర్యాదు చేశారు. నాంపల్లి స్టేషన్ రోడ్‌లో ఉన్న హిందీ ప్రచార సభ ప్రధాన కార్యాలయం మార్కెట్ విలువ రూ.45 కోట్లు కాగా సంస్థ ట్రస్టీ, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభు, సంస్థ అధ్యక్షుడు భగవంతరావు హెగ్డే, ఆడిటర్ కె.సుధాకర్లు ఐదున్నర కోట్ల రూపాయలకు అమ్మి సంస్థకు నష్టం చేకూర్చారన్నారు. మూడేళ్లకొకసారి కార్యవర్గం ఎన్నికలు జరగాల్సి వుండగా తొమ్మిదేళ్లుగా ఎన్నికల ప్రస్తావనే లేకుండా నియంతృత్వ పాలన సాగిస్తున్నారన్నారు. వీరి అక్రమాలపై కేంద్ర హిందీ డైరెక్టరేట్ అధికారులు 2017, డిసెంబర్ 5న నాంపల్లి కేంద్ర కార్యాలయంలోని రికార్డులను స్వాధీనం చేసుకొన్నట్టు తెలిపారు. 2007లోనే ట్రస్టీ ఆస్తులను న్యాయ స్థానానికి అప్పగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు.

పక్కాగా స్థిరాస్తి వ్యాపారం

- అమల్లోకి రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం
- సంస్థలు, ఏజెంట్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఆ తర్వాతే మార్కెటింగ్‌కు అనుమతి
- ఏపీ రెరా వెబ్‌సైట్ ఆవిష్కరణ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో రియల్ నియంత్రణ చట్టం (ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ - ఏపీ రెరా) అమల్లోకి వచ్చింది. ఇక నుంచి రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారం పక్కాగా చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఇక నుంచి రాష్ట్రంలోనూ అమలవుతుందని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సంస్థలు విధిగా ఏపీ రెరా వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ఆవరణలోని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ప్రధాన కార్యాలయంలో రెరా వెబ్‌సైట్‌ను కరికాల వలవన్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ ప్రమోటర్లు తమ ప్రాజెక్టులను రెరా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోళ్లలో సంపూర్ణ పారదర్శకత కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రెరా చట్టం కింద అమ్మకానికి లేదా లీజుకు ఉద్దేశించిన ప్రతి భవన సముదాయం, భూ సముదాయం (ప్లాట్లు, లే అవుట్‌లను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న, నిర్మించనున్న అపార్ట్‌మెంట్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, గేటెడ్ కమ్యూనిటీ ముందుగా ఏపీ రెరా సంస్థ వద్ద రిజిస్టర్డ్ అయి నంబర్ పొందిన తర్వాతే వ్యాపార లావాదేవీలు ప్రారంభించాలన్నారు. ప్రకటనలు, బ్రోచర్ల విడుదల వంటి మార్కెటింగ్ కార్యకలాపాలను రిజిస్ట్రేషన్ తర్వాతే చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ సంస్థలు తమ ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని రకాల ప్రకటనల్లోనూ తప్పనిసరిగా రెరా రిజిస్ట్రేషన్ నంబర్ వెల్లడించాలని చెప్పారు. ఏపీ రెరా వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోకుండా స్థిరాస్తి ప్రాజెక్టుల అమ్మకాలు చేపట్టటం నేరమని ఆయన హెచ్చరించారు. అలాంటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆపేందుకు, అపరాధ రుసుం విధించేందుకు, ప్రమోటర్లను నిషేధించేందుకు, ఇతర చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు సంస్థకు అధికారం ఉంటుందని తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ప్రాజెక్టులతోపాటు ఏజెంట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వినియోగదారులు ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలతోపాటు ప్రమోటర్లు, ప్రాజెక్టు ఆర్థిక లావాదేవీలు, నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే సౌలభ్యం ఉన్నట్లు చెప్పారు. వీటి విషయంలో ఏవైనా ఇబ్బందులుంటే వినియోగదారులు వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తామన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్షణమే ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజలు కూడా స్థిరాస్తులను కొనుగోలు చేసే ముందే www.rera.ap.gov.in ద్వారా తనిఖీ చేసుకోచ్చన్నారు. అనంతరం ఫేస్‌బుక్, ట్విట్టర్‌లోనూ ఏపీ రెరా ఖాతాలను వలవన్ ప్రారంభించారు. ఏపీ టిడ్కో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వి.రామనాథ్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఓఎస్‌డీ సురేష్, ఏపీ రెరా డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ సీహెచ్‌వీ సాంబశివరావు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ విజ్ఞప్తికి ఢిల్లీ హైకోర్టు అనుమతి

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తనపై దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో రెండు డీడీసీఏ డాక్యుమెంట్లు తెప్పించాలన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు సోమవారం అనుమతించింది. కేజ్రీవాల్ తరపున జైట్లీ క్రాస్ ఎగ్జామినేషన్లలో ఒక దానిని ప్రస్తావిస్తూ, కేసులో కేంద్ర మంత్రికి సంబంధించిన ప్రశ్నలు లేవని. ఏ దశలో క్రాస్ ఎగ్జామినేషన్ జరుగుతుందో స్పష్టంగా లేదని న్యాయస్థానం పేర్కొంది. జైట్లీ క్రాస్ ఎగ్జామినేషన్ సమయంలో ఎదుర్కొనే 2003, ఫిబ్రవరి 10, ఏప్రిల్ 6వ తేదీలకు సంబంధించిన రెండు డాక్యుమెంట్ల కోసం కేజ్రీవాల్ అభ్యర్ధనను కోర్టు అనుమతిస్తున్నట్లు జస్టిస్ మన్మోహన్ స్పష్టం చేశారు. అయితే ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(డీడీసీఏ)కు జైట్లీ అధ్యక్షుడిగా ఉన్నపుడు 1999-2013 మధ్య కాలంలో క్రికెట్ మండలి సమావేశాల వివరాలన్నింటినీ తెప్పించాలన్న కేజ్రీవాల్ అభ్యర్ధనను మాత్రం హైకోర్టు తోసిపుచ్చింది. పరువు నష్టం దావా కేసులో జైట్లీ క్రాస్ ఎగ్జామినేషన్ ఒక జాయింట్ రిజిస్ట్రార్ సాగుతోంది. డీడీసీఏకి సంబంధించిన రెండు పత్రాలు, సమావేశాల వివరాలు తెప్పించాలని తన అభ్యర్ధనను తోసిపుచ్చుతూ జాయింట్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ చేసుకున్న అభ్యర్ధనపై హైకోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది.

వజ్రాల వ్యాపారి మోడీపై సీబీఐ కేసు

న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీ, అతని భార్య, సోదరుడిపై సీబీఐ చీటింగ్ కేసు నమోదు చేసింది. 2017లో పంజాబ్ నేషనల్ బ్యాంకును మోస గించి రూ. 280.70 కోట్లు తీసుకున్నారని అధికారులు తెలిపారు. ఆ బ్యాంకు ఫిర్యాదుతో మోడీ, అతని సోదరుడు నిషాల్, భార్య అమి, మెహుల్ చినుభాయ్ చోక్సి, అమెరికాలోని సోలార్ ఎక్స్‌పోర్ట్స్, స్టెల్లార్ డైమండ్స్ భాగస్వామ్యులు అధికారులతో కలసి ఉద్దేశపూర్వకంగా బ్యాంకుకు నష్టం కలిగించేందుకు కుట్ర జరిపారని సీబీఐ అధికారులు ఎఫ్ ఐఆర్ దాఖలు చేశారు. నలుగురు బ్యాంకు అధికారులపై కూడా అవినీతి కేసు దాఖలు చేశారు. జనవరి 16న తప్పుడు ధృవపత్రాలు సమర్పించారని బ్యాంకుకు లేఖ రావడంతో ఈ విషయం వెలుగు చూసింది. డిప్యూటీ మేనేజర్ (ప్రస్తుతం విరమణలో) గోకుల్ ఖారత్ , మనోజ్ ఖారత్ తప్పుడు అండర్‌టేకింగ్ లేఖలతో నిబంధనలకు వ్యతిరేకంగా ఎంట్రీలు లేకుండా 4.42 కోట్లు (రూ. 280.70 కోట్లు) రుణం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

పాక్ మూడేళ్ల కాల్పుల్లో 97 మంది బలి

జమ్ము : కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాక్ మూడేళ్లుగా విచక్షణారహితంగా జరిపిన 834 కాల్పుల్లో 97 మంది మృతి చెందగా, మరో 384 మంది గాయాలపాలయ్యారని కాశ్మీర్ ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. వారిలో 41 మంది పౌరులు కాగ మిగతావారు భద్రతా సిబ్బందని పీడీపీ ఎమ్మెల్సీ శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి మెహబూబ ముఫ్తీ రాత పూర్వక సమాధానం ఇచ్చారు. గతేదాది సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి 379 కాల్పులు జరగగా, 2015 - 2016 ల్లో 233 విచక్షణా రహిత కాల్పులు జరిగాయని 2017లో 12 మంది, 2016లో 13, 2015లో 16 మంది పౌరులు మృతి చెందారన్నారు. 233 సాధారణ పౌరులతోసహా మొత్తం 383 మందికి గాయపడగా, 2017లో 79మంది, 2016లో 83, 2015లో 71 మందికి గాయాలయ్యాయన్నారు. 2017లో 31 మంది భద్రతాసిబ్బంది, 2016లో 16, 2015లో 9 మొత్తం 56 మంది భద్రతాసిబ్బంది మూడేళ్లుగా మృతి చెందారని ముఖ్యమంత్రి వెల్లడించారు. 2015 నుంచి 2017 వరకు 150 మంది భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయని ముఫ్తీ వెల్లడించారు.

రాజధానిలో జలవిహారాలు...

- వెంకటపాలెం వేదికగా పర్యాటక కేంద్రం..
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సీఆర్డీఏ



విశాలాంధ్ర-అమరావతి : రాజధాని ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వినోదం విహారం ఒకే చోట ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే వెంకటపాలెంలో నదీతీరాన ఆహ్లాదకర కేంద్రం ఏర్పాటు చేసేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్డీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జల క్రీడలకు, జల విహారాలకు వేదికగా ఈ పర్యాటక ప్రాంతం ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటుగా అన్నిరకాల వసతులు సమకూర్చుతూ ఈ నిర్మాణాలు ఉండనున్నట్లు తెలు స్తోంది. నది ప్రాంతానికి అనుకుని నిర్మించే రాజధాని కావటంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని ముఖ్యమంత్రి సీఆర్డీఏ అధికారులకు సూచించారు. దీంతో పలు ప్రాంతాలను పరిశీలించిన సీఆర్డీఏ అధికార్లు మంతెన సత్యనారాయణ ఆశ్రమం అనుకొని నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

మెరీనా మాదిరిగా..

చిన్న చిన్న బొట్లను ,యాట్లను నిలిపి,ప్రత్యేకంగా అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే ప్రాంతాన్ని మెరీనా అంటారు. మన దేశంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఇప్పటికే కొచ్చిలో పర్యాటక ప్రాంతం ఏర్పాటైంది. అదే విధంగా ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో ఈ నిర్మాణాలు చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. జల క్రీడలకు, జలవిహారాలకు వేదికగా నిలిచేలా పటిష్ట ఏర్పాట్లు చేయనుంది.

ఆహ్లాదం..ఆనందం ఒకేచోట..

కృష్ణా తీరాన ఏర్పాటు చేసే ఈ వినోద కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించనున్నారు. నది విహారం చేసే బొట్లతో పాటు, రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టులు, జల వినోద క్రీడలు,ఫిష్ అక్వేరియం, వంటి వాటిని ఏర్పాటు చేయనున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే పారిశ్రామికంగా కూడ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇక్కడ ఉపయోగించే బోట్లకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాల్సి ఉండటంతో అందుకు అవసరమైన నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అలాగే అంతర్జాతీయ నైపుణ్యంతో బొట్ల మరమ్మత్తు కేంద్రం, పవర్ బొట్లు నడపటంలో శిక్షణా కేంద్రం, బోట్ల విడి భాగాల దుకాణం, భద్రతా చర్యలకు సంబం ధించిన శిక్షణా కేంద్రం, వంటివి కొలువు తీరనున్నాయి. ఆహ్లాదం కోసం 10 పవర్ బొట్లు ,పాంటూన్లు ,రెండు లేజర్ సెయిల్ బోట్లు ,సహాయ రక్షణ చర్యలు కోసం మారో రెండు బోట్లు, ఈ పర్యాటక కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా సీఆర్డీఏ ప్రణాళికలు సిద్ధం చేసింది. వెంకటపాలెంలో ఏర్పాటు చేసే ఈ వినోద కేంద్రాన్ని మంతెన సత్యనారాయణ ప్రకృతి ఆశ్రమం పక్కన 6 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జలవిహారనికి , పారిశ్రామి కరణకు ప్రాముఖ్యత కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం కరకట్ట అవతలి వైపు అంటే రెండో పక్కన మరో ఎకరం లేదా రెండెకరాల స్థలం కేటాయింపులు జరపనున్నారు. పార్కింగ్ విషయంలో సైతం ఏ విధ మైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. అయితే మొత్తం ప్రక్రియ అంతా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో జరిగేది కావటంతో అందుకు సంబంధించిన ప్రతిపాదనలను సీఆర్డీఏ సిద్ధం చేస్తోంది.







ఫోర్బ్స్ ఇండియాలో బూమ్రా, హర్మన్, హీనా

ముంబై:
వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 30ఏళ్లలోపు యువత జాబితాను ఫోర్బ్స్ ఇండియా వెల్లడిస్తున్న సంగతి తెలిసిందే. యువ వ్యాపార వేత్తలు, ఆవిష్కరణ కర్తలు, సమూల మార్పులకు నాంది పలికిన 30ఏళ్లలోపు వయసున్న 30మంది ఈ జాబితాలో ఉంటారు. 2012 నుంచి ఫోర్బ్స్ ఈ జాబితాను విడుదల చేస్తోంది. తాజాగా 2018 సంవత్సరానికి సంబంధించిన జాబితాను వెల్లడించింది. ఈ జాబితాలో టీమ్ ఇండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బూమ్రా, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్, ఉమెన్స్ హాకీ గోల్ కీపర్ సవిత పునియా, పిస్టోల్ షూటర్ హీనా సిద్ధు సహా బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్‌లు ఉన్నారు. ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకుని యువ బౌలర్ బ్రూమా అందరినీ ఆశ్చర్య పరిచాడు. 2016 జాబితాలో విరాట్ కోహ్లి చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. 2013 ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున ఆడిన బూమ్రా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాడు. ఆ తర్వాత సచిన్ అతనని గుర్తించడం, ప్రోత్సహించడం అందరికీ తెలిసిందే. ఇక మహిళా క్రికెట్ ప్రపంచకప్‌లో అసాధారణ ఆటతో ఆకట్టుకుంది హర్మన్‌ప్రీత్ కౌర్. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్‌లో 171 పరుగులతో అజేయంగా నిలిచి, 1983లో జింబాబ్వేపై కపిల్(175) ఆడిన ఇన్నింగ్స్‌ను గుర్తుకు తెచ్చింది.

బీసీసీఐకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ:
స్పాట్ ఫిక్సింగ్ కేసులో జీవిత కాల నిషేధం ఎదుర్కొం టున్న కేరళ పేసర్ శ్రీశాంత్ సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం కేసును విచారణకు స్వీకరిం చిన ప్రత్యేక ధర్మాసనం నాలుగు వారాల్లోగా దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని బీసీసీఐకి ఆదేశాలు జారీ చేసింది. 2013లో ఐపీఎల్‌లో శ్రీశాంత్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు బలమైన ఆధారాలు ఉన్నందునే అతనిపై జీవితకాల నిషేధం విధించినట్లు బీసీసీఐ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. తనపై బీసీసీఐ జీవిత కాల నిషేధం విధించడంపై శ్రీశాంత్ కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. అయితే నిషేధం సరైనదే అంటూ హైకోర్టు తీర్పును వెల్లడించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఈనెల 2న శ్రీశాంత్ సుప్రీంకోర్డును ఆశ్రయించాడు. కేసును విచార ణకు స్వీకరించిన ప్రత్యేక ధర్మాసనం దీనిపై నాలు గు వారాల్లోగా వివరణ ఇవ్వాలని బీసీసీఐకి ఆదే శాలు జారీ చేసింది. అన్ని సాక్ష్యాలు పక్కాగా ఉన్నందుకే జీవితకాల నిషేధం విధించామని బీసీసీఐ తన వాదనలను వినిపిస్తోంది.

సిరీస్ గెలిస్తేనే టాప్

కేప్‌టౌన్:
దక్షిణాఫ్రికాతో ఆరు వన్డేల సిరీస్‌లో టీమిండియా 2-0 ఆధిక్యం సాధించిన సంగతి తెలిసిందే. ఆదివారం సెంచూరియన్ వేదికగా జరిగిన రెండో వన్డేలో విరాట్ కోహ్లి నేతృత్వంలోని భారత్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచింది. దాంతో వన్డేల్లో నంబర్ స్థానాన్ని భారత్ ఆక్రమించింది. తాజా గెలుపుతో 121 రేటింగ్ పాయింట్లతో టీమిండియా ప్రథమ స్థానంలో నిలవగా, దక్షిణాఫ్రికా 115 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే నంబర్ వన్ ర్యాంకును కాపాడుకోవాలంటే సఫారీలతో సిరీస్‌ను కచ్చితంగా గెలవాల్సి ఉంది. వన్డే సిరీస్‌ను భారత్ జట్టు 4-2తో ముగించిన పక్షంలో టాప్ ర్యాంక్ పదిలంగా ఉంటుంది. ఒకవేళ అలా కాకుండా సఫారీలు సిరీస్ సాధిస్తే మాత్రం భారత జట్టు రెండో ర్యాంక్‌కు పరిమితం కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం భారత జట్టు టెస్టుల్లో కూడా నంబర్ వన్ స్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది.



19 ఏళ్ల రికార్డు బద్దలు

సెంచూరియన్:
భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆదివారం ఇక్కడ జరిగిన రెండో వన్డేలో పలు రికార్డులు నమోదైన సంగతి తెలిసిందే. ఇందులో తొలుత 118 పరుగులకే కుప్పకూలిన సఫారీలు.. స్వదేశంలో తొలిసారి అత్యల్ప వన్డే స్కోరును నమోదు చేసిన చెత్త రికార్డును మూటకట్టుకోగా, భారత్ 177 బంతులు మిగిలి ఉండగా దక్షిణాఫ్రికాను వారి గడ్డపై ఓడించి కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అయితే ఈ విజయంలో భారత స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌దే ప్రధాన పాత్ర. ఈ మ్యాచ్‌లో ఐదు వికెట్లను సాధించి సఫారీ నడ్డివిరిచాడు. ఈ క్రమంలోనే కొత్త రికార్డును లిఖించాడు చాహల్. అది కూడా 19 ఏళ్ల నాటి రికార్డును చాహల్ తిరగరాశాడు. ముందుగా దక్షిణాఫ్రికాపై భారత తరపున రెండో అత్యుత్తమ ప్రదర్శన చేసిన బౌలర్‌గా రికార్డులెక్కాడు. 1999లో సఫారీలతో నైరోబిలో జరిగిన వన్డేలో మాజీ స్పిన్నర్ సునీల్ జోషి ఆరు పరుగులకే ఐదు వికెట్లు సాధించాడు. ఆ తర్వాత ఇంతకాలానికి భారత్ తరపున దక్షిణాఫ్రికాపై చాహల్‌దే అత్యుత్తమ ప్రదర్శన. కాగా, సఫారీ గడ్డపై వన్డేల్లో ఆ జట్టుపై ఐదు వికెట్లు సాధించిన తొలి స్పిన్నర్‌గా కూడా చాహల్ రికార్డు పుస్తకాల్లోకెక్కాడు. ఓవరాల్‌గా వన్డేల్లో చాహల్ ఇదే వన్డేల్లో అత్యుత్తమ ప్రదర్శన.



యూ-19 సారథికి మరో నజరానా

ముంబై:
ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు ఆటగాళ్లకు నజరానాలు భారీగానే అందుతున్నాయి. శనివారం జరిగిన ఫైనల్లో భారత్.. ఆసీస్‌పై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే బీసీసీఐ జట్టులోని ఒక్కో ఆటగాడికి రూ.30లక్షలు అందజేస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా అండర్-19 జట్టుకు నాయకత్వం వహించిన పృథ్వీ షాకు ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎమ్‌సీఎ) రూ.25లక్షల ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ఎమ్‌సీఎ అధ్యక్షుడు ఆశిష్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. పృథ్వీ షా ముంబైయకి చెందిన వాడే. ఈ ఏడాది ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో పృథ్వీ షాను రూ.1.2కోట్లకు కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.



వచ్చే ఏడాది కపిల్ బయోపిక్..!

ముంబై:
అభిమానులు ఆశగా ఎదురుచూస్తోన్న కపిల్‌దేవ్ బయోపిక్ '83' వచ్చే ఏడాది విడుదల కానుంది. కబీర్ ఖాన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో కపిల్‌దేవ్ పాత్రలో బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటిస్తోన్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఆగస్టు 30న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి చిత్ర బృందం ప్రపంచకప్ అందుకున్న క్రీడాకారులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. అప్పుడే సినిమా పేరును '83'గా వెల్లడించిన చలనచిత్ర బృందం తాజాగా ఈ సినిమాను ఎప్పుడు రిలీజ్ చేసేదీ తెలియజేసింది. 'అభిమానులారా మీ క్యాలెండర్‌లో 2019 ఆగస్టు 30ని మార్క్ చేసుకోండి. ఆ రోజే 83 రిలీజ్ కానుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఇప్పటి వరకు ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాలేదు. ఈ ఏడాది మధ్య నుంచి రెగ్యులర్ షూటింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 1983లో కపిల్‌దేవ్ నాయకత్వంలోని భారత్ తొలిసారి ప్రపంచకప్‌ను అందుకుంది. గత ఏడాది విడుదలైన ధోనీ, సచిన్ బయోపిక్‌లు ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

మరో రెండు నెలలు ఆటకు దూరం



గ్రేటర్ నోయిడా:
భారత టెన్నిస్ స్టార్ సానియామీర్జా మరో రెండు నెలలు ఆటకు దూరం కానుంది. ఇప్పటికే గాయంతో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో సహా ఇతర టోర్నీల నుంచి వైదొలిగిన సానియా.. ఇప్పుడు మరో రెండు నెలలు రాకెట్ పట్టే అవకాశం లేదు. కుడి మోకాలి గాయం కారణంగా ఆమె గతేడాది అక్టోబర్ నుంచి టెన్నిస్‌కు దూరమైంది. "మరో రెండు నెలలు రాకెట్ పట్టే అవకాశం లేదు. గాయం నుంచి కోలుకోవాలంటే సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. అవసరమైతే శస్త్ర చికిత్స కూడా చేయించుకోవాల్సి రావొచ్చు. ఎందుకంటే పెయిన్ కిల్లర్స్‌ను మరింత ఎక్కువ కాలం తీసుకునే పరిస్థితిలో లేను. ఇలా కోర్టుకు దూరం కావడం చాలా ఇబ్బందిగా ఉంది. కానీ తప్పదు" అని సానియా చెప్పింది.



మంధనాధన్

- దక్షిణాఫ్రికాతో మహిళల వన్డే
- 88 పరుగుల తేడాతో ఘన విజయం
- 84 పరుగులతో చెలరేగిన స్మృతి
- జులన్ గోస్వామికి 4 వికెట్లు



కింబర్లే:
ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో సోమవారం జరిగిన తొలి వన్డేలో భారత మహిళల 88 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ స్మృతి మంధాన (84, 98 బంతుల్లో 8×4, 1×6) చెలరేగి ఆడడటంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. కాపాడుకోగల స్కోరు సాధించింది.

స్మృతి, మిథాలీ కీలక భాగస్వామ్యం

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మిథాలీ సేనకు ఓపెనర్లు శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఎడమ చేతి వాటం ఓపెనర్ స్మృతి మంధాన (84) మరోసారి వీరోచిత బ్యాటింగ్ చేసింది. ఆమెకు పూనమ్ రౌత్ (19, 47 బంతుల్లో 2×4) అండగా నిలిచింది. కుదురుకున్న ఈ జోడీని 14.6వ బంతికి పూనమ్‌ను ఔట్ చేయడం ద్వారా అయబొంగ విడదీసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సారథి మిథాలీ (45, 70 బంతుల్లో 2×4)తో కలిసి మంధాన అదే జోరును కొనసాగించింది. వేగంగా పరుగులు చేసింది. అయి తే జట్టు స్కోరు 154 వద్ద 35.3వ బంతికి ఆమెను అయబొంగానే పెవిలియన్‌కు పంపించింది. మరో పరుగుకే మిథాలీ ఔటై అర్ధశతకం చేజార్చుకుంది. స్కోరు 159 వద్ద హిట్టర్ వేద కృష్ణమూర్తి (2, 8 బంతుల్లో) ఔట్‌కావడంతో భారత్ కష్టాల్లో పడింది. చివర్లో హర్మన్ ప్రీత్ కౌర్ (16, 33 బంతుల్లో 1×4), సుష్మ వర్మ (15, 21 బంతుల్లో 1×4) నిలకడగా పరుగులు సాధించడంతో భారత్ 213 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికాలో మరిజానె, అయబొంగ తలో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికాకు 13 పరుగుల వద్ద శిఖా పాండే షాకిచ్చింది. లిజిల్ లీ(3) పెవిలియన్‌కు పంపింది. మరో ఐదుపరుగులకు వికెట్ కీపర్ త్రిషా చెట్టి(5)ను పూనమ్ యాదవ్ దెబ్బకొట్టింది. అప్పటికి దక్షిణాఫ్రికా స్కోరు 19. ఓపెనర్ లౌర్వా ఓర్వాదిట్ ఆచితూచి ఆడింది. తరువాత క్రీజ్ లోకి వచ్చిన మిగ్‌నాన్ డుప్రీజ్‌ను డకౌట్ రూపంలో శిఖాపాండే దొరకబుచ్చుకుంది. కొద్దిసేపు లౌర్వా ఓర్వాదిట్-కెప్టెన్ డేన్‌వాన్ నైక్రెట్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వీరిద్దరూ కలిసి అడపా దడపా షాట్లు కొడుతూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. క్రమంలోనే లౌర్వా ఓర్వాదిట్‌ను పూనమ్ యాదవ్ ఔట్ చేసింది. తరువాత వచ్చిన త్రయాన్ 2 పరుగులు చేసి ఔటైంది. దీంతో 125 పరుగులకు జట్టు ఆలౌట్ అయ్యింది. మారిజానె కాప్, సునేలుస్ తప్ప ఎవరూ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయారు. సీనియర్ బౌలర్ జులన్ గోస్వామికి 4/24 దక్కగా, శిఖా పాండేకు 3, పూనర్ యాదవ్‌కు 2, రాజేశ్వరి గైక్వాడ్‌కు 1 వికెట్ దక్కాయి.

వారి బౌలింగ్‌లో మాయ ఉంది : పాక్

న్యూఢిల్లీ:
అండర్-19 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో భారత బౌలర్ల మాయ వల్లే పాక్ ఓడిందని ఆ జట్టు మేనేజర్ నదీమ్ ఖాన్ పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 272 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన పాక్ బ్యాట్స్‌మెన్ భారత బౌలర్ల దెబ్బకు పెవిలియన్‌కు క్యూ కట్టారు. 29.3 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటైన పాక్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. జట్టు ఓటమిపై తాజాగా నదీమ్ ఖాన్ మాట్లాడుతూ.. భారత్ నిర్దేశించిన 272 పరుగులు పెద్ద విషయం కాదని, ఆ స్కోరు చూసి పాక్ గెలుస్తుందని భావించానని పేర్కొన్నాడు. బ్యాటింగ్‌లో పాక్ బలంగా ఉండడంతో గెలుపు ఖాయమని అనుకున్నానని తెలిపాడు. అయితే భారత బౌలర్ల మాయాజాలం కారణంగా బ్యాట్స్‌మెన్ ఒకరి తర్వాత ఒకరిగా పెవిలియన్ చేరారన్నాడు. భారత బౌలర్లలో ఏదో మాయ ఉందని, వారి బౌలింగ్‌ను తమ ఆటగాళ్లు అంచనా వేయలేకపోయారని తెలిపారు. అలాగే పరిస్థితులను అర్థం చేసుకోవడంలోనూ బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారని, ఫలితంగా ఒత్తిడికి గురై వికెట్లు సమర్పించుకున్నారని వివరించారు. గత జట్లతో పోలిస్తే తమ జట్టు ఆటగాళ్లలో చాలా ప్రతిభ దాక్కుని ఉందని, సెమీఫైనల్ వరకు వెళ్లగలగడమే అందుకు నిదర్శనమని అన్నారు. అండర్-19 జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్‌పైనా నదీమ్ ప్రశంసలు కురిపించారు.

గాయంతో డికాక్ ఔట్



సెంచూరియన్:
ఆతిథ్య దక్షిణాఫ్రికాకు దెబ్బ మీద దెబ్బ. మొన్న చేతి వేలికి గాయం కారణంగా ఆ జట్టు సారథి డుప్లెసిస్ భారత్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. తాజాగా ఈ జాబితాలోకి మరో ఆటగాడు వచ్చి చేరాడు. అతడే ఆ జట్టు వికెట్ కీపర్ డికాక్. మణికట్టు గాయం కారణంగా డికాక్ భారత్‌తో మిగిలిన వన్డేలు, టీ20 సిరీస్‌కు దూరమైనట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు వెల్లడించింది. 'భారత్‌తో ఆదివారం జరిగిన రెండో వన్డేలో డికాక్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బంతి ఎడమ చేతి మణికట్టుకు బలంగా తాకింది. దీంతో అక్కడ బాగా వాపు వచ్చింది. పరీక్షించిన వైద్య సిబ్బంది కోలుకోవడానికి రెండు నుంచి నాలుగు వారాల విశ్రాంతి అవసరమని సూచించారు. ఈ కారణంగానే డికాక్‌ను భారత్‌తో ప్రస్తుతం జరుగుతోన్న వన్డే సిరీస్‌తో పాటు అనంతరం జరిగే టీ20 సిరీస్‌కు విశ్రాంతినిచ్చాం. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా మధ్య టెస్టు సిరీస్‌కు అతడు అందుబాటులో ఉంటాడు' అని దక్షిణాఫ్రికా టీమ్ మేనేజర్ మహమ్మద్ తెలిపారు. డికాక్ స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకుంటున్నది బోర్డు వెల్లడించలేదు. ప్రస్తుతం వన్డే సిరీస్‌కు మార్‌క్రమ్ తాత్కాలిక సారథ్య బాధ్యతలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా మధ్య మూడో వన్డే బుధవారం జరగనుంది.

సివిల్ సర్వీసెస్ క్రికెట్ చాంప్ ముంబై

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్:
ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. మూలపాడు ఏసీఏ క్రీడామైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్‌బీ ముంబై, సీఎస్ ఢిల్లీ జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన ఢిల్లీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఢిల్లీ కెప్టెన్ అంకూర్ జుల్ఖాన్ 50 బంతుల్లో 68 పరుగులుచేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టు 19.4 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 170 పరుగులుచేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి, ట్రోఫీని సొంతం చేసుకుంది. ఢిల్లీ జట్టు రన్నరప్‌గా నిలవగా, ఆర్‌ఎస్‌బీ చండీఘర్ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ముంబై జట్టులో హిమాన్షు జోషి 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా అవార్డును అందుకున్నాడు. ముంబై బ్యాట్స్‌మెన్ ఆమేయా శ్రిఖండే 423 పరుగులు, 6 వికెట్లు తీసి బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. బెస్ట్ బౌలర్‌గా టోర్నీ మొత్తంలో 12 వికెట్లు తీసిన ఆర్‌ఎస్‌బీ చండీఘర్ జట్టు బౌలర్ అమిత్ కాక్రియా ఎంపికయ్యాడు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) వీసీ ఎమ్‌డి ఎన్.బంగారాజు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. టోర్నమెంట్ విజయంలో కీలకపాత్ర పోషించిన శాప్ ఓఎస్‌డి ప్రత్తిపాటి రామకృష్ణను ప్రత్యేకంగా అభినంధించారు. ఏసీఏ సెక్రటరీ సీహెచ్. అరుణ్‌కుమార్, మేనేజర్ దుర్గాప్రసాద్, సెంట్రల్ అడ్వైజర్ ఎ.సిద్దు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్లు ఇ.మీరాప్రసాద్, రాజారత్నం పాల్గొన్నారు.



ఇక ఆన్‌లైన్‌లో ఓటు

నమోదుతో సహా మార్పులు, చేర్పులన్నీ!

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఓటరు నమోదుతోపాటు, మార్పులు, చేర్పులన్నీ ఆన్‌లైన్ విధానం ద్వారా చేపట్టే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి కార్యాలయ ఓఎస్‌డీ వి.వెంకటేశ్వరరావు చెప్పారు. సోమవారం స్థానిక జల వనరుల శాఖ కార్యాలయ ప్రాంగణం లోని రైతు శిక్షణా కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యాన 13 జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులు, 175 నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారు లకు ఈఆర్‌ఓ ఓటర్ నమోదు విధానంపై ఒక రోజు అవగాహనతో కూడిన వర్క్‌షాప్ నిర్వహిం చారు. ఓటరు నమోదులో సరళీకృత నమోదు వ్యవస్థను ఏప్రిల్ 24 నుంచి ప్రారంభిస్తామని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్థాయిలోనే ఓటరు నమోదు చేపడతామ న్నారు. ఇందుకోసం విలేజ్ లెవల్, బూత్‌లెవల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి వ్యవస్థను మరింత సరళీకృతం చేస్తూ అన్‌లైన్ ద్వారా కొత్తగా ఓటరు నమోదు, నియో జకవర్గ మార్పు, చిరునామా మార్పు, తొలగింపు వంటి ప్రక్రియలను ఓటరే చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామ న్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ఈ ప్రక్రియపై వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడంలో ప్రజలకు మరింత సేవ అందించాలనే లక్ష్యంతో పనిచేస్తు న్నామన్నారు. సూచనలు, సలహాలు అందించేందుకు ఈ వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల కమిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.చిరంజీవి మాట్లాడుతూ నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ క్రింద ఓటరు నమోదు ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ నేతృత్వంలో నిర్వహిస్తున్నామన్నారు. ఇకపై ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వామ్యం చేసుకుని పవిత్రమైన ఓటు హక్కు ప్రతి ఒక్కరికి కలుగజేయాలనే సరళీకృత విధానం ద్వారా ఆన్‌లైన్ నమోదును చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఓటర్ల నమోదు అంశాలను బూత్‌లెవల్ అధికారులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు.

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది...

- రాజ్యాంగంపై దాడి జరుగుతోంది
- కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే...పోరాటాలకు సిద్ధం కండి
- సీపీఐ నేత డి.రాజా



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ:
దేశంలో రాజ్యాంగంపై దాడి జరుగుతోందని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. మాజీ కేంద్ర మంత్రి ఇ.అహ్మద్ సంస్మరణ సభకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, గులాంనబీ అజాద్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి డి.రాజా ప్రసంగించారు. ప్రస్తుతం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, రా జ్యాంగంపై దాడికి కొన్ని శక్తులు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. దేశ పౌరులుగా దీన్ని అడ్డుకో వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల హక్కులు హరించి వేస్తున్నారని, ప్రజా పోరాటాలను అణగదొక్కాలనే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఒకే తాటి మీదకు వచ్చి దేశాన్ని కాపాడుకోవాలని సూచిం చారు. అలాగే మాజీ కేంద్ర మంత్రి ఇ అహ్మద్ దేశానికి చేసిన సేవల్ని కొనియాడారు. మంచి రాజకీయ వేత్తగా, పరిణితి చెందిన వ్యక్తిత్వంతో వ్యహరించే గొప్ప వ్యక్తి ఇ అహ్మద్ అని అన్నారు. ఇలాంటి వ్యక్తుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు. అహ్మద్‌తో తనకు ఉన్న స్నేహాన్ని రాజా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.